thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 159 | కరీంనగర్ ఆదివారం, 17 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

న్యూఢిల్లీ : పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్లు సూచనలు అందుతున్నాయి. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 3,000కు పెంచే అవకాశం ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ. 1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ. 3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

# భారత్‌పై విషం చిమ్ముతున్న ట్రంప్!

## ఎందుకు ట్రంప్‌కు భారత్‌పై ద్వేషం, చైనాపై ప్రేమ!



## భారత్‌ను ఇరుకున పెట్టేలా ట్రంప్ చేష్టలు!!

## ట్రంప్ డ్రామాలు దేనికోసం?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న భారత్ వ్యతిరేక చేష్టలు తారాస్థాయికి చేరుతున్నాయి. తనకు తాను 'శాంతి దూత'గా పదే పదే చెప్పుకుంటున్న ట్రంప్.. ఇప్పుడు భారత్ పై విషం కక్కుతూ, మన దాయాది దేశాలైన చైనా, పాకిస్థాన్ లపై విపరీతమైన ప్రేమ ఒలకబోస్తూ ఆయా దేశాల్ని దువ్వుతున్నారు. ఇటీవల ప్రపంచ దేశాలపై పెద్ద ఎత్తున ట్రేడ్ టారిఫ్స్ విధించిన అమెరికా అధ్యక్షుడు.. చైనా దగ్గర తన పప్పులు ఉడక్కపోవడంతో చచ్చినట్టు ఆదేశంతో కాళ్ల బేరానికి దిగారు. ఇప్పుడు మరింత దిగజారి చైనాపై టారిఫ్స్ తగ్గిస్తూ, భారత్ మీద భారీగా సుంకాలు, జరిమానాలు పెంచుతూ కొత్త డ్రామాకు తెరతీస్తున్నారు. భారత్ - పాకిస్థాన్ యుద్ధాన్ని తానే ఆపానంటూ అనేక సార్లు ప్రకటించుకున్నారు డోనాల్డ్ ట్రంప్. అయితే, భారత్ దీనిని ఖండించడంతో.. మాట మార్చి తన పాత్రేమీ లేదంటూ ఒకటి రెండు సార్లు వివరణ ఇచ్చారు. అయితే, మళ్లీ పాత పాటే పాడుతూ తన వల్లే యుద్ధం ఆగిందంటూ చాలా మార్లు ప్రకటించారు. అయితే, ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసిన ఘనతను ఎప్పుడూ డోనాల్డ్ ట్రంప్ కు ఇవ్వలేదు భారత్. ఇది ట్రంప్ ఆగ్రహానికి ఒక కారణంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, తక్షణ కారణంగా రష్యాతో భారత్ నెరపుతున్న వాణిజ్య సంబంధాల్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు.

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను ఆపాలని ట్రంప్ ఆదేశిస్తున్నారు. భారత్ ఇస్తున్న డబ్బుతోనే రష్యా.. ఉక్రెయిన్ తో యుద్ధం చేయగలుగుతోందంటూ ట్రంప్ ఆరోపిస్తున్నారు. దీని వల్లే భారత్ మీద 50 శాతం సుంకాలు, జరిమానాలు విధిస్తున్నట్టు చెప్పుకొస్తున్నారు. భారత్ ను ఆడిపోసుకుంటూ.. ఇదే సమయంలో చైనాపైన సుంకాలు తగ్గిస్తున్నట్టు రోజుకో రకమైన ప్రకటనలు చేస్తూ ఇప్పుడు చైనా ప్రేమకోసం ఉవ్విళ్లూరుతున్నారు ట్రంప్.

మరోవైపు, 'అమెరికా ఫస్ట్' విధానాన్ని హైలైట్ చేస్తూ.. భారతదేశం.. అమెరికా మీద ఎక్కువ సుంకాలు (52% వరకు) విధిస్తోందని, ఇది అమెరికాకు నష్టం కలిగిస్తోందని ట్రంప్ వాదిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా BRICS - డాలర్ ఆధిపత్యం. భారత్, రష్యా, చైనాలు BRICS దేశాలలో భాగంగా స్థానిక కరెన్సీలలో వాణిజ్యాన్ని పెంచడం.. డాలర్ ఆధిపత్యానికి ముప్పుగా ట్రంప్ భావిస్తున్నారు. ఈ విధానం అమెరికన్ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుందని ట్రంప్ ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు, భారత్ - చైనా మధ్య మెరుగవుతున్న దౌత్య సంబంధాలు కూడా ట్రంప్ కు కంటగింపుగా మారాయి.

మరోవైపు, మోదీ చైనా పర్యటన అమెరికాకు సవాలుగా మారింది. ఎందుకంటే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా అమెరికా భావిస్తుంది. అందుకే ఇప్పుడు ప్లేటు మార్చి.. చైనా గురించి 'నేను చైనా ప్రజలను ప్రేమిస్తాను' వంటి కొత్త మాటలు మాట్లాడుతున్నారు ట్రంప్. పనిలో పనిగా పాకిస్థాన్ తో విపరీతమైన స్నేహం నెరపుతూ భారత్ ను ఇరుకున పెట్టే తంత్రాలకు సైతం దిగుతున్నారు ట్రంప్.




హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆ ప్రాంతాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని ఆదేశించారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. "జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలి. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలి. నగర, పురపాలక, గ్రామాల పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. వైద్యారోగ్య శాఖ అధికారులు అవసరమైన ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలి. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి. జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ తక్షణమే స్పందించాలి" అని సీఎం ఆదేశించారు.

# చంద్రశేఖరా.. ఏమైంది నీ పార్టీకి.. పతనం దిశగా బీఆర్ఎస్!




తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. మొదటి లక్ష్యం సాధించింది. స్వరాష్ట్రం సిద్ధించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు.. రాష్ట్రం సాధించిన పార్టీగా 2014లో గులాబీ పార్టీకే పట్టం కట్టారు. మరోసారి 2018లో కూడా అవకాశం ఇచ్చారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది.

కానీ ఇప్పుడు పతనం దిశగా పయనిస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి.. నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలతో కూడిన సోషల్ మీడియా వ్యూహంతో కొట్టుమిట్టాడుతోంది. గువ్వల బాలరాజు వంటి నాయకుల వలసలు, పార్టీ సోషల్ మీడియా విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాల లేమి వంటి అంశాలు బీఆర్ఎస్ దిగజారుడుకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

**వ్యక్తిగత విమర్శలతో నష్టం..** బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు వ్యవహారం పార్టీలోని అంతర్గత సమస్యలను స్పష్టంగా తెలియజేస్తోంది. బాలరాజు తన రాజీనామా లేఖలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని గౌరవిస్తూనే, తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ సోషల్ మీడియా బృందం ఆయనను, ఆయన భార్యను వ్యక్తిగతంగా విమర్శిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీ ఇమేజ్‌ను మరింత దిగజార్చింది. రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వెళ్లడం సర్వసాధారణం. అయితే, వలసపోయే నాయకులపై వ్యక్తిగత దాడులు చేయడం, బూతులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు చేయడం వంటివి గులాబీ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచే సోషల్ మీడియా పోస్టులు ఆయనకు తెలియకుండా వస్తున్నవి కావన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి విమర్శలు ప్రజల్లో పార్టీపై చిరాకు, అసహ్యం కలిగించే అవకాశం ఉంది. బాలరాజు స్పందన కూడా ఈ విమర్శలకు బదులుగా తీవ్రంగా ఉండటం, బీఆర్ఎస్ వ్యూహం రివర్స్ అవుతున్నట్లు సూచిస్తోంది.

**సోషల్ మీడియా వైఫల్యం..** బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాలను ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విధానాలతో పోలుస్తున్నారు. వ్యతిరేకులపై అనుచిత వ్యాఖ్యలు, బూతులతో కూడిన ట్వీట్‌లు, తప్పుడు ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన లక్షణాలుగా మారాయి.

ఈ విధానం ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడమే కాక, పార్టీకి ఉన్న మద్దతుదారులను కూడా అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్ మీడియాను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు, కానీ అది సానుకూలంగా, ఆకర్షణీయంగా ఉండాలి. బీఆర్ఎస్ విషయంలో, సోషల్ మీడియా బృందం ప్రతికూల వ్యాఖ్యలపై దృష్టి సారించడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోంది.

**ప్రజా సమస్యలపై పోరాటం ఎక్కడ?...** ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి పోరాటం చేయలేదు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలు ఎక్కువగా రాజకీయ లక్ష్యాలతో లేదా కేసీఆర్ సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి.

తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు ఉపాధి, విద్య, ఆరోగ్యం, లేదా రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఎలాంటి ఉద్యమం చేపట్టలేదు. కేవలం రాజకీయ లాభాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పార్టీ ప్రజల నుంచి దూరమవుతోంది. ఒక బలమైన ప్రతిపక్షంగా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటి కోసం గళమెత్తి, ఉద్యమాలు నడిపితేనే ప్రజల విశ్వాసం సంపాదించగలదు.

**భవిష్యత్ లేని పార్టీగా?...** బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం లేకుండా కొట్టుమిట్టాడుతోంది. పార్టీ నుంచి నాయకులు వలసపోవడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యవహారం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వ్యక్తిగత దూషణలకు దిగడం, దిగజారుడు మాటలు మాట్లాడడం, ఇక కవిత సొంత పార్టీకి దూరం కావడం, గులాబీ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచినప్పటికీ, ప్రస్తుతం పార్టీలో కొత్త నాయకత్వం, కొత్త వ్యూహాలు అవసరమైన సమయంలో పాత విధానాలతోనే ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తోంది.

## తెలంగాణ అక్క చెల్లమ్మలకు...

# రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్..

## మహిళల ఖాతాల్లో నెలకు రూ.2,500!




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే. మహాలక్ష్మీ పథకంలో భాగంగా 18 సంవత్సరాలు దాటిన యువతులు, మహిళలకు నెలకు రూ. 2500 అందించేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. ఈనెల 25వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అన్ని విభాగాల నుంచి కేబినెట్ సమావేశంలో నివేదికలు పంపించాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులకు సూచించారు. అలాగే బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ ముసాయిదా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటంతో దానిపై కూడా ఈ కేబినెట్ భేటీలో చర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహాలక్ష్మి పథకం అమలుకు హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. ఈ స్కీమ్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు నేరుగా నగదు బదిలీ చేయడం ద్వారా వారి జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం మహిళలకు అందించాలని భావిస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని చెప్పారు. భారీవర్షాల సూచన నేపథ్యంలో ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని చెప్పారు. జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు.




మెదక్: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం మూడో రోజూ జలదిగ్బంధంలోనే ఉంది. దీంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అభిషేకం, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. సింగూర్‌లోని నక్క వాగు నుంచి వనదుర్గ ఆనకట్టకు 25 వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో వనదుర్గ ఆనకట్ట పొంగిపొర్లుతోంది. ఈక్రమంలో గర్భగుడి ముందు ఉన్న నదీపాయ రాజగోపురం నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. వనదుర్గ ఆనకట్ట, ఆలయం వైపు భక్తులు ఎవరూ వెళ్లకుండా ఔట్‌పోస్ట్ సిబ్బంది బారికేడ్లు పెట్టి పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తగ్గగానే యథావిధిగా అమ్మవారి దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. మంజీరా నది పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లకూడదని నీటిపారుదల శాఖ డీఈ శివ నాగరాజు హెచ్చరించారు.




హైదరాబాద్: అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో 3 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేడు నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్, జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వివిధ మండలాల్లో తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సిరికొండలోని చికమాన్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుల ఉధృతి వల్ల పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

భైంసా గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు కూడా వరద పెరిగింది. ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి 4,571 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత ఇన్‌ఫ్లో 6,484 క్యూసెక్కులుగా ఉంది.

## ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్ శాఖల విభాగాలతో ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టులు వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

## రాజగోపాల్ రెడ్డి వ్యవహారం క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది: మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తేల్చి చెప్పారు. ఈ అంశంపై త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు. మార్వాడీలు మనలో ఒకరు.. వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదన్నారు. రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని చెప్పారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించామన్నారు. ఆయన వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలిపారు.




రష్యా చమురును కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తాజాగా ఆయన కాస్త వెనక్కి తగ్గినట్లు కన్పిస్తోంది. ఈ అదనపు టారిఫ్‌ల అంశంపై పునరాలోచన చేస్తానని వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కీలక భేటీ ముగిసిన తర్వాత ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉక్రెయిన్‌పై జరుగుతున్న సుదీర్ఘ యుద్ధం ఆపడమే లక్ష్యంగా ట్రంప్ పుతిన్‌తో భేటీ అయ్యారు. అలాస్కా వేదికగా రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో యుద్ధం ముగింపునకు ఎలాంటి ఒప్పందం జరగలేదు. భేటీ సానుకూలంగానే జరిగినట్లు ట్రంప్ తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. “ఈ రోజు జరిగిన పరిణామాల తర్వాత.. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై సుంకాల గురించి ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని నేను అనుకోవడం లేదు. దీనిపై రెండు, మూడు వారాల్లో పునరాలోచన చేస్తా. ప్రస్తుతానికి సమావేశం సాఫీగా జరిగింది” అని ట్రంప్ వెల్లడించారు. కాగా.. పుతిన్‌తో భేటీకి ముందు కూడా ట్రంప్ దీని గురించి ప్రస్తావించారు. భారత్‌ను ఉద్దేశిస్తూ రష్యా తన చమురు క్లయింట్‌ను కోల్పోయిందని వ్యాఖ్యానించారు. అయితే, ప్రస్తుతానికి భారత్, చైనా లాంటి దేశాలపై అదనపు టారిఫ్‌లు విధించే ఉద్దేశం లేదన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో ఇటీవల భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీనిపై అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. పుతిన్‌తో భేటీ సవ్యంగా సాగకపోతే.. భారత్‌పై అదనపు సుంకాలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. మరోవైపు, ఉక్రెయిన్‌పై యుద్ధం ముగించకపోతే రష్యాపైనా 100శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ గతంలో తెలిపారు. ఈ పరిణామాల వేళ పుతిన్‌తో భేటీ తర్వాత టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రస్తుతానికి రష్యాతో పాటు మాస్కో చమురు కొంటున్న దేశాలపైనా సుంకాలు ఉండకపోవచ్చని ట్రంప్ తన వ్యాఖ్యలతో సంకేతాలు ఇచ్చినట్లయింది.




సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ సంచలనాలు సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఓపెన్‌ఏఐ సంస్థ రూపొందించిన ‘చాట్‌జీపీటీ’ సైతం దీనిపైనే ఆధారపడి పనిచేస్తోంది. అయితే, అత్యాధునిక ఏఐ వ్యవస్థలను సరిగ్గా వినియోగించుకోకపోతే ప్రమాదాలు పొంచి ఉన్నాయనే వాదనలు ఉన్నాయి.

‘గాడ్‌ఫాదర్ ఆఫ్ ఏఐ ’గా గుర్తింపు పొందిన జాఫ్రీ హింటన్ సైతం తాజాగా ఇదే విషయాన్ని వెల్లడించారు. లాస్ వెగాస్‌లో జరిగిన Ai4 సమావేశంలో మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఏఐ మానవాళిని తుడిచిపెట్టే అవకాశం ఉందని అన్నారు. దీనిని నివారించడానికి భావోద్వేగ స్పందనలు కలిగి ఉండేలా ఏఐ వ్యవస్థను తీసుకురావాలని చెప్పారు. మానవుల సంరక్షణ పట్ల వాటికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ఏఐ వ్యవస్థలు మానవుల నియంత్రణలోనే ఉన్నాయని.. ఎప్పటికీ ఇలాగే కొనసాగుతాయని మాత్రం చెప్పలేమని జాఫ్రీ హింటన్ అన్నారు. భవిష్యత్తులో ఏఐ మానవమేధస్సును అధిగమించిన తర్వాత మనం పెట్టిన పరిమితులను దాటగలిగే మార్గాలను అది అన్వేషిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల ఓ ఏఐ వ్యక్తిగత రహస్యాలు బయటకు చెప్పేస్తానంటూ ఇంజినీర్‌ను బెదిరించడాన్ని ఆయన ఉదహరించారు. భవిష్యత్తులో మానవులు ఇటువంటి అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అందుకే తల్లీబిడ్డల రీతిలో భావోద్వేగ స్పందనలు కలిగి ఉండేలా ప్రత్యేక ఏఐ వ్యవస్థను రూపొందిచాలని సూచించారు. తద్వారా మానవాళికి ముప్పు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఏఐతో ప్రమాదాలు ఉన్నప్పటికీ ఆరోగ్య రంగంలో దాని వినియోగంతో ఎన్నో ప్రయోజనాలు పొందొచ్చని గాడ్‌ఫాదర్ ఆఫ్ ఏఐ తెలిపారు. ఔషధ అభివృద్ధి, క్యాన్సర్ చికిత్సలో పురోగతి, ముందస్తు రోగ నిర్ధరణ, చికిత్స ప్రణాళికకు ఎంతగానో సహకరిస్తుందని అన్నారు. ఏఐని మించిన సాంకేతికతతో మరో ఐదు నుంచి ఇరవై ఏళ్లలో కృత్రిమ సాధారణ మేధస్సు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.




## నేరాన్ని అంగీకరించిన డాక్టర్ నమ్రత...!

దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. డాక్టర్ నమ్రత నేరం అంగీకరించినట్లు కన్ఫెషన్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. ఆ కన్ఫెషన్ రిపోర్టు ప్రకారం డాక్టర్ నమ్రత ఏం చెప్పిందంటే.. ‘1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ సెంటర్‌ను స్థాపించాను. 2007లో సికింద్రాబాద్లో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించాను. ఆ తర్వాత వైజాగ్‌లోనూ మరో ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించాను. నా రెండవ కుమారుడు జయంతి కృష్ణ న్యాయవాదిగా ఉంటూ సహకరించేవాడు. సరోగసి పేరుతో ఒక్కో జంట దగ్గర 20 నుండి 30 లక్షల వరకు వసూలు చేశాము. ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేశాము. అబార్షన్ కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణీలను గుర్తించి వారికి డబ్బులు ఆశ చూపాము. ప్రసవం తర్వాత వారి పిల్లల్ని కొనుగోలు చేశాము. ఎంతోమంది పిల్లలు లేని దంపతులకు సరోగసి ద్వారా పుట్టిన పిల్లలుగా నమ్మించాము. మొదట మహారాణిపేట పోలీస్ స్టేషన్లో నా మీద కేసు నమోదు అయింది. ఆ తరువాత వైజాగ్ టూ టౌన్ , గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు.. గుంటూరు కొత్తపేటలో మరో కేసు నమోదైంది. 2020లో మహారాణిపేటలో నమోదైన కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చాను. పిల్లల్ని కొనుగోలు చేయడంలో సంజయ్‌తో పాటు సంతోషి కీలకంగా వ్యవహరించారు. సికింద్రాబాద్ సెంటర్లో సూపర్వైజర్ కం ఫార్మసిస్ట్‌గా కృష్ణ.. రిసెప్షనిస్ట్‌గా పద్మ.. టెలికాలర్‌గా అర్చన, మేరీ, సోనా.. నర్సుగా సురేఖ.. ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రభాకర్ ఉన్నారు. వైజాగ్ సెంటర్లో మేనేజర్‌గా కళ్యాణి, ల్యాబ్ టెక్నీషియన్‌గా రమ్య ఉన్నారు. విజయవాడలో డాక్టర్ మధులత, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ కరుణ కీలకంగా వ్యవహరించారు.

అనస్తీషియా డాక్టర్‌గా గాంధీ హాస్పిటల్‌కి చెందిన సదానందం కీలకంగా ఉన్నారు. డబ్బు మొత్తాన్ని వివిధ బ్యాంకులకు బదిలీ చేశాను. సరోగసి కేస్ షీట్లు మొత్తాన్ని ఎవరు ముట్టుకోకుండా భద్రంగా దాచాను. నా కన్సల్టెన్సీ రూమ్‌లో ప్రత్యేక బాక్సులో భద్రపరిచాను. గోపాలపురంలో ఫిర్యాదు చేసిన రాజస్థాన్ దంపతుల కేస్‌లో సరోగసి ద్వారా బిడ్డను ఇస్తానని నమ్మించాను’ అని అంది.




శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువు లోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు తెలియజేయాలని ఇటీవల సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. అందులో రాష్ట్రపతి, గవర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఉన్నత ఆదర్శాలను సూచిస్తాయని పేర్కొంది. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు (%ాబజూతీవఎవ జశీబతీ%) తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

# చందమామతో కొడవటిగంటి విడదీయరాని అనుబంధం

## - ఆగస్టు 17...కొడవటిగంటి కుటుంబరావు వర్ధంతి




దాదాపు ముప్పై సంవత్సరాలుగా ''చందమామ'' సంపాదకవర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ''చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభ వాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు. చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి. తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశితంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుంబాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు - వాటి ప్రభావాలు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర? త్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ - పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు. కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 - 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. “కొకు” గా చిరపరిచితు డైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు. కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రీ, 1920లో తల్లీ మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు. ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు. 1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో ఆయన పెళ్ళి జరిగింది. 1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927-29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేసరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు. 1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురిత మైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాస పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు. 1940 - 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు. 1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950-51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదిం చారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో... నాకు ఒకటే ఆశయం - నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు.

1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# “కాలాన్ని జయించిన కధానిక చిత్రం - షోలే”

## - షోలే 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా




1975 ఆగస్టు 15న దేశం అత్యవసర పరిస్థితి చీకటిలో మునిగిపోయిన రోజులలో, పండుగ దీపంలా వెలిగిన సినిమా 'షోలే'. రమేష్ సిప్పీ ధైర్యమైన దర్శకత్వం, సలీంజావేద్ అజరామరమైన కథనం, ఆర్.డి. బర్మన్ మధురమైన స్వరాలు, అపూర్వమైన తారాగణంఈ సంగమం భారతీయ చిత్రసీమకు చిరస్మరణీయమైన మాస్టర్‌పీస్‌ను అందించింది. ప్రారంభంలో స్పందన సాధారణంగానే ఉన్నప్పటికీ, కొద్ది రోజుల్లోనే మౌఖిక ప్రచారం అగ్నికీలలా వ్యాపించి దేశవ్యాప్తంగా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడాయి. ముంబై మినర్వా థియేటర్‌లో ఐదేళ్లకు పైగా నిరంతర ప్రదర్శన కొనసాగి రికార్డు నెలకొల్పింది. మొదటి ప్రదర్శనలోనే దేశీయ వసూళ్లు ?350 మిలియన్లు దాటగా, దాదాపు శతకోటికి పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. 1979లో సోవియట్ యూనియన్ విడుదలతో మొదటి రన్‌లోనే 48.4 మిలియన్ టికెట్లు విక్రయమై, పునర్విడుదలలతో 6 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడై అంతర్జాతీయ స్థాయిలోనూ విజయ పతాక ఎగరేసింది. ఈ చిత్రమే రెండు దశాబ్దాలపాటు భారతీయ సినీ చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. గ్రామీణ భారతపు నేపథ్యం ఉన్నప్పటికీ, కథ నిర్మాణం డకాయిట్ వెస్ట్రన్ శైలిలో హాలీవుడ్ స్పఘెట్టి వెస్ట్రన్‌ల స్ఫూర్తిని భారతీయ మసాలా మేళవింపుతో స్వదేశీకరించింది. రామగఢ్ అనే ఊరిని ఘరానా దొంగ గబ్బర్ సింగ్ భీకర సంకెళ్ళ నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి థాకూర్ బల్దేవ్ సింగ్, చిన్నచిన్న నేరాలలో పరిమితమై నిమగ్నమైన సాహసవంతులైన జై-వీరూను నియమించు కోవడం కథా కేంద్రం. థాకూర్ చేతులను నరికి వేసిన గబ్బర్ క్రూరత్వానికి ప్రతీకారం తీర్చే ప్రతిజ్ఞ, జై-వీరూ స్నేహం, వీరూ-బసంతి ఉల్లాసం, జై-రాధా నిశ్శబ్ద ప్రేమ, గబ్బర్ భీకరతుఈ భావరేఖలు కథనాన్ని లోతుగా పటిష్టం చేశాయి. పాత్రల ఎంపికే సినిమా శాశ్వత కీర్తికి పునాది అయింది. జై గా అమితాబ్ బచ్చన్ నిశ్శబ్ద ధైర్యాన్ని, వీరూ గా ధర్మేంద్ర ఉత్సాహం-తరుణోన్మత్తతను, బసంతి గా హేమ మాలిని మాటల వేగం%-%నృత్య లావణ్యాన్ని, రాధా గా జయ భాదురి మృదువైన విషాదాన్ని, థాకూరు గా సన్జీవ్ కుమార్ ప్రతిఘటన సంకల్పాన్ని, గబ్బర్ గా అమ్జద్ ఖాన్ భీకరత-వికృత హాస్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. “కిత్నే ఆద్మీ థే?”, “అరే ఓ సంభా!”, “హోలీ కబ్ హై?” వంటి గబ్బర్ సంభాషణలు పల్లెల నుంచి పట్టణాల దాకా జన జీవనంలో భాగమయ్యాయి. సాంకేతికంగా 'షోలే' భారతీయ సినిమాకు కొత్త దారిని చూపింది. బెంగళూరు సమీపంలోని రామనగర రాతి ప్రదేశాలలో రెండు సంవత్సరాలకు పైగా సాగిన చిత్రీకరణ, అప్పట్లోనే 70 మి.మీ. వైడ్‌స్క్రీన్ ప్రింట్లు, ఆరు ట్రాక్ స్టీరియోఫోనిక్ సౌండ్ వినియోగం భారతీయ ఎగ్జిబిషన్ కల్చర్‌కు కొత్త ప్రమాణాలు సృష్టించాయి. హింసాత్మక ఘట్టాలపై సెన్సార్ సూచనలతో అసలు 204 నిమిషాల వెర్షన్‌ను 198 నిమిషాలకు కుదించారు. అసలు ముగింపులో థాకూర్, గబ్బర్‌ను సంహరించే దృశ్యం ఉండగా, సెన్సార్ మార్పులతో గబ్బర్ పోలీసుల చేత అరెస్టవడం చూపించారు. 2014లో 3%ణ% విడుదల, 2025లో ఇటలీ బొలోనియాలో 'ఇల్ సినిమా రిత్రోవాటో'లో రీస్టోర్డ్ ప్రింట్ ప్రత్యేక ప్రదర్శనుఈ చిత్రం కాలాన్ని దాటి పునరావిష్కృతమవుతూ వస్తోంది. సంగీతం విషయంలో ఆర్.డి. బర్మన్ స్వరాలు కథనానికి ఆత్మను అందించాయి. “యే దోస్తీ హమ్ నహీ తోడేంగే” జై%-%వీరూ స్నేహాన్ని శాశ్వతం చేస్తే, “మెహబూబా మెహబూబా” దేశ. వ్యాప్తంగా ఉత్సవ గీతంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గబ్బర్ ఘట్టాలకు భీకరమైన ముద్ర వేసింది. విడుదల సమయంలో కొంత మీడియా విమర్శించినప్పటికీ, ప్రేక్షకుల ఉత్సాహం వసూళ్లను ఆకాశానికెత్తింది. చైనా, సోవియట్ యూనియన్ వంటి మార్కెట్లలో విడుదలై అంతర్జాతీయ గుర్తింపును తెచ్చుకుంది. అవార్డుల పరంగా 1976లో 23వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్సులో అత్యధిక నామినేషన్లు పొందినప్పటికీ, చివరికి ఎడిటర్ ఎం.ఎస్. శిండేకు మాత్రమే బెస్ట్ ఎడిటింగ్ అవార్డు దక్కింది. కానీ 2005లో 50 ఏళ్ల ఫిల్మ్‌ఫేర్ సందర్భంగా 'పచాస్సాల్ కా బెస్ట్ ఫిల్మ్'గా ఎంపికైంది. 2002లో బ్రిటిష్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ నిర్వహించిన పోలింగ్‌లో టాప్ 10 భారతీయ చిత్రాలలో ప్రథమ స్థానం, 2023లో టైమ్ అవుట్ జాబితాలో '100 బెస్ట్ ఇండియన్ ఫిల్మ్స్'లో అగ్రస్థానం సాధించింది. చిత్రీకరణ స్థలం రామనగర నేడు 'షోలే హిల్స్'గా పర్యాటక కేంద్రమై, సినీ యాత్రికులకు యాత్రా స్థలంగా మారింది. తెరపై నిలిచిన జై%-%వీరూ స్నేహం, గబ్బర్ క్రూరత్వం, థాకూర్ ధర్మ సంకల్పం, బసంతి ఉల్లాసం, రాధా నిశ్శబ్దం భారతీయ సామూహిక స్మృతిలో చిరస్థాయిగా నిలిచాయి. డకాయిట్ వెస్ట్రన్, మసాలా, యాక్షన్, హాస్యం, ప్రేమ, ఉత్కంఠంఅన్నీ కలగలిపి ప్రధాన ప్రవాహంలో స్థిరపరిచిన ఈ చిత్రం తర్వాతి తరాల కథకులకు పాఠశాలగా నిలిచింది. యాభై ఏళ్ల తరువాత కూడా 'షోలే' కేవలం ఒక సినిమా కాదు, అది భారతీయ ప్రజా సంస్కృతికి నాడీ స్పందన, శబ్ద-దృశ్యాల సృజనాత్మకతకు ప్రతీక, తరతరాల గుండెల్లో అజరామరంగా నిలిచిన కల. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# లాభం కాదు లక్ష్యం, సేవే ధ్యేయం: జాతీయ లాభాపేక్షలేని దినోత్సవం

**సమాజ హితం కోసం స్వచ్ఛంద కృషి: జాతీయ లాభాపేక్షలేని దినోత్సవ సందేశం - ఆగస్టు 17....జాతీయ లాభాపేక్షలేని దినోత్సవం**




2025 ఆగస్టు 17 ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా జాతీయ లాభాపేక్షలేని దినోత్సవం ఘనంగా జరుపుకోబడుతుంది. ఈ రోజు సమాజ నిర్మాణంలో, మానవ సంబంధాల పరిరక్షణలో, మానవతా విలువల నిలుపుదలలో, అట్టడుగు వర్గాల అభ్యున్నతిలో లాభాపేక్షలేని సంస్థలు పోషిస్తున్న విశిష్టమైన పాత్రను గుర్తించి గౌరవించుకునే సందర్భం. ఆర్థిక లాభాన్ని కాకుండా మానవ సేవనే ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని, నిరంతరం కృషి చేస్తున్న ఈ సంస్థల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడం, వాటి ప్రాముఖ్యతను సామాజిక చైతన్యంలో నిలుపుకోవడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం. లాభాపేక్షలేని దినోత్సవానికి పునాది 1894 ఆగస్టు 17న అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన 'టారిఫ్ చట్టం'లో ఉంది. ఆ చట్టం ద్వారా విద్య, ఆరోగ్యం, మత, దాతృత్వ, విజ్ఞాన, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో పనిచేసే సంస్థలకు ఫెడరల్ ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు కల్పించబడింది. ఈ నిబంధన వల్ల వేల సంఖ్యలోనే కాక లక్షల సంఖ్యలో లాభాపేక్షలేని సంస్థలు ఆర్థిక భారాల నుండి విముక్తి పొంది తమ సేవా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో కొనసాగించగలిగాయి. ఈ చట్టం చారిత్రక ప్రాధాన్యతను, దాని ఫలితంగా అభివృద్ధి చెందిన సేవా రంగాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రసిద్ధ రచయిత, సామాజిక ఉద్యమకారిణి షెరిటా జె. హెర్రింగ్ 'నేషనల్ నాన్‌ప్రాఫిట్ డే'ను స్థాపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు, దాతృత్వ ట్రస్టులు, సేవాసంస్థలు, సహాయ సమితులు తమ సేవా ప్రయాణాన్ని, విజయాలను, భవిష్యత్ లక్ష్యాలను ప్రజలకు పరిచయం చేసుకుంటాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పేదరిక నిర్మూలన, మహిళా శక్తీకరణ, గ్రామీణాభివృద్ధి, మానవ హక్కుల రక్షణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు వంటి విభిన్న రంగాల్లో ఇవి సమాజానికి ప్రాణాధారాలుగా నిలుస్తాయి. అమెరికాలో మాత్రమే లాభాపేక్షలేని రంగం స్థూల దేశీయోత్పత్తిలో 5.4 శాతం వాటా కలిగి ఉంది. 2012లో ఈ రంగం %వి%887.3 బిలియన్ ఆర్థిక విలువను సృష్టించింది. 12 మిలియన్లకు పైగా ఉద్యోగాలను కల్పిస్తూ ఉత్పత్తి రంగం, రిటైల్ రంగాల తరువాత మూడవ అతిపెద్ద ఉద్యోగదాతగా నిలిచింది. ఈ గణాంకాలు లాభాపేక్షలేని రంగం ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థిరత్వం, మానవ వనరుల శ్రేయస్సులో కీలక స్తంభమని నిరూపిస్తున్నాయి. ఈ దినోత్సవం కేవలం గణాంకాల గర్వోత్సవం మాత్రమే కాకుండా, మానవత్వానికి అంకితమైనవారి నిరంతర కృషిని స్మరించుకునే ఆత్మీయ సందర్భం. ఆకలితో అలమటించే వారికి ఆహారం అందించే ఫుడ్ బ్యాంకులు, అనాథలకు ఆశ్రయం కల్పించే ఆశ్రమాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సహాయక చర్యలు చేపట్టే సేవకులువీరి సమర్పణకు ఈ రోజు వందనం చేస్తుంది. ప్రస్తుత ప్రపంచం ఆర్థిక అసమానతలు, సామాజిక విభేదాలు, పర్యావరణ సంక్షోభం, ఆరోగ్య సవాళ్లతో పోరాడుతున్న తరుణంలో లాభాపేక్షలేని సంస్థలు వెలుగుదారి చూపుతున్నాయి. ప్రభుత్వ పరిధి దాటిన అనేక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను అందిస్తూ, సమాజంలో ఆశను నింపుతున్నాయి. ఈ రోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయాన్ని అందించడం సమాజ ధర్మం. దాతృత్వ దానం చేయడం, స్వచ్ఛంద సేవలో పాల్గొనడం, స్థానిక సేవాసంస్థలకు అవసరమైన వనరులను సమకూర్చడం, తమ పరిసరాల్లో అవసరమున్నవారికి చేయూతనివ్వడంఇవన్నీ ఈ దినోత్సవాన్ని అర్థవంతంగా మార్చే మార్గాలు. సోషల్ మీడియా వేదికల ద్వారా చ%చీఫ్ఆశీఖ్రీచీశీఅజూతీశీటఞఖుఎ% వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో అవగాహన పెంపొందించడం, సేవా సంస్థల గురించి సమాచారాన్ని పంచుకోవడం, వాటి అవసరాల కోసం మద్దతు సమకూర్చడం కూడా సమాజ సేవలో భాగమే. కాబట్టి ఈ దినోత్సవం అమెరికా లేదా పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితమైనది కాదుబీ ఇది మానవ సమాజం మొత్తానికి స్ఫూర్తిదాయకమైన మానవీయ విలువల ఉత్సవం. 'సేవే పరమధర్మం' అనే తత్త్వాన్ని ప్రతి ఒక్కరి హృదయంలో మరింత గాఢం చేయడానికి, లాభం కోసం కాకుండా మానవ సౌభ్రాతృత్వం కోసం అంకితమైన ప్రతి చెయ్యి, ప్రతి హృదయం గౌరవించబడాలనే సందేశాన్ని పంచటానికి ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆకాశం నుంచి అగాధం వరకు... మేఘ విస్ఫోటనం విపత్తు

## జీవితాలపై గర్జించిన మేఘాల వర్ష విపత్తు



కాశ్మీర్ లో తాజాగా సంభవించిన మేఘ విస్ఫోటనం మరోసారి ప్రకృతి వైపరీత్యాల భయానక రూపాన్ని చూపించింది. ఆగస్టు 14న జమ్మూ కాశ్మీర్ కిష్త్వార్ జిల్లా ఛాసోటి గ్రామ సమీపంలో మేఘాలు ఒక్కసారిగా చీలి. పడి క్షణాల్లోనే వందల మిల్లీమీటర్ల వర్షం కురవడంతో కొండ చరియలు కూలి పోయాయి, మట్టి ప్రవాహాలు ఉధృత మయ్యాయి, గ్రామాలపైకి నీరు దూసుకువచ్చి వందలాది మంది చిక్కుకు పోయారు. ఈ విపత్తులో అధికారిక గణాంకాల ప్రకారం అరవై మందికి పైగా మృతి చెందగా వంద మందికి పైగా గాయపడ్డారు, రెండువందల మందికి పైగా అదృశ్యమై పోయారు. రక్షణ చర్యలతో సుమారు మూడు వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సంఘటనా స్థలంలో ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు రక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. యాత్రికులు చేరే మచైల్ మాతా ఆలయానికి వెళ్లే మార్గంలోనే ఈ విపత్తు సంభవించడంతో మృతుల సంఖ్య పెరగడానికి కారణమైంది. రెండు నిమిషాల్లోనే ప్రవాహం గ్రామాలను ముంచేసిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇది కొత్త విషయం కాదు. హిమాలయ ప్రాంతాల్లో మేఘ విస్ఫోటనాలు తరచూ సంభవిస్తున్నాయి. మేఘ విస్ఫోటనం ప్రకృతి వైపరీత్యాలలో అత్యంత భయానక రూపం. ఆకాశంలో చిన్న విస్తీర్ణంలో ఏర్పడిన దట్టమైన వర్ష మేఘాలు ఒక్కసారిగా చీలి పడి క్షణాల్లోనే వందల మిల్లీమీటర్ల వర్షం కురిపించడం వల్లే ఈ విపత్తు సంభవిస్తుంది. సాధారణంగా ఒక గంటలో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం ఒకే ప్రదేశంలో పడితే దానిని మేఘ విస్ఫోటనం (%జశ్రీశీబ‌ు దీబతీర్%) అని వాతావరణ శాస్త్రజ్ఞులు నిర్వచించారు. కానీ భారత హిమాలయ ప్రాంతాల్లో ఇది జరిగే వేళ ఒక్క గంటలోనే 100 మిల్లీ మీటర్ల నుండి 250 మిల్లీ మీటర్ల వరకు వర్షపాతం నమోదవుతున్న ఉదాహరణలు ఉన్నాయి. ఇంత పెద్ద ఎత్తున కురిసిన వర్షం వల్ల కొండ చరియలు కూలి పోవడం, ప్రవాహాలు ఉధృతంగా మారడం, గ్రామాలు మొత్తం కొట్టుకు పోవడం తరచూ జరుగు తున్నాయి. మేఘ విస్ఫోటనం శాస్త్రీయంగా ఎలా సంభవిస్తుందో పరిశీలిస్తే, వేడి కారణంగా గాలి లోని నీటి ఆవిరి బలంగా పైకి లేచి ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మేఘాలుగా ఘనీకృత మవుతుంది. గాలి చలనం లేకపోవడం వలన అవి ఒకే ప్రాంతంలో నిలకడగా ఉండి పోతాయి. క్రమంగా ఆవిరి మొత్తం ఒక్కసారిగా కండెన్స్ అయి భారీవర్ష రూపంలో కురుస్తుంది. కొండలపై ఇది జరిగితే ఆ నీరు కిందికి ఉధృతంగా ప్రవహించి చిన్న నదులు కూడా ప్రళయ రూపం దాల్చుతాయి. దీనివల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం అనివార్య మవుతుంది. భారత దేశంలో మేఘ విస్ఫోటనం ఎక్కువగా హిమాలయ ప్రాంతాల్లోనే సంభవిస్తున్నది. జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు దీనికి ప్రధాన కేంద్రాలు. 2010లో లడఖ్ లోని లేహ్ ప్రాంతంలో మేఘ విస్ఫోటనం సంభవించి 200 మందికి పైగా మరణించగా, 400 మందికి పైగా గాయ పడ్డారు. 2013 జూన్‌లో ఉత్తరాఖండ్ లోని కేదార్‌నాథ్‌లో జరిగిన మేఘ విస్ఫోటనం ఆధునిక భారత చరిత్రలోనే అత్యంత ఘోరమైనదిగా పరిగణించ బడుతుంది. ఒకే వర్షపు విస్ఫోటనంతో మందాకిని, అలకనంద నదులు ఉప్పొంగి ముప్పై వేల మందికి పైగా యాత్రికులు చిక్కుకు పోయారు. అధికారిక గణాంకాల ప్రకారం 5,700 మంది ప్రాణాలు కోల్పోయారు. 2021 జూలైలో హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల సమీపంలో మేఘ విస్ఫోటనం సంభవించి కేవలం రెండు గంటల్లోనే 150 మిల్లీ మీటర్ల వర్షం కురిసి పలు వంతెనలు కొట్టుకు పోయాయి. 2022లో అమర్‌నాథ్ యాత్ర గుహ సమీపంలో మేఘ విస్ఫోటనం జరగడంతో మట్టి ప్రవాహాలు ఉధృతమై 16 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు, వందల మంది చిక్కుకు పోయారు. ఈ సంఘటనలు చూపిస్తున్న దేమిటంటే హిమాలయాల భౌగోళిక నిర్మాణం, వాతావరణ మార్పులు మేఘ విస్ఫోటనాలను మరింత ఉధృతం చేస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం గత రెండు దశాబ్దాల్లో మేఘ విస్ఫోటనాల తీవ్రత పెరుగుతూ వస్తోంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో గాలిలో నీటి ఆవిరి అధికమవడం, వాతావరణంలో అస్థిరత పెరగడం కారణాలుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విపత్తు వల్ల కలిగే నష్టం కొద్ది గంటల వ్యవధిలోనే వందల కోట్ల రూపాయల ఆస్తి నష్టం, వందల ప్రాణనష్టం దాకా దారితీస్తుంది. ఉదాహరణకు 2013 కేదార్‌నాథ్ విపత్తు తరువాత ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం సుమారు రూ. 12,000 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. మౌలిక వసతులు ధ్వంసమై పునర్నిర్మాణానికి సంవత్సరాలు పట్టాయి. నివారణ చర్యలలో ముందస్తు అంచనా వ్యవస్థలు కీలకం. భారత వాతావరణ విభాగం డోప్లర్ రాడార్లు, ఉపగ్రహ సాంకేతికతలతో ముందుగానే హెచ్చరికలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నది. కానీ మేఘ విస్ఫోటనం వ్యాసార్థం చిన్నదిగా ఉండడం, సంభవించే సమయాన్ని ఖచ్చితంగా చెప్పలేక పోవడం వల్ల సవాళ్లు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రమాద ప్రాంతాలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పర్వత ప్రాంతాల్లో బలమైన నిర్మాణాలు చేయడం, అటవీ సంరక్షణ ద్వారా మట్టి చరియలు తగ్గించడం వంటి చర్యలు కొంతవరకు ఫలితాన్నిస్తాయి. మేఘ విస్ఫోటనం అనేది మనిషి నియంత్రణలో లేని సహజ విపత్తు. అయినప్పటికీ శాస్త్రీయ పరిశోధనలు, పర్యావరణ పరిరక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేస్తే ప్రాణనష్టం, ఆస్తినష్టం గణనీయంగా తగ్గించవచ్చు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇటువంటి విపత్తులు మరింత ఎక్కువవుతున్నాయని నిపుణుల హెచ్చరికలు మనకు ఒక సంకేతం. కాబట్టి ప్రకృతిని కాపాడటం, పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడం మేఘ విస్ఫోటనాల దుష్పరిణామాలను తగ్గించే అత్యవసర చర్యగా భావించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

# సంపాదకీయం

## ఆస్ట్రేలియాలో భారతీయులపై ఏంటీ దారుణం?

ఆస్ట్రేలియాలో భారతీయులపై జాత్యహంకారపు వేధింపులు ఆగడం లేదు. సిడ్నీ, మెల్‌బోర్న్, అడిలైడ్ వంటి ప్రధాన నగరాల్లో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు ఆ దేశంలోని వలస ప్రజల భద్రతపై ప్రశ్నార్థకాన్ని మిగులుస్తున్నాయి.

ముఖ్యంగా హిందూ ఆలయాలపై విద్వేష పూరిత రాతలు, భారతీయ విద్యార్థులపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

**–ఆలయంపై హిట్లర్ చిత్రంతో విద్వేష రాతలు..** జూలై 21న మెల్‌బోర్న్‌కు సమీపంలోని బోరోనియా ప్రాంతంలో ఉన్న స్వామినారాయణ్ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత గ్రాఫిటీ రాశారు. ఆలయ గోడపై హిట్లర్ చిత్రాన్ని ఉంచి, దాని కింద "Go Home Brown" అంటూ జాత్యహంకార వ్యాఖ్యలు రాయడం తీవ్ర కక్షతత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఇదే ప్రాంతంలోని ఆసియన్ కమ్యూనిటీలకు చెందిన కొన్ని రెస్టారెంట్లపై కూడా ఇలాంటి జాత్యద్వేషపూరిత వాక్యాలు కనిపించడం కలకలం రేపింది.

**–హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా ఆవేదన...** ఈ ఘటనపై హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు మకరంద్ భగవత్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దేవాలయాలు భక్తి, ఐక్యత, శాంతికి ప్రతీకలని, అలాంటి పవిత్ర స్థలాలపై ఇలా దాడులు చేయడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు.

ఇది వలసదారుల మనోభావాలను గాయపరచే చర్యగా ఆయన అభివర్ణించారు.

**–విక్టోరియా ప్రభుత్వం స్పందన...** విక్టోరియా రాష్ట్ర ప్రీమియర్ జసింత్ అల్లన్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం చిత్తశుద్ధి లేని విధ్వంసం మాత్రమే కాదని, ఒక ప్రణాళికాబద్ధమైన ద్వేషచర్యగా ఆమె అభివర్ణించారు. పోలీసులు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. బాధిత ఆలయ నిర్వాహకులకు ఆమె ప్రగాఢ సంఘీభావం తెలిపినట్లు సమాచారం.

**–భారతీయ విద్యార్థిపై దాడి...** ఇక జూలై 19న అడిలైడ్‌లో భారత్‌కు చెందిన చరణ్‌ప్రీత్ సింగ్ అనే విద్యార్థిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కారు పార్కింగ్‌కు సంబంధించిన వివాదం తీవ్రమవడంతో దుండగులు అతనిపై పదునైన ఆయుధాలతో దాడి చేసి, జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. ఈ దాడిలో గాయపడిన విద్యార్థి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా, మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

**–జాత్యహంకారానికి తావు లేదు...** ఈ సంఘటనలు ఆస్ట్రేలియాలో వలసవాదుల భద్రతపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మల్టీకల్చరల్ సమాజంగా పేరు తెచ్చుకున్న ఆస్ట్రేలియాలో ఇలా భారతీయులపై దాడులు జరగడం ఆందోళన కలిగించే విషయం. భారత ప్రభుత్వంతో పాటు, అక్కడి పాలకవర్గాలు, స్థానిక హిందూ సంఘాలు కలిసి ఇలాంటి దాడులపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాత్యహంకారానికి ఎటువంటి స్థలమూ ఉండకూడదు. హింస, ద్వేషం పుట్టించే చర్యలను ఏ దేశమైనా కఠినంగా శాసించాలి. ఆస్ట్రేలియాలోని ఇటీవలి ఘటనలు అక్కడి భారతీయ సమాజాన్ని కలచివేస్తున్నాయి. సమాజంలో ఐక్యత, గౌరవం, భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది.

## కనీస హక్కులకు నోచుకోని పోలీసు వ్యవస్థ - ఆగస్టు 17... బ్రిటీష్ పాలనలో తొలి పోలీసు కమిషన్ ఏర్పాటు దినం



బ్రిటిష్ ప్రభుత్వం, 17 ఆగష్టు 1860 నాడు పోలీస్ కమీషన్ ఏర్పాటు చేసింది. పోలీస్ కమీషన్ తన, నివేదికను 3 అక్టోబర్ 1860, నాడు సమర్పించింది. భారతదేశం లోని పోలీసు సంస్థల గురించిన వివరాలను సేకరించడం, పోలీసు వ్యవస్థలో కొన్ని సంస్కరణలను చేయటం, ఉన్న వాటిని అభివృద్ధి చేయటం గురించి సలహాలు ఇవ్వటము ఈ పోలీసు కమీషన్ విధులు. 22వ మార్చి, 1861న పోలీసు నియంత్రణ కోసం ఒక చట్టం అలా ఏర్పడింది. దీని ఆధారంగానే, నేటికీ అమలులో ఉన్న పోలీస్ చట్టము 1861 ఏర్పడింది. శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. శాంతి భద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్ళను నియంత్రించడం పోలీసు కర్తవ్యం. అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు. విలువైనది ప్రాణం. అలాంటి ప్రాణాన్ని త్యాగం చేయడం అన్నది అత్యున్నత స్థాయి త్యాగం. పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక్క పోలీసు ఉద్యోగమే. ప్రతి ఒక్కరు ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే. ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసే. శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు రక్షణ కల్పించేది పోలీసు వ్యవస్థ. ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్న సత్యం.. అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్లు కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటిష్ పరిపాలన అంతమై డెబ్బది అయిదు వసంతాలు దాటుతున్నా, వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, అధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలిక మార్పులు చోటు చేసుకోక పోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్ళుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాత కూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు, వ్యయ ప్రయాసల కోర్చి అదనపు పని గంటలలో శక్తికి మించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించక పోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల వలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు, పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించు కోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుల్లు మరియు హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధార పడి ఉంటుందనేది నగ్నసత్యం. విధి నిర్వహణలో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండేది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతిఘటనలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాలో, తెలియని స్థితిలో, ఎక్కడికి వెళ్ళాలో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అను క్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పని దినాలు ఈ శాఖ ఉద్యోగులకు ఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతులతో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలం తా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట అంధకారంలో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్య కృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజుల ముందే ఆ ప్రాంతానికి వెళ్ళి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్ళే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్టతో, కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల అగ్రహానికి గురి కాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం. ఇవన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ స్వంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో, అంకిత భావంతో విధులను నిర్వర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలు, బహుమానాలు, ఎక్కువగా అధికారులకే దక్కుతాయనేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో "ధర్మవీర కమిషన్" సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. "సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్ట పరిరక్షణే ధ్యేయంగా, ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు "స్వీయ రక్షణే" నేటి పరిస్థితుల్లో కరువు కాగా, త్యాగశీలురైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధినిర్వహణలో మమేక మవుతున్నారు.

**"పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి"...** తెలంగాణ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. అలాగే పోలీసు స్టేషన్లకు పెద్దమొత్తంలో కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతి పోలీసు స్టేషన్ కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశ్యంతోనే మొత్తం 600 టాటా సుమోలు, 1600 ఇన్నోవాకార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలుతో పాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషను 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషను 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేల చొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్ఠ పరిచారు. ఇటీవల 'హోంగార్డు'లకు జీతభత్యాలను కూడా పెంచింది. ప్రధానంగా "మీ వెంటే మేమున్నాం" అంటూ వారికి అన్ని విధాలా అభయహస్తం అందిస్తూ, "మీ సంక్షేమమే మాకు ముఖ్యం" అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## భారత పాకిస్థాన్ మధ్య చిచ్చు పెట్టిన హద్దుల విభజన - ఆగస్టు 17... భారత్, పాక్ మధ్య విభజన దినం

రాడ్ క్లిఫ్ రేఖ అంటే చాలా మందికి తెలియక పోవచ్చు. అది భారత, పాకిస్తాన్ మధ్య విభజన రేఖ. సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ నేతృత్వంలోని సరిహద్దుల కమిషన్ ఈ రేఖను నిర్ధారించింది. రాడ్ క్లిఫ్ రేఖ 1947 ఆగస్టు 17న భారత దేశ విభజన అనంతరం భారత పాకిస్తాన్ ల నడుమ సరిహద్దు రేఖగా ఏర్పరచారు. భారత్ లో బ్రిటిష్ రాజ్యం మరో నెల రోజుల్లో, అంటే 1947 ఆగస్టు 15న ముగుస్తుందని భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ద్వారా బ్రిటిష్ పార్లమెంటు 1947 జూలై 15న పేర్కొంది. భారత దేశాన్ని రెండు భాగాలుగా విభజించాలని కూడా అది వివరించింది. పాకిస్తాన్ ముస్లింల రాజ్యంగా కొనసాగాలని, అదే సమయంలో భారత్ హిందూ మెజారిటీతో కూడిన లౌకిక రాజ్యంగా ఉండాలని ఉద్దేశించారు. ఉత్తరాదిన ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతాలు పాకిస్తాన్ గా రూపుదిద్దు కోవాలని నిర్ణయించారు. బలూచిస్థాన్ (విభజనకు ముందు 91.8 శాతం ముస్లిం జనాభా), సింధ్ (72.7 శాతం ముస్లిం జనాభా) ప్రావిన్సులను పూర్తిగా పాకిస్తాన్ కు కేటాయించారు. అయితే, ఈశాన్య బెంగాల్ (54.4 శాతం ముస్లింలు), వాయవ్యాన పంజాబ్ (55.7 శాతం) ప్రావిన్సుల్లో పూర్తిగా ముస్లిం మెజారిటీ లేకపోయింది. దాంతో పంజాబ్ పశ్చిమ భాగం పశ్చిమ పంజాబ్ మారింది. తూర్పు ప్రాంతం పంజాబ్ రాష్ట్రం పేరుతో భారత్ లో అంతర్భాగమైంది. బెంగాల్ కూడా అదే మాదిరిగా తూర్పు బెంగాల్ పాకిస్తాన్ లో, పశ్చిమ బెంగాల్లో భారత్ లో విలీనమైంది. ఇక పంజాబ్ లో జనాభా విస్తృతి సంక్లిష్టంగా ఉంది. దాంతో దాన్ని హిందూ, ముస్లిం, సిక్కుల ప్రాంతాలుగా స్పష్టంగా విభజించ లేని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా మహ్మదాలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్, జవహర్ లాల్ నెహ్రూ, పటేల్ సారథ్యం లోని భారత జాతీయ కాంగ్రెస్, బ్రిటిష్ వారందరినీ సంతృప్తి పరిచే విభజన ప్రణాళిక కూడా ఏదీ లేకపోయింది. వీలనంత త్వరగా భారత్ ను విడిచి వెళ్లిపోవడమనే బ్రిటిష్ ప్రభుత్వ తక్షణావసరాల కారణంగా ఐక్యరాజ్య సమితి వంటి బయటి సంస్థల నిపుణులకు సరిహద్దు నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం లేకపోయింది. భారత వైస్రాయిగా పనిచేసిన లార్డ్ వేవెల్, అంతకు ముందు 1947 ఫిబ్రవరిలో లార్డ్ లూయిస్ మౌంట్బాటెన్ అప్పటికే ఒక సరిహద్దు రేఖను సిద్ధం చేశారు. రెండు దేశాలకు ఏయే ప్రాంతాలను అప్పగించాలో ఇదమిత్థంగా నిర్ధారించేందుకు 1947 జూన్ లో సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ ను బెంగాల్, పంజాబ్ సరిహద్దు కమిషన్లు రెండింటికీ చైర్మన్ గా బ్రిటన్ నియమించింది. పంజాబ్ లో ముస్లిం, ముస్లిమేతర మెజారిటీ ప్రాంతాలను వీలైనంత స్పష్టంగా విడదీస్తూ ఇరు ప్రాంతాల మధ్య సరిహద్దులను నిర్ధారించా ల్సిందిగా




కమిషన్ కు సూచనలందాయి. 1947 జులై 8న ఢిల్లీలో అడుగు పెట్టిన రాడ్ క్లిఫ్.. ఆగస్టు 12 నాటికి పూర్తి చేశారు. భారత్ గురించి ఏ మాత్రం తెలీకుండా.. చివరకు బెంగాల్.. పంజాబ్ ప్రాంతాలు ఎక్కడ ఉంటాయో కూడా తెలీకుండానే రాడ్ క్లిఫ్ దేశ విభజనను పూర్తి చేయటం విశేషం. భారత్ గురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి, తనకు చెప్పిన పనిని చెప్పినట్లుగా చేయటం, అందుకు తనకున్న అవగాహనతో గీసిన గీతలు, నిర్ణయించిన హద్దులు, కోట్లాది మంది ప్రజల బతుకుల్ని, భవిష్యత్తును నిర్దేశించాయి. భారీ మారణ హెరీమానికి కారణ మయ్యాయి. జూలై 8న భారత్ వచ్చాక, రాడ్ క్లిఫ్ కు సరిహద్దు నిర్ణయానికి కేవలం 5 వారాలు మాత్రమే ఇచ్చారు. ఆయన వెంటనే తన కాలేజీ సహాధ్యాయి మౌంట్ బాటెన్ ను కలిశాడు. తర్వాత ఇద్దరూ లాహౌర్, కలకత్తా వెళ్లి కమిషన్ సభ్యులను కలిశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి నెహ్రూను, ముస్లిం లీగ్ అధ్యక్షుడు జిన్నాను కలుసుకున్నారు. అంత తక్కువ కాలావధి ఇవ్వడాన్ని ఆయన అభ్యంతర పెట్టారు. కానీ ఆగస్టు 15న భారత్ నుంచి బ్రిటిష్ వారు వెళ్లిపోయే లోపే ఈ పని పూర్తవాలని ఇరు వర్గాలూ పట్టుబట్టాయి. దాంతో మరో అవకాశం లేకపోయింది. ఈ తక్కువ డెడ్ లైన్ షరతు మీదే మౌంట్బాటెన్ భారత వైస్రాయి పదవిని అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని బ్రిటిష్ వారు వెళ్లిపోవడానికి కేవలం 2 రోజుల ముందే తీసుకున్నారు. కానీ రాజకీయ కారణాల వల్ల ఆగస్టు 17 దాకా, అంటే భారత్, పాకిస్తాన్లకు స్వాతంత్ర్యం ఇచ్చిన రెండు రోజుల దాకా దాన్ని బయట పెట్టలేదు. రాడ్ క్లిఫ్ తన నియామకానికి ముందు భారత్ ను ఒక్కసారి కూడా సందర్శించ లేదు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి క్రిస్టోఫర్ బీమంటకు మాత్రమే పంజాబ్ జీవన విధానం, అక్కడి యంత్రాంగాన్ని గురించిన అవగాహన ఉంది.. తన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉందని నిరూపించు కోవడానికి గాను కనీసం వైస్రాయ్ మైంట్బాటెన్ కూడా కలవకుండా రాడ్ క్లిఫ్ పూర్తి దూరం పాటించారు. రాడ్ క్లిఫ్ కు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అనుకూలంగా గ్రామాలను విభజించడానికి జాగ్రత్తలు తీసుకునే సావకాశం చిక్కలేదు. ఆయన నిర్ధారించిన సరిహద్దు అస్తవ్యస్తమైంది. కొన్ని ప్రాంతాల మధ్య నుండి కాక నేరుగా వాటి మీదుగా వెళ్లింది. విభజన రేఖ ఒకే ఇంట్లో కొన్ని గదుల్ని భారత్ కు, మరికొన్ని గదుల్ని పాకిస్తాన్ కు కూడా కేటాయిస్తూ సాగిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండడం గమనార్హం. రాడ్ క్లిఫ్ తాను భారత్ నుంచి వెళ్లే ముందు ఈ ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలనూ నాశనం చేశాడు. ఆయన స్వాతంత్ర్య దినం రోజునే భారత్ విడిచి వెళ్లిపోయాడు. తాను నిర్ణయించిన సరిహద్దులను సాధికారికంగా ప్రకటించడానికి కూడా ముందే దేశాన్ని వదిలాడు. అన్ని రికార్డులనూ రాడ్ క్లిఫ్ నాశనం చేయగా, మౌంట్బాటెన్ కూడా ఈ విషయాలు తనకేమీ తెలియదని చెప్పారు. విభజన అనంతరం. సరిహద్దు రేఖల నిర్ణయాన్ని అమలు చేసుకోవాల్సిన బాధ్యత భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలపై పడింది. 1947 ఆగస్టు 15న తాము సరిహద్దులకు ఏ వైపుకు చెందామన్నది అక్కడి గిరిజనుల్లో చాలామందికి తెలియక పోవడాన్ని బట్టి ఎంత అవగాహన రాహిత్యంతో విభజించారో అర్థం చేసుకోవచ్చు. చివరికి విభజన అమలు సందర్భంగా... ఉపఖండంలో దాదాపు 1.4 కోట్ల మంది ప్రజలు సొంత ఇళ్లను వదులుకున్నారు. బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు, లారీలు, ఎడ్లబళ్లు, ఇంకా అత్యధికులు కాలి నడకన తమ సొంత వారితో కలిసి ఆవాసాన్ని వెదుక్కునేందుకు బయల్దేరారు. వారిలో చాలామంది అవతలి పక్షం వారి చేతుల్లో హత్యకు గురయ్యారు. మరికొందరు ఆకలికి తాళలేక ప్రాణాలు విడిచారు. ఇంకా కొంతమంది ప్రాణాంతక వ్యాధులకు బలయ్యారు. ఈ మొత్తం ప్రక్రియలో మరణించిన వారి సంఖ్య కనీసం 2 లక్షల (ఇది ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్న గణాంకాలు) నుంచి 20 లక్షల దాకా ఉంటుందని అంచనా వేశారు. అంతిమంగా ఈ సరిహద్దు వివాదాలే భారత్, పాకిస్తాన్ మధ్య 1947, 1965, 1971ల్లో యుద్ధాలకు కూడా దారితీశాయి. 1998 మేలో కూడా ఇరు దేశాలూ అణ్వాయుధ పరీక్షలు జరిపేందుకు, 1999లో కార్గిల్ యుద్ధానికి కూడా అవే కారణమయ్యాయి. నాటి తొందరపాటు చర్యలతో అస్తవ్యస్త విభ జన ఫలితంగా నేటికీ భారత పాకిస్థాన్ దేశాల మధ్య వివాదాలు కొన సాగుతూ, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థితి నెలకొని ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## వలస పాలనకు చివరి అడుగు - 1947 ఆగస్టు 17 - 1947 ఆగస్టు 17.. - భారత స్వాతంత్రానంతరం మొదటి బ్రిటీష్ దళాలు స్వదేశానికి బయలు దేరిన దినం

1947 ఆగస్టు 15 ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతుండగా, జవహర్‌లాల్ నెహ్రూ స్వరంలో "ట్రిస్టు విత్ డెస్టిని" ప్రతిధ్వనిస్తూ, రెండు శతాబ్దాల బ్రిటిష్ వలస పాలనకు ముగింపు పలికిన చారిత్రక క్షణాన్ని దేశం సాక్షిగా చూశింది. ఆ రోజు దేశమంతా ఉత్సవ వాతావరణంలో మునిగిపోయినా, స్వాతంత్ర్యం యొక్క ఆచరణాత్మక రూపం ఇంకా ఒక ముఖ్యమైన ఘట్టాన్ని ఎదురుచూస్తోంది. అది భారత భూభాగం మీద చివరి బ్రిటిష్ సైనిక బూట్లు ఎత్తిపడేసే క్షణం. ఈ చరిత్రాత్మక సందర్భం ఎక్కువ కాలం వేచి చూడాల్సి రాలేదు. స్వాతంత్ర్యం వచ్చిన రెండో రోజే, 1947 ఆగస్టు 17న, ముంబై నౌకాశ్రయంలో ఆ మౌనమైన కానీ అతి ప్రాముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతంత్ర్యం ప్రకటించిన వెంటనే బ్రిటిష్ ప్రభుత్వం, భారత నాయకత్వం కలిసి దేశంలో మోహరించి ఉన్న బ్రిటిష్ సైన్యాన్ని స్వదేశానికి తరలించేందుకు కచ్చితమైన ప్రణాళిక రూపొందించాయి. అప్పటికి భారత భూభాగంలో డెబ్బై వేల మందికి పైగా బ్రిటిష్ సైనికులు, నావికాదళ సిబ్బంది, వైమానిక దళ సభ్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో చాలామంది ద్వితీయ ప్రపంచ యుద్ధం సమయంలో తూర్పు రంగంలో యుద్ధసామగ్రి రవాణా, దక్షిణ ఆసియా రక్షణ, జపాన్ దళాల ఎదుర్కోలులో కీలక పాత్ర పోషించారు. యుద్ధం ముగిసినా, బ్రిటిష్ పాలన కొనసాగడంతో వారు ఇక్కడే మోహరించి ఉన్నారు. స్వాతంత్ర్యం సాధించాక వీరి అవసరం తీరిపోవడంతో, దశలవారీగా వెనక్కి పంపే చర్యలు ప్రారంభమయ్యాయి. ఆగస్టు 17 ఉదయం ముంబై (అప్పటి బాంబే) నౌకాశ్రయంలో చరిత్ర సజీవమైంది. సముద్రతీరంలో గాలిలో ఉప్పెన వాసన తేలుతుండగా, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆ చారిత్రక దృశ్యాన్ని కళ్లారా చూసేందుకు చేరుకున్నారు. తీరానికి ఆనుకుని "HMIS ఆర్జెంటినా" మరియు "%ఎమీ% విండ్సర్" అనే రెండు భారీ నౌకలు సముద్ర యాత్రకు సిద్ధంగా నిలబడ్డాయి. ఇవే తొలి విడత బ్రిటిష్ సైనికులను స్వదేశానికి తీసుకెళ్లబోతున్నాయి. త్రివర్ణ పతాకం గర్వంగా ఎగురుతూ ఉండగా, నౌకాశ్రయ బ్యాండ్ "ఆల్డ్ లాంగ్ సైన్" స్వరాలు గాలిలో మృదువుగా మ్రోగాయి. సైనికులు తమ ఖాకీ యూనిఫార్మ్‌లలో మెరిసిపోతూ, క్రమబద్ధమైన అడుగులతో నౌకలపైకి ఎక్కారు. భారత సైన్యాధికారులు వారికి సెల్యూట్ చేస్తూ, వ్యక్తిగత ద్వేషం లేకుండా చరిత్రకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికారు. ప్రజలు తీరాన నిలబడి మౌనంగా ఆ దృశ్యాన్ని వీక్షించారు. కొందరు చేతులు ఊపి వీడ్కోలు పలికారు, మరికొందరి కళ్లలో ఆనందం, గర్వం, చరిత్ర ముగింపుపై ఉప్పొంగిన భావోద్వేగాలు కలగలిపి మెరిశాయి. ఆ రోజు బయలుదేరిన ఈ దళాలు కేవలం సైనికులు కాదు, రెండు శతాబ్దాల వలస పాలనకు ప్రతీకలుగా నిలిచిన అడుగులు. రాజకీయంగా స్వేచ్ఛ పొందినా, భూభాగ రక్షణ, సైనిక పరిపాలనలో బ్రిటిష్ ఉనికి కొనసాగితే అది అసంపూర్ణ స్వాతంత్ర్యమే అవుతుంది. ఈ ప్రయాణం భారత సైన్యం తన భూభాగ భద్రతపై పూర్తి అధికారం చేపట్టే దిశగా వేసిన తొలి దృఢమైన అడుగు. ఈ ఘట్టం తర్వాత దశలవారీగా మిగిలిన బ్రిటిష్ దళాలను 1948 జూన్ నాటికి పూర్తిగా వెనక్కి పంపారు. అదే సమయంలో పాకిస్తాన్‌లోనూ



ఇదే విధానం అమలులోకి వచ్చింది. ద్వితీయ ప్రపంచ యుద్ధం తర్వాత ఆసియా ఖండంలో బ్రిటిష్ సైనిక ఆధిపత్యం క్షీణించిన ముఖ్య ఘట్టాలలో ఇదొకటి. ముంబై నౌకాశ్రయం నుంచి బయలుదేరిన ఆ నౌకలు కేవలం సముద్ర యాత్రల కోసం కాకుండా, ఒక యుగాన్ని వీడ్కోలు చెప్పే గౌరవప్రదమైన ప్రయాణం కోసం సాగాయి. తీరంపై నిలబడి ఉన్న ప్రతి ఒక్కరి మనసులో ఆ రోజు ఒకే భావన ు ఇది కేవలం ఒక సైనిక దళం బయలుదేరడం కాదు, ఇది భారత స్వాతంత్ర్యం పూర్ణత్వానికి ముద్ర వేసిన ఘట్టం, ఇది రెండు శతాబ్దాల పాలనకు గౌరవప్రదమైన ముగింపు, ఇది స్వేచ్ఛ గాలి పూర్ణంగా భారత భూమిని ఆవహించిన చరిత్రాత్మక క్షణం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఎరువు... బరువు..!

మిర్యాలగూడ : అందరికీ అన్నం పెట్టే రైతన్నపై ప్రతి ఏటా కూలీలు, పొలం దున్నేందుకు వినియోగించే యంత్రాల కిరాయిలు వంటి పెంపుతో భారం పడుతుంది. ఇది కాక మూడేళ్లుగా ఏటా కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఆయా కంపెనీలు పెంచుతుండగా 'మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా' మారింది రైతన్న పరిస్థితి. వరి పండించే రైతులు నాటు వేసిన తర్వాత 20 రోజుల నుంచి కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ప్రారంభిస్తారు. దీంతో అదును చూసి ఆయా కంపెనీల వారు 2023 నుంచి ప్రతి ఏటా సీజన్ ప్రారంభమైన తర్వాత ధరలు పెంచుతూ సగటున బస్తాపై మూడేళ్లలో రూ.400ల వరకు పెంచడంతో



**అన్నదాత గగ్గోలు**

ఓ వైపు వ్యవసాయ శాస్త్రవేత్తలు కాంప్లెక్స్ ఎరువుల అధిక వినియోగం తగ్గించాలని దీంతో పోషకాల అసమతుల్యత, సూక్ష్మ పోషకాల లోపం, కీటకాలు, తెగుళ్లు పెరుగుతాయని దీనికి భిన్నంగా సహజ సిద్ధమైన విధానాలు అనుసరించాలని రైతులకు సూచిస్తున్నారు. అయినా సులభ విధానంలో బస్తాలు కొనుగోలు చేసి కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. రైతులు పంటల సాగు విధానంలో కొంత మార్పు చేసుకుని నానో ఎరువులను వినియోగించాలని, సహజసిద్ధమైన పచ్చిరొట్ట పైర్లకు సాగు చేస్తే సేంద్రియంగా మేలు జరుగుతుందని ఇన్‌ఛార్జ్ ఏడీఏ సైదానాయక్ తెలిపారు. పెసర, కంది, అలచంద పండించడంతో నత్రజని లభిస్తుందని, వర్మి కంపోస్టు, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే పంటలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ఏటా ధరల భారం: ధనావత్ రవినాయక్, భల్లూనాయక్ తండా మూడేళ్లుగా ప్రతి ఏటా కాంప్లెక్స్ ఎరువులు కొనేందుకు వెళ్లిన సమయంలో ధరలు పెరిగాయని చెబుతున్నారు. కంపెనీల వారిపై ప్రభుత్వం నియంత్రణ ఏర్పాటు చేసి ఎరువుల ధరలు పెంచకుండా స్థిరంగా ఉండేలా చూడాలి. మూడేళ్ల క్రితం కంటే 50 కిలోల బస్తాకు రూ.200 వరకు ధరలు పెరగడం ఇబ్బందిగా ఉంది.

# చుట్టుకొలతలో.. నలత..!

చౌటుప్పల్: జిల్లాలోని అయిదేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం రోజురోజుకూ పెరుగుతోంది. వీరు శారీరకంగా, మానసికంగా బలంగా ఎదిగితేనే ఆ కుటుంబ, దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. పిల్లల జీవితంలో తొలి అయిదేళ్ల వయసు కీలకమైంది. ఈ దశలోనే పిల్లల శారీరక, మానసిక వికాసానికి పునాది పడుతుంది. పెరుగుదల, వికాసం ఎంతో వేగంగా జరుగుతుంది. పోషకాహారానిదే ఈ అభివృద్ధిలో కీలకపాత్ర. వారిలో పోషకాహార లోపం ఏర్పడకుండా ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రతి ఆవాసంలో అంగన్‌వాడీ కేంద్రాలను నెలకొల్పింది. సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ద్వారా అవసరమైన పోషకాహారాన్ని ఉచితంగా కొన్ని దశాబ్దాలుగా పంపిణీ చేస్తుంది. అయినా జిల్లాలో అయిదేళ్ల లోపు పిల్లల్లో పోషణ లోపమున్నట్లు అంగన్‌వాడీల్లో నిర్వహించే కొలతల్లో గుర్తిస్తున్నారు. పోషణ లోపం ఉన్న పిల్లలు వారి వయసుకు తగిన ఎత్తున్నారా,ఎత్తుకు తగిన బరువున్నారా?.. అనే కొలమానాలతో గుర్తిస్తారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన 0 నుంచి అయిదేళ్ల లోపు పిల్లలందరికీ నెలకోసారి బరువు, మూడు నెలలకోసారి ఎత్తు పరీక్షించి పోషణ లోపాన్ని గుర్తిస్తారు.

సులువైన పద్ధతిలో 'జబ్బచుట్టు కొలత' ద్వారా అతి తీవ్ర పోషణ లోపాన్ని గుర్తిస్తున్నారు. కొలత తీసే టేపుపై మిల్లీమీటర్లు, సెంటీమీటర్లు ముద్రించి.. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులుగా విభజించి ఉంటుంది. ఏడు నెలల నుంచి అయిదేళ్ల పిల్లలను ఈ టేపుతో కొలత తీసి వారి పోషణ స్థాయిని గుర్తిస్తారు. తీవ్ర పోషణ లోపమున్నట్టు గుర్తిస్తే 'బాలామృతం' ఉచితంగా అందజేస్తారు. సాధారణంగా ఇచ్చే దానికంటే ఇందులో అదనపు పోషకాలుంటాయి.

**పోషణ లోపాన్ని నివారిస్తున్నాం..:** నర్సింహారావు, జిల్లా సంక్షేమాధి కారి, యాదాద్రి భువనగిరి

గర్భిణులు, బాలింతల్లో పోషణలోపం నివారణకు ఒక పూట సంపూర్ణ భోజనం అంగన్‌వాడీల్లో ప్రభుత్వం అందిస్తుంది. పిల్లలకు కోడిగుడ్లు, బాలామృతం అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేస్తున్నాం. అతి, తక్కువ తీవ్రత పోషణ లోపమున్న పిల్లలను కొలతల ద్వారా గుర్తించి వారికి బాలామృతం అందజేస్తున్నాం.

# లోలెవెల్ కల్వర్టులు.. రోడ్లపైకే నీళ్లు

మేళ్లచెరువు : భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసినప్పుడు పెద్ద ఎత్తున వరదలొస్తాయి. ఈ వరదల దారి, ధాటి కూడా ఒక్కోసారి అంచనా వేయలేనంత ఉంటుంది. ఈ వరదలు పంట పొలాలపై పడొచ్చు. వాగుల వెంబడి ఉండే వీధులు, ఇళ్లలోకీ చొచ్చుకుని రావొచ్చు. ఏదో ఒక రూపంలో నష్టం తేవొచ్చు. ఇంతటి నష్టానికి ఆస్కారం ఇచ్చే వాటిలో లోలెవెల్ కల్వర్టులు కూడా ఉన్నాయి. వీటిలో గ్రామాల మధ్యలో వాగులపై ఎప్పుడో నిర్మించినవి కొన్నుంటే.. గ్రామాల సరిహద్దుల్లో మరికొన్ని నిర్మించారు. నీటి ప్రవాహానికి అనుగుణంగా వాలు తలం వైపు తోవ ఏర్పడి నీరు ప్రవహించే మార్గాన్ని వాగులుగా గుర్తించి ఏనాడో పెద్దలు ఆ ప్రాంతం వరకు వదిలేశారు. ఆ నీటి ప్రవాహానికి ఏ అడ్డు లేకుండా చూసేవారు. రాన్రానూ అలా వదిలేసిన వాగుదారులూ చాలాచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. చెత్త, వ్యర్థాల డంపింగ్ యార్డులయ్యాయి. వాగుల్లోనూ తూటికాడ పెరిగింది. వీటన్నింటికి ఎప్పుడో గూనలతో నిర్మించిన లోలెవెల్ కల్వర్టులు తోడయ్యాయి. వెరసి.. భారీ వర్షాలు, వరదలొచ్చినప్పుడు వరదనీరు దారి తప్పుతోంది. తూటాకు ఉన్న చోట్ల పక్కనున్న పంట పొలాలు, వీధుల్లోకి వరదనీరు వెళ్తోంది. తక్కువ ఎత్తులో ఉన్న కల్వర్టులపైకి ఎక్కుతోంది. ప్రధాన రహదారులపైకి ఉధృతిగా వరదనీరు వస్తోంది.

ఎత్తయిన వంతెనలు అవసరం.. చింతలపాలెం మండలం దొండపాడు, చిరలపాలెం, గుడిమల్కాపురం, వజినేపల్లి, బుగ్గమాధారం తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి దాపురించింది. మేళ్లచెరువు, రేవూరు ప్రాంతాల వాగుల్లో ప్రవహించిన నీరంతా.. కృష్ణానదికి సమీపంలో ఉన్న వజినేపల్లి, బుగ్గమాధారం వాగుల్లో కలిసిపోతుంది. ఇక్కడా లోలెవెల్ కల్వర్టులు ఉన్నందున నీరు రోడ్ల పైకెక్కుతోంది. చుట్టు పక్కల పంట పొలాలపై ఈ వరద పోటు పడుతోంది. ముమ్మందు వరదనీటి ప్రభావం ఇంతగా నష్టం లేకుండా ఉండాలంటే.. ఎగువ నుంచి వాగులన్నిటిలో వ్యర్థాలను తొలగించాలి. మలుపులు తగ్గించి బాగు చేయాలి. రోడ్లపై ఉన్న లోలెవెల్ కల్వర్టులను తొలగించాలి. వాటి స్థానంలో ఎత్తుగా వంతెనలు నిర్మించాలి. ఇలాంటి సందర్భంలోనే అధికార యంత్రాంగం నూతన వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

# పట్టాలెక్కని రెండోదశ మెట్రో



హైదరాబాద్: కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రతిసారీ హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశకు అనుమతి వస్తుందేమో అని ఆశగా ఎదురుచూడటం.. లేదని తెలిసి నిరాశపడటం పరిపాటిగా మారింది. గత సమావేశంలో పుణె మెట్రోరైలు ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వగా... ఈసారి లఖ్‌నవూ మెట్రో విస్తరణకు కేంద్రం పచ్చజెండా ఊపింది. 2014కి ముందు దేశంలో 5 నగరాల్లో 248 కి.మీ మెట్రోరైలు మార్గం ఉండేది. భాజపా అధికారంలోకి వచ్చాక మెట్రో నెట్‌వర్క్ 23 నగరాల్లో 1013 కి.మీ.పెరిగింది. ఈ 11 ఏళ్లలో 765 కి.మీ. నిర్మాణమైంది. నెలకు సగటున 6 కి.మీ. మెట్రో విస్తరణ జరుగుతోందని కేంద్రం వెల్లడించింది. అప్పట్లో రోజువారీ సగటు ప్రయాణికుల సంఖ్య 28 లక్షలు ఉంటే.. ప్రస్తుతం 1.12 కోట్లకు పెరిగింది.

**రూ.లక్షన్నర కోట్లు**

దేశవ్యాప్తంగా మెట్రోరైలు ప్రాజెక్టులకు పదకొండేళ్లలో రూ.2.50 లక్షల కోట్లు వ్యయం అయ్యింది. 2020-21 నాటికి కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చిన నిధులు రూ.74,408 కోట్లు అని అప్పటి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రి పార్లమెంట్‌కు వెల్లడించారు. ఆ తర్వాత ఐదేళ్లలో ఇదే స్థాయిలో నిధులు అందాయి. ఆ ప్రకారం ఇప్పటివరకు కేంద్రం ఆయా రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్లను మెట్రోరైలు ప్రాజెక్టులకు మంజూరు చేసింది.

**మనకు దక్కింది ఒక శాతంలోపే..**

రూ.లక్షన్నర కోట్ల నిధుల్లో హైదరాబాద్ మెట్రోకి ఇప్పటివరకు దక్కింది ఒక శాతం కూడా లేదు. రూ.20వేల కోట్ల మొదటిదశ ప్రాజెక్టులో సర్దుబాటు వ్యయం నిధి కింద కేంద్రం రూ.1246 కోట్లకు రూ.1200 కోట్లు ఇచ్చింది. పాతబస్తీ పనులు జరగకపోవడంతో మిగిలిన నిధులు నిలిపేసింది. తర్వాత లక్డీకాపూల్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు మెట్రో విస్తరణకు గత ప్రభుత్వం నిధుల కోసం కేంద్రానికి నివేదించగా వయబులిటీ కాదని నిరాకరించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మెట్రో 2(ఏ)కు పది నెలల క్రితం, మెట్రో 2(బి) ప్రాజెక్టను నెల క్రితం కేంద్ర అనుమతులకు పంపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టగా ప్రతిపాదించింది. కేంద్రం అనుమతి ఇవ్వడంతో వారి వాటా కింద ఇవ్వాల్సిన నిధులు 18 శాతం. ఈ ప్రకారం మెట్రో 2(ఏ)కి రూ.4230 కోట్లు, మెట్రో 2(బి)కి రూ.3524 కోట్లు మంజూరు చేయాలి. రాష్ట్రం కేంద్ర సాయాన్ని కోరుతోంది. కేంద్రం నిధుల లభ్యత, ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలను పరిశీలించి అనుమతి ఇస్తామని చెబుతోంది.

# దూరాభారం.. కావాలి వారధి నిర్మాణం



గన్నేరువరం: ఒకప్పుడు ఉమ్మడి బెజ్జంకి మండలంలోని గన్నేరువరం కరీంనగర్‌కు 7 కిలోమీటర్ల దూరంలో ఉండేది. హైదరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా కరీంనగర్‌కు ఇక్కడి నుంచే వెళ్లేవారు. 1980లో కరీంనగర్, గన్నేరువరం మధ్య దిగువ మానేరు జలాశయం నిర్మించడంతో దూరం 40 కిలోమీటర్లకు పెరిగింది. అప్పటి నుంచి విద్య, వైద్యం, రవాణాలో వెనుకబడింది. జనాభా, రవాణా ప్రాతిపదికన జలాశయంపై వారధి నిర్మిస్తే గన్నేరువరంతోపాటు బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు దూరం తగ్గుతుంది.

**ఐకాస పోరాటం..** మానేరుపై వంతెన నిర్మిస్తే ఆ మండలాల ప్రజల రవాణాల కష్టాలు చాలావరకు తీరుతాయి. వారధి నిర్మాణమే ఎజెండాగా ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) కమిటీ దశాబ్దానికిపైగా పోరాటం చేస్తోంది. ప్రభుత్వం గుర్తించేలా నిరసనలు చేసినా స్పందించిన దాఖలాలు తక్కువే. ఎన్నికల సమయాల్లో సైతం సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకుండా పోయింది. యాస్వాడ మైసమ్మ గుట్ట నుంచి మానేరు మీదుగా కరీంనగర్ సప్తగిరికాలనీలోని లారెల్ పాఠశాల వరకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. 1.5 కి.మీ దూరం వంతెన నిర్మిస్తే గన్నేరువరానికి 7 కి.మీ దూరంలోనే జిల్లా కేంద్రం ఉంటుంది. వంతెన అవతల వైపు వందల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. గత భారాస ప్రభుత్వ హయాంలో మైసమ్మగుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రతిపాదనలు చేశారు. ఈ వంతెన నిర్మిస్తే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఎలగందల్ పాత రోడ్డులో చొక్కరావుపల్లి నుంచి వారధి నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఇలా చేస్తే గన్నేరువరం మండలానికి 17 కిలోమీటర్లు అవుతుంది.

పదిహేనేళ్లుగా పోరాటం

– సంపతి ఉదయ్‌కుమార్, బ్రిడ్జి సాధన ఐకాస ఛైర్మన్

మానేరుపై వంతెన నిర్మించాలని పదిహేనేళ్లుగా పోరాడుతున్నాం. నిర్మాణం జరిగితే మారుమూల ప్రాంతాల ప్రజలకు కరీంనగర్‌కు రావడానికి దూరాభారం తగ్గుతుంది. అత్యవసర సమయంలో వైద్యానికి నోచుకోక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులు చదువుకోవడానికి కరీంనగర్‌కు వెళ్లడం భారమై వెనకడుగు వేస్తున్నారు.

# కమిటీతోనే కాలయాపన



జగిత్యాల : రాష్ట్రంలో మూతపడిన జగిత్యాలలోని ముత్యంపేట, బోధన్, ముంబోజిపల్లెలోని చక్కెర కర్మాగారాలను తెరిచేందుకు గల సాధ్యాసాధ్యాల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం ఓ కమిటీ వేసింది. ఈ కమిటీ సిఫారసులకు అనుగుణంగా కర్మాగారం తెరవడంపై నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నప్పటికీ.. నేటికి ముందడుగు పడటంలేదు.

**ప్రభుత్వ నిధులు వెచ్చిస్తినే..**

గతంలో చక్కెర కర్మాగారాలను తెరిపించేందుకు జిల్లా రైతులు, నాయకులను మహారాష్ట్రకు తీసుకెళ్లి అక్కడి కర్మాగారాలను చూపించారు. అయితే రైతు సంఘాలు లేదా ఎఫ్‌పీవోలు నిర్వహిస్తే అనుమతి స్తామని పేర్కొన్నా.. పెద్దమొత్తం వ్యయం కావడంతో రైతులు ముందుకు రాలేదు. ఈ క్రమంలో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి నిధులను వెచ్చించి కర్మాగారాన్ని తెరిపించాలని, కేవలం సాగును మాత్రం ఎఫ్‌పీవోలు లేదా రైతు సంఘాలకు పరిమితం చేయాలని కోరుతున్నారు.

**తెరిపిస్తే పెరగనున్న సాగు**

జిల్లాలోని ముత్యంపేట కర్మాగారం పరిధిలో గతంలో 16 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. జగిత్యాలతోపాటుగా నిర్మల్, నిజామాబాద్ జిల్లాల రైతులు కూడా ఇక్కడికి పంటను తీసుకువచ్చేవారు. అయితే పరిశ్రమ మూతపడటంతో ప్రస్తుతం చెరకు సాగు దాదాపు వెయ్యి ఎకరాలకు పరిమితంకాగా ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోని ముత్యంపేట కర్మాగారం తెరిస్తే మరింత లాభదాయకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

**వందలాది మందికి ఉపాధి**

ముత్యంపేట చక్కెర పరిశ్రమను తెరిపిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. చెరకు నుంచి వెలువడే పిప్పిని తిరిగి పంటలకు వాడినపుడు సేంద్రియ ఎరువుగానూ ఉపయోగపడుతుంది. మరోవైపు క్రషింగ్ యంత్రాల సామర్థ్యం పెంచే అవకాశం ఉండటంతో.. దాదాపుగా సాగు 50 వేల ఎకరాలకు పెరగనుంది. ఇటీవల రుద్రూరు పరిశోధనస్థానం ద్వారా నూతన చెరకు వంగడాలు అందుబాటులోకిరాగా.. దిగుబడి పెరగడం, సాగు సమస్యలు తగ్గడంతో సాగు తమకు లాభదాయకంగా ఉంటుందని, స్థిర ఆదాయం వస్తుందని అక్కడి రైతులు చెబుతున్నారు. కమిటీ నివేదికను వెంటనే అందించి కర్మాగారాన్ని తెరవాలని జిల్లా కర్షకులు కోరుతున్నారు.

# పల్లెలో ఉ'పాధి'..!

భువనగిరి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి.. సొంత ఊళ్లలో ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం అమలు చేస్తోంది. కాలానుగుణంగా పలు నూతన పనులను పథకంలో చేర్చుతూ కూలీలలకు ఉపాధి కల్పిస్తోంది. గ్రామాల్లోని చెరువులు, కాలువలు, మొక్కల పెంపకం వంటి వాటితో పాటు గత రెండేళ్లుగా ఈ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటుంది. రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకుని లాభాలు పొందవచ్చని సంబంధిత అధికారులు అంటున్నారు.

**పనుల తీరుతెన్నులు**

పౌల్ట్రీ షెడ్లు : ఒక యూనిట్‌కు రూ.85 వేలు అందిస్తారు. రైతు షెడ్డు నిర్మించుకుని 100 నాటు కోడి పిల్లలను పెంచాల్సి ఉంటుంది.

పశువుల పాకలు : యూనిట్ ధర రూ.96 వేలు అందించనుంది. మూడు పశువులు కచ్చితంగా ఉన్నవారికే ప్రాధాన్యమిస్తున్నారు.

మేకలు లేదా గొర్రెల షెడ్లు : ఒక్కో యూనిట్‌కు రూ.98వేలు అందించనున్నారు. 10 గొర్రెలు లేదా మేకలు ఉన్న వారికి ప్రాధాన్యం.

ఇంకుడుగుంతలు : యూనిట్‌కు రూ.6,500 అందించనున్నారు.

అజొల్లా పెంపకం : యూనిట్‌కు రూ.20,000 ఇవ్వనున్నారు. రైతులకు మాత్రమే అందజేస్తారు.

వర్మీ కంపోస్టు గుంతలు : యూనిట్‌కు రూ.15,000 (సామూహికంగా లేదా వ్యక్తిగతంగా రైతులు చేసుకోవచ్చు) చొప్పున అందిస్తారు.

**నిబంధనల ప్రకారం దరఖాస్తు..**



ఎస్సీ, ఎస్టీ రైతులకు సాగులో లేని భూముల్లో అభివృద్ధి పనులు, రైతులకు ఉపయోగపడే పలు వ్యక్తిగత పనులు అందుబాటులో ఉన్నాయి. లబ్ధిదారులు ఉపాధిహామీ పథకం నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. పలు యూనిట్లకు కూలీల ఖర్చు, సామగ్రి ఖర్చులు కలిపి అందించనున్నారు. మండల స్థాయిలో ఉపాధిహామీ పథకం ఏపీవో, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్రసహాయకులు లేదా పంచాయతీ కార్యదర్శులకు కావాల్సిన పనికి సంబంధించిన దరఖాస్తు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లా సమాచారం..

గ్రామ పంచాయతీలు : 428

జాబ్‌కార్డుల సంఖ్య : 1,43,090

ఉపాధిహామీ కూలీలు : 2,63,466

సద్వినియోగం చేసుకోవాలి: నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉపాధిహామీ పథకంతో వ్యవసాయంలో ఉపయోగపడే పనులు మంజూరు చేస్తున్నాం. రైతులు ఆయా మండలాల్లోని సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు అందించాలి. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

# అగ్గువకే ఇసుక.. పనులు ఆగవిక..!

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత తీరనుంది. ఇన్నాళ్లు స్థానిక వనరుల ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందిస్తున్న అధికారులు.. ఇక నుంచి తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ద్వారా సరఫరా చేయాలనుకుంటున్నారు. వర్షాకాలంలో వాగుల్లో వరదనీరు ప్రవహించటం వల్ల ఇసుక తీయటం కష్టంగా మారుతోందని చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆటంకాలు తలెత్తకుండా తాజా నిర్ణయం ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

**సిద్ధమవుతున్న బజార్లు**

ఇసుక కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుక బజార్లు ఏర్పాటు చేయాలని టీజీఎండీసీ అధికారులు నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో కూసుమంచి, సత్తుపల్లి, వైరా, కామేపల్లి, మధిరతో పాటు ఖమ్మం నగరంలో ఇసుకను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన చర్ల, మణుగూరు నుంచి ఇసుకను బజార్లకు చేర్చుతున్నారు. ప్రస్తుతం కూసుమంచి, మధిరలోని బజార్లలో ఇసుకను డంప్ చేస్తుండగా.. త్వరలోనే మిగతా వాటిలోకి ఇసుకను తరలిస్తామని అధికారులు చెబుతున్నారు. అవసరాన్ని బట్టి భద్రాద్రి జిల్లాలోనూ ఇసుక బజార్లు ఏర్పాటుచేస్తామని తెలిపారు.

తొలగనున్న ఆర్థిక భారం

టీజీఎండీసీ అధికారుల తాజా నిర్ణయంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కష్టాలు తొలగటంతో పాటు ఆర్థిక భారం తగ్గనుంది. ఉదాహరణకు సత్తుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ఇసుకపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఒక్కో టన్నుకు రూ.1,200-1,500 చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇసుక బజారులో టీజీఎండీసీ ద్వారా టన్ను రూ.1,000లోపే అందనుంది. కేవలం రవాణా వ్యయాన్ని మాత్రమే ఇసుక బజార్ల నిర్వాహకులు వసూలు చేయటంతో ప్రాంతాలను బట్టి ధరలు మారనున్నాయి. కూసుమంచిలోని ఇసుక బజారులో టన్ను రూ.1,000కి దొరికితే.. వైరాలో రూ.700-800కు లభిస్తుంది.

# వర్షమొచ్చింది.. జ్వరం తెచ్చింది

ఖమ్మం : కొద్దిరోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం, తరచూ వర్షాల ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఖాళీ ప్రదేశాలు మురికికూపాలుగా తయారయ్యాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండటం వల్ల బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ వంటివి వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇన్‌ఫెక్షన్లు సోకి జనం జ్వరాల బారినపడుతున్నారు. కుటుంబంలో ఒకరికి జ్వరం సోకితే ఇంటిల్లిపాదికి వ్యాప్తి చెందుతుంది. ఈనేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఈ లక్షణాలే అధికం జలుబు, దగ్గు, గొంతునొప్పి, డయేరియా, వాంతులతో ఆసుపత్రులకు ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. 40శాతం మంది కాలానుగుణ వ్యాధులతో బాధపడుతున్నారు. తీవ్రమైన వైరల్ జ్వరం, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పుల వంటి లక్షణాలతో అనేకమంది ఇబ్బంది పడుతున్నారు. డెంగీ, చికున్‌గన్యా కేసులు నమోదవుతున్నాయి. నీటివనరులు కలుషితమవటంతో టైఫాయిడ్, జాండీస్(కామెర్లు) వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. తేమ వాతావరణంతో పాటు తడి దుస్తులు వినియోగించటంతో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, దురద, దద్దుర్లు వంటి చర్మ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జ్వరపీడితుల్లో ప్లేట్‌లెట్లు తగ్గిపోయి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు ఆయా సమస్యలతో ఎక్కువగా ఆసుపత్రులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో గతేడాది డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో 82 హాట్ స్పాట్లను వైద్యాధికారులు గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఒక చికున్‌గన్యా, 54 డెంగీ కేసులు నమోదయ్యాయి.వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో కాలానుగుణ వ్యాధులు దరిచేరవు. తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీరు తీసుకోవాలి. మాస్కులు ధరించి వైరల్ ప్రభావం నుంచి రక్షణ పొందాలి. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమల నివారణ సాధనాలు ఉపయోగించాలి.

# కబ్జాలు కనిపిస్తున్నా.. కనికరిస్తున్నారు!

తాండూరు: నాలాలు, కాలువలు సరిగా ఉంటే భారీ వర్షాలు కురిసినా ఎగువ నుంచి వచ్చే వరద దిగువకు సాఫీగా వెళ్లి పోతుంది. వీటిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, విస్తరణ తగ్గించినా పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాలు, లేదా నివాసాల మధ్యలోకి వెళుతోంది. జిల్లాలో అతి పెద్ద పట్టణంగా పేరున్న తాండూరులో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి ఇదే జరుగుతోంది. అయినా అధికారులు కబ్జాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవడంలేదు. వేసవిలోనే దృష్టి సారించాల్సి ఉన్నా, ఆ విషయాన్ని విస్మరించారు. ఫలితంగా శివారు కాలనీల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

**కాలువలపై నిర్మాణాలు .:** పట్టణ వాసులు వివిధ అవసరాలకు ఇళ్లల్లో వినియోగించిన నీరు చిన్న కాలువల ద్వారా దిగువకు వెళ్లిపోతుంది. ఇలా కొన్ని కాలనీల్లోని నీరంతా ఒక కాలువ నుంచి మరో కాలువకు అనుసంధానమై పెద్ద నాలాల్లోకి వెళుతుంది. ఇక్కడి నుంచి సాఫీగా దిగువకు వెళ్లే వ్యవస్థ ఉంది. అయితే వీటినే ఆక్రమించి కొందరు తాత్కాలిక, మరికొందరు శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఎగువ నుంచి వచ్చే వరద ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. మరికొన్ని చోట్ల కొందరు కాలువలపై సిమెంటు స్లాబులు వేశారు.



భారీ వర్షం కురిసినపుడు అంతర్గత రోడ్లకు సమాంతరంగా ఉన్న కాలువల్లోకి వరద వెళ్లే పరిస్థితి లేక, రోడ్లపైకి చేరి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శివాజీ చౌక్ (గౌతాపూరు రోడ్డు), శాంతినగర్, కొడంగల్ రోడ్డు, సాయిపూరు, ఇందిరానగర్, గ్రీన్‌సిటీ, మార్కండేయ నగర్, విశ్వంబర కాలనీ, సీతారాంపేట, గొల్లచెరువు, భవానీ నగర్‌తో పాటు మరికొన్ని కాలనీల్లో ఈ దుస్థితి నెలకొంది.

**వాగులదీ అదే పరిస్థితి** వరదంతా వాగుల ద్వారా ప్రవహించి కాగ్నానదిలో కలిసే వ్యవస్థను ఏళ్ల కిందటే ఏర్పాటు చేశారు. చాలా ఏళ్ల వరకు ఇవన్నీ సజావుగా ఉండడంతో వరద సాఫీగా దిగువకు వెళ్లి పోయేది. పట్టణం విస్తీర్ణం పెరుగుతున్న కొద్ది గృహాల నిర్మాణాలు ఎక్కువయ్యాయి. వాగులకు సమీపంలో నిర్మాణాలు చేపట్టిన వాటిని ఆక్రమించేశారు. నాపరాళ్ల పాలీష్ యూనిట్ల వారు వ్యర్థాలను వాటిల్లోనే గుమ్మరించడంతో మరింత కుంచించుకు పోయాయి. తాండూరు-చించోళి, కొడంగల్, కోకట్, చెంగేష్‌పూరు, వికారాబాద్ మార్గాల్లో ఉన్న వాగులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

# పచ్చ'ధనమే'

మునగాల: రైతుల మెట్టభూమిలో ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కొబ్బరి, మామిడి, నేరేడు, సపోటా, జామ, బత్తాయి, మునగ, డ్రాగన్, దానిమ్మ తదితర మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి ద్వారా మట్టి పనులే కాకుండా రైతులకు అనుసంధానంగా ఉచితంగా మొక్కలు అందజేసి, సాగు చేసేందుకు వేతనాలు కూడా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 156 మంది రైతులకు సంబంధించి 326 ఎకరాల్లో మొక్కలు నాటడం లక్ష్యంగా అధికారులు భూములు గుర్తించారు. ఇందులో ఇప్పటివరకు 163 ఎకరాల్లో పూర్తి చేశారు. త్వరలోనే మిగతా లక్ష్యాన్ని పూర్తి చేస్తామంటున్నారు.

**సంరక్షణకు వేతనం..**మామిడి రూ.45, దానిమ్మ రూ.40, కొబ్బరి రూ.90, మునగ విత్తనాలు రూ.8 లెక్కన ప్రభుత్వం కొనుగోలు చేసి



ముందుగా గుర్తించిన రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తారు. ఒక ఎకరంలో మామిడి 80, నిమ్మ, బత్తాయి 100, మిగిలిన మొక్కలు 150 వరకు నాటాల్సి ఉంటుంది. ఉపాధి కూలీలతో గుంతలు తవ్వించి నాటుతారు. అనంతరం ఏడాదిలో ఎనిమిది నెలలు ఆ మొక్కలను సంరక్షించేందుకు రైతుకు వేతనం అందజేస్తారు. మస్టర్ పేమెంటు ద్వారా ఒక్కొక్క మొక్కకు నెలకు రూ.5 చెల్లిస్తారు. మొక్కలు పెరిగి పెద్దవైన తరువాత ఫలాలను రైతే అమ్ముకొని ఆర్థికంగా స్థిరపడవచ్చును. డ్రైలాండ్ హార్టికల్చర్ ఉపాధి పథకంలో భాగంగా ఐదెకరాలలోపు ఉన్న చిన్న సన్నకారు రైతులు మాత్రమే అర్హులని ఏపీవో శైలజ తెలిపారు. రైతు కుటుంబ సభ్యులు కూడా చేసుకోవచ్చునని, ఆర్థికంగా స్థిరపడటానికి ఉపయుక్తమని పేర్కొన్నారు.

# 'మీన'మేలా..?

భానుపురి : నీటివనరుల్లో చేప పిల్లల విడుదలపై ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టమైన ఆదేశాలు రాలేదు. గత వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు మత్తడి పోస్తున్నాయి.

అదును దాటుతుండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 154 మత్స్యసహకార సంఘాలు ఉండగా.. 15,540 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో 621 నీటివనరుల్లో చేపపిల్లలను వదిలేందుకు ఎంపిక చేశారు. 190 చెరువులతోపాటు 2 జలాశయాల్లో 80-100 ఎంఎం సైజు గలవి, మిగతా 431 చెరువుల్లో 35-40 ఎంఎం సైజు గల చేపపిల్లలను ఏటా వదులుతున్నారు. అధికారులు 3.41 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు అంచనా రూపొందించారు. గతంలో జూన్, జులై నెలల్లో టెండర్లు పిలిచి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విడతల వారీగా చేపపిల్లలను వదిలేవారు. ఈ ఏడాది చేపపిల్లలను విడుదల చేస్తారా.. లేక గతేడాది మాదిరిగా కోత విధిస్తారా? అని మత్స్యకారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ నేటికీ ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారుల ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గతేడాది నవంబరులో చేప పిల్లలను వదిలారు. సాధారణంగా ఏటా జూన్‌లో టెండర్లు పిలుస్తారు.

# వలపు కాజా.. 'మోసాల బాజా'




హైదరాబాద్ : పాతబస్తీకి చెందిన పాతికేళ్ల కుర్రాడు ఓ మ్యాట్రిమోనీ గ్రూపులో అందమైన అమ్మాయి ఫొటో చూసి తనకు సరైన జోడని ఎంపిక చేసుకున్నాడు. అవతలి నుంచి సానుకూల స్పందన రావటంతో పొంగిపోయాడు. కొద్దిరోజులకు ఆ యువతి తన తల్లి ఆసుపత్రిలో ఉందని ఫోన్‌చేసి రూ.21లక్షలు కాజేసింది. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు యువతి ఫొటో పాకిస్తాన్ నటిదని, సైబర్ మోసమని తేల్చారు. చిక్కడపల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి(68) భార్య మూడేళ్ల క్రితం మరణించారు. ఆయన వివాహ పరిచయ వేదికలో ప్రొఫైల్ ఉంచాడు. తనను సంప్రదించిన కరీంనగర్‌కు చెందిన మహిళను వివాహమాడేందుకు సిద్ధమయ్యాడు. రకరకాల అవసరాలు చెప్పి పలు దఫాల్లో రూ.7.75లక్షలు వసూలు చేసింది. మరో రూ.లక్ష కావాలని కోరటంతో బాధితుడు మోసపోయినట్టు గ్రహించాడు. వివాహ పరిచయ వేదికలను అడ్డాగా చేసుకుని మోసాలు అనేకం జరుగుతున్నాయి. ముఠాగా ఏర్పడి మ్యాట్రిమోనీ సైట్లలో నకిలీ పేర్లతో చేరుతున్నారు. అక్కడ తమ వలకు చిక్కిన వారి నుంచి వీలైనంత మొత్తం కొట్టేసి ముఖం చాటేస్తున్నారు.

బాధితుల్లో అత్యధికులు జీవిత భాగస్వామి కోల్పోయిన, దూరమైనవారే ఉంటున్నారు. రెండో పెళ్లికి సిద్ధమైన మహిళలు, పురుషులను లక్ష్యంగా చేసుకుని అందినంత వసూలు చేస్తున్నారు. జోడు కోసం వెతికే వారిని ఎంపిక చేసుకుని పురుషులైతే.. దేశ, విదేశాలకు చెందిన మోడల్స్, సినీనటులు, మహిళలైతే వ్యాపారులు, వైద్యులు, ఐటీ నిపుణుల ఫొటోలతో నకిలీ ప్రొఫైల్స్ తయారు చేస్తారు. ఇవన్నీ నిజమని భావించి సంప్రదించిన వారి ఫోన్ నంబర్లు, వ్యక్తిగత, కుటుంబ నేపథ్యం తెలుసుకుంటారు. ఆర్థికంగా బాగానే ఉన్నట్టు గుర్తిస్తే అందినంత కాజేసేంత వరకూ మాయమాటలతో మురిపిస్తారు. విదేశాల్లో ఉన్నట్టు నమ్మించేందుకు ఆయా దేశాల ఫోన్ నంబర్లను వాడుతూ, యాప్‌ల సాయంతో గొంతుమార్చి ఏమార్చుతారు. ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన ఇద్దరు మహిళల వలలో 120 మంది విశ్రాంత ఉద్యోగులు మోసపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వారిలో అత్యధికులు తమ పిల్లలకు తెలిస్తే ఇంటి నుంచి గెంటేస్తారని మౌనంగా ఉండిపోయారు.

**కట్టుకథలతో మురిపించి..**

వివిధ కారణాలతో భర్తకు దూరమైన, మూడు పదుల వయసు దాటిన మహిళలు భాగస్వామి కోసం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. వీరి కోసమే కాచుకున్న మాయగాళ్లు నకిలీ ప్రొఫైల్‌తో ఆకట్టుకుంటారు. తాము విదేశాల్లో స్థిరపడిన ప్రవాసులమంటూ బోల్తా కొట్టిస్తారు. వారి కోసం ఇక్కడికే వచ్చి కొత్త వ్యాపారం ప్రారంభించి స్థిరపడతామని ఆశ చూపుతారు. వాట్సాప్‌లో గంటల కొద్దీ చాటింగ్ చేసి నమ్మకం కలిగిస్తారు. బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డులు బ్లాక్ అయ్యాయని, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని కట్టుకథలు చెప్పి రూ.లక్షలు వసూలు చేస్తారు. ఇటీవల బంజారాహిల్స్‌కు చెందిన ఒక వైద్యురాలి నుంచి రూ.40 లక్షలు ఇలాగే కాజేశారు. ఇలాంటివి జరిగితే స్థానిక ఠాణా లేదా టోల్‌ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయాలి.

# పండుటాకులకు పోలీస్ 'భరోసా'



హైదరాబాద్: ఒంటరిగా ఉండే వృద్ధులపై నేరాల నియంత్రణ, వారి సంక్షేమం కోసం రాచకొండ పోలీసులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. సీనియర్ సిటిజన్ కేర్ అండ్ కన్సర్న్ డెస్క్ పేరుతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల వారీగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉండే ఒంటరి, దంపతులైన వృద్ధులను గుర్తించి స్థానిక సెక్టార్ ఎస్సైలు తరచూ వారిని కలిసి సమస్యలు తెలుసుకునేలా దీన్ని రూపొందించారు. భూములు, ఆస్తులు, డబ్బు కోసం ఒంటరిగా ఉండే వృద్ధులపై పెరుగుతున్న నేరాల నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆగస్టు 15 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.


**ఇలా గుర్తిస్తారు**

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం 47 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ ఠాణాల పరిధిలో వయసుమీరిన, పిల్లలు విదేశాల్లో ఉన్న, 70 ఏళ్లు దాటి ఒంటరిగా ఉండే వృద్ధులను గుర్తిస్తారు. పోలీస్‌స్టేషన్ల వారీగా వృద్ధులుండే ప్రాంతాల చిరునామా సేకరించి ఒక రికార్డు నిర్వహిస్తారు. స్థానిక సెక్టార్ ఎస్సైలు, పెట్రోలింగ్ సిబ్బంది ఆయా ప్రాంతాలకు గస్తీ కోసం వెళ్లినప్పుడు వీరిని కచ్చితంగా కలవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో 5 నుంచి 10 మంది వరకూ మొత్తం 550 మందిని గుర్తించారు. వివిధ సందర్భాల్లో సమస్యలపై పోలీసులను ఆశ్రయించిన వారిని ఇందులో చేర్చారు. నేరేడ్‌మెట్‌లోని కమిషరేట్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్ కేర్ అండ్ కన్సర్న్ డెస్క్ ద్వారా పోలీస్‌స్టేషన్లవారీగా తీసుకుంటున్న చర్యల్ని పర్యవేక్షిస్తుంటారు.

**ఎందుకోసమంటే..?**

ఇటీవల ఒంటరిగా ఉండే వృద్ధులపై నేరాల సంఖ్య పెరుగుతోంది. కొన్నిసార్లు దొంగల చేతుల్లో హతమవుతున్నారు. అనారోగ్య సమస్యలతో మరణించినా పట్టించుకునేవారు లేక రోజుల తర్వాత వెలుగులోకి వస్తున్నాయి. అనారోగ్య సమస్యలతో బాధపడడాన్ని గమనించి కొందరు సాయం చేస్తున్నట్లు నటిస్తూ ఆస్తి పత్రాలు, ఇంట్లో డబ్బు, విలువైన వస్తువులు కాజేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసగిస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు కేసుల్లో ఎక్కువ మంది బాధితులు వృద్ధులే ఉంటున్నారు. పోలీసులు తరచూ వెళ్లి కలవడం వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించేందుకు వీలుంటుంది. ఒంటరిగా ఉన్నామనే అభద్రతాభావం తగ్గిపోతుంది. నిత్యం కలవడం వల్ల వేధింపులు వంటివి వెలుగులోకి వస్తాయి.

# మధ్యమా'నీరు'పైనే ఆశలు



బోయినపల్లి: వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు)పై ఆశలు పెట్టుకున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరి నాట్ల సమయంలో తీవ్ర ఇబ్బందులను రైతుల ఎదుర్కొన్నారు. పలు చోట్ల నాట్లు వేయడం ఆలస్యమైంది. జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వ 7.60 టీఎంసీలు ఉంది. తాజాగా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ నుంచి స్వల్పంగా వరద వస్తోంది. దీంతోపాటు బుధవారం ఎల్లంపల్లి నుంచి నీటిని మధ్యమానేరుకు తరలిస్తుండటంతో అన్నదాతలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

**మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా..**

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయానికి మానేరు, మూలవాగులతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి జలాశయం నుంచి వరదకాలువ ద్వారా వచ్చే నీరు ఆధారం. ఇక్కడి నుంచి దిగువమానేరు జలాశయం, అన్నపూర్ణ, మల్కపేట రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువలు, రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తుంది. జలాశయంలో మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా నీటి నిల్వ తక్కువ స్థాయిలో ఉంది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో జలాశయం కుడి కాలువ, దిగువన వరి నాట్లు ఆలస్యమయ్యాయి. నీటి విడుదల కోసం ఇల్లంతకుంట మండలం పొత్తూరు వంతెనపై రైతులు ఆందోళన చేసిన సంఘటన చోటు చేసుకుంది. కుడి కాలువ కింద సుమారు 57 వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద 2 వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్లు అంచనా. వరి నాట్లు వేయడం అధికశాతం పూర్తికావొచ్చింది. అయితే వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతం నీటి విడుదల చేసే అవకాశం ఉండకపోచ్చని అధికారులు భావిస్తున్నారు. అప్పటి వరకు ఎగువ నుంచి జలాశయానికి వచ్చిన ఇన్‌ఫ్లో ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల ఉంటుందని తెలిపారు.

**ఇదీ పరిస్థితి**

జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు (318 మీటర్లు) కాగా ప్రస్తుతం 7.60 టీఎంసీలు (307.19 మీటర్లు) నీరు నిల్వ ఉంది. జలాశయానికి మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ నుంచి 944 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

ఎల్లంపల్లి జలాశయం నంది, గాయత్రీ పంపుహౌస్ నుంచి వరద కాలువ ద్వారా బుధవారం 9450 క్యూసెక్కుల నీటి తరలింపు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు.

అన్నపూర్ణ జలాశయానికి నీటిని తరలించాలంటే జలాశయంలో సుమారు 11 టీఎంసీల నీరు ఉండాల్సి ఉంది.

జలాశయంలో 2022 ఆగస్టు నెలలో 20.07 టీఎంసీలు (314.83 మీటర్లు) 2023లో 20.37 టీఎంసీలు (314.97 మీటర్లు), 2024లో 17.08 టీఎంసీలు (313.35 మీటర్లు) నీరు నిల్వ ఉంది. అదే సమయంలో జలాశయానికి ఇన్‌ఫ్లో 2022లో 31.899 టీఎంసీలు, 2023లో 16.401 టీఎంసీలు, 2024లో 12.96 టీఎంసీల నీరు జలాశయానికి వచ్చింది. 2025లో ఇప్పటి వరకు 1.107 టీఎంసీల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదైంది.

**ఎగువ మానేరులో ఇలా..**

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ఎగువమానేరు జలాశయం జలకళను సంతరించుకుంది. రెండు రోజుల నుంచి కామారెడ్డి జిల్లాలో కురిసిన వర్షాలకు మానేరు పల్వంచ వాగు నుంచి వరద మానేరు జలాశయంలోకి చేరుతోంది. బుధవారం రాత్రి వరకు మానేరు జలాశయంలో నీటిమట్టం 25 అడుగుల (గరిష్ఠం 31 అడుగులు)కు నీరు చేరిందని నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొన్నారు.

# నిధులు అందక.. సమస్యలు తీరక

కరీంనగర్ : గ్రామ పంచాయతీలకు అందాల్సిన నిధులు సకాలంలో రాకపోవడంతో అధికారులకు కష్టమవుతోంది. కార్యదర్శులు సొంతంగా అప్పులు తెచ్చి నిత్యం నిర్వహించాల్సిన పనులను చేపడుతున్నారు. ఆగస్టు 2024 నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో జిల్లాకు అందాల్సిన రూ.54 కోట్లు బకాయిపడ్డాయి. సాధారణ నిధులు రూ.8.80 కోట్లు వాడలేని పరిస్థితి. రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ నిధులూ 2023 నుంచి రావడం లేదు. కేవలం పంచాయతీ, పారిశుద్ధ్య సిబ్బంది జీతాలు మాత్రమే టీఎస్‌బీపాస్ ఖాతాలో వేస్తున్నారు.

**కార్యదర్శులపై భారం**

సర్పంచుల పదవీకాలం పూర్తయి 17 నెలలవుతోంది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ పాలన కొనసాగుతోంది. ఆ అధికారులు వారి సొంత శాఖకే సమయం కేటాయిస్తుండటంతో



భారమంతా గ్రామ కార్యదర్శులపైనే పడుతోంది. ఏ సమస్య ఎదురైనా కార్యదర్శి దృష్టికే తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వీధిదీపాలు, చేతిపంపులు, గేటువాల్వులు, నల్లా పైపులకు మరమ్మతులు, చెత్త సేకరణ, ట్రాక్టర్ల నిర్వహణ, మురుగు కాలువలు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, వీటన్నింటి నిర్వహణ భారం వారిపైనే పడుతుండటంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

**రూ.లక్ష వరకు అప్పు చేశా..**

– ఓ గ్రామ కార్యదర్శి ఆవేదన

కరీంనగర్ గ్రామీణ మండలంలోని మా గ్రామ జనాభా ఆరు వేల వరకు ఉంటుంది. గ్రామంలో ప్రతి వార్డుకు ట్రాక్టర్ వెళ్లి చెత్త సేకరించాలి. వీధిదీపాల ఏర్పాటు, నల్లా పైపులైన్ల మరమ్మతు చేయాలి. వీటన్నింటికి ఇప్పటివరకు రూ.లక్ష వరకు అప్పులు తీసుకొచ్చి చెల్లించా. వడ్డీలు ఎలా కట్టలేక దిగులుగా ఉంది.

**ప్రభుత్వానికి నివేదిస్తున్నాం**


– వి.జగదీశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి, కరీంనగర్

సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో చాలాచోట్ల కార్యదర్శులే సొంతంగా డబ్బు తెచ్చి పనులు నిర్వహిస్తున్నారు. వారికి చెల్లించాల్సిన పెండింగ్ నిధులపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

# వేగంగా పోతున్నారు..!

చౌటుప్పల్: నిగనిగలాడే నాలుగు వరుసల రహదారి.. గంటకు 100 నుంచి 140 కిలో మీటర్ల వేగం అందుకో గల వాహనాలు.. ఇంకేముంది వాహన చోదకుల చేతిలో స్టీరింగ్ కళ్లెం లేని గుర్రమవుతోంది. మితిమీరిన వేగం ప్రయాణికులకే కాదు ప్రజలకూ ప్రాణాంతకం అవుతోంది. ఇటీవల హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న వరుస ప్రమాదాలకు అతి వేగమే కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనదారులు అతి వేగంతో దూసుకెళ్తున్నారు. నిబంధనల ప్రకారం 80 కిలోమీటర్ల వేగంతోనే ఈ రహదారిపై ప్రయాణించాల్సి ఉంది. కానీ.. చాలా మంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి 90 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నారు. అతి వేగంతో వెళ్లే వారిలో ఎక్కువగా కారు చోదకులే ఉంటుండగా.. ఆర్టీసీ గరుడా, ట్రావెల్ బస్సులు కూడా అతి వేగంగా వెళ్లే వాటిలో ఉన్నాయి.

జులై చివరి వారంలో 256 కేసులు నమోదు చేసి రూ.2,64,960 జరిమానాను, ఆగస్టు నెలలో 13 నాటికి 435 కేసులు నమోదు చేసి



రూ.4,50,225 జరిమానా విధించారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న పంతంగి టోల్‌ప్లాజా మీదుగా రోజుకు 40 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వ్యవధిలోనే స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తిస్తే రోజుకు 30కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

జులై చివరి వారం నుంచి ఆగస్టు 13 వరకు ఒక్క చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులే 691 ఓవర్ స్పీడ్ కేసులను నమోదు చేశారు. నమోదు చేసిన కేసుల్లో వాహన చోదకులంతా 90 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్టు ట్రాఫిక్ పోలీసులు స్పీడ్‌గన్‌ల ద్వారా గుర్తించారు. అతివేగంగా వెళ్లినందుకు రూ.1035 జరిమానాను చెల్లించాలని వాహన చోదకుల చరవాణులకు సందేశం పంపిస్తున్నారు. అతివేగంగా వెళ్తున్నప్పుడు స్పీడ్ గన్‌లో తీసిన చిత్రంలో ఎంత వేగంతో వెళున్నారో కూడా ఉంటుంది. అతివేగంగా వెళ్లిన వాహనంపై పోలీసులు పంపిన చిత్రంలో ప్లస్() గుర్తు ఉంటుంది. జులై చివరి వారం నుంచి నమోదైన 691 కేసుల్లో ఓ ద్విచక్రవాహన చోదకుడు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లడం గమనార్హం.

**వాహనాలు అదుపు తప్పుతాయి: విజయ్ మోహన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, చౌటుప్పల్** అధిక ప్రమాదాలకు కారణం అతివేగమే. అతి వేగంతో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేస్తే ప్రమాదానికి ఆస్కారమే ఉండదు. అసలే వర్షాకాలం కాలంలో అతివేగంగా వెళ్తే వాహనాలు అదుపు తప్పుతాయి. వాహనం ఎక్కడైనా ఆగిపోతే దాని వెనుకాలే వచ్చే వాహనదారులకు సూచికలు పెట్టాలి.

## జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

సిరిసిల్ల : పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథక నిర్మాణాల్లో కొన్ని చివరిదశకు చేరుకున్నాయి. మొదటి విడతలో 1028 ఇళ్లు ఎంపిక కాగా.. అధికారుల ఆధ్వర్యంలో 439 నిర్మాణాలకు ముగ్గు పోశారు. ఇందులో 206 వరకు బేస్‌మెంట్ పనులు పూర్తి కాగా వారి ఖాతాల్లో రూ.లక్ష జమయ్యాయి. 90 వరకు స్లాబ్ దశకు చేరుకున్నాయి. రెండో విడతలో 6780 మంది ఎంపికయ్యారు. వీటిలో 4500కు పైగా ఇళ్ల పనులు ప్రారంభించగా 500 వరకు బేస్‌మెంట్‌లు పూర్తయ్యాయి. స్లాబ్ లెవల్ వరకు 10 చేరుకున్నాయి.

**అందుబాటు ధరలోనే ఇసుక**

జిల్లాలో మొదటి విడతలో ప్రారంభించిన వాటిలో ఇప్పటివరకు 50 వరకు ఇళ్ల స్లాబ్‌లు పూర్తయ్యాయి. మరో 90 స్లాబ్ దశకు చేరుకున్నాయి. స్లాబ్‌లు పూర్తయిన 5 ఇళ్లకు ప్లాస్టరింగ్ పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు మరో 5 ఇళ్లతోపాటు.. స్లాబ్‌లు పూర్తయిన మరికొన్నింటిని పూర్తి చేసేందుకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు.



లబ్ధిదారుల ఖాతాల్లో నాలుగు విడతల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, గోడల నిర్మాణం అనంతరం మరో రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, మిగతా పనులు పూర్తి చేసిన తర్వాత రూ.లక్ష చెల్లిస్తారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ధరలకు ఇసుక చేరేలా వారంలో రెండు రోజులు అధికారులు అనుమతులిస్తున్నారు. దీంతోపాటు బేస్‌మెంట్ లెవల్‌లో మట్టి నింపేందుకు చొరవ చూపుతున్నారు.

**పొదుపు ఖాతాలోనే జమ**

కొందరు లబ్ధిదారులు బ్యాంకులో వారి ఖాతా బ్లాక్ అయిన అకౌంట్ నంబరును అందజేస్తున్నారని అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో డబ్బులురాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారులు బ్యాంకులో సేవింగ్ ఖాతా అందించాలని అధికారులు చెబుతున్నారు. ఖాతాలో కనీస నగదు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు కేవైసీ తప్పనిసరిగా చేయించాలి. ముఖ్యంగా క్రాప్‌లోన్, జనధన్, జీరో ఖాతాలు పనిచేయడం లేదని పేర్కొన్నారు.

## భట్టిసారూ.. సాగర్‌కు నిధులు ఇవ్వరూ

నల్గొండ : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నాగార్జున సాగర్‌కు రానున్నారు. ఈ మేరకు జిల్లా పాలనాధికారితో పాటు విద్యుత్తు, ఆర్థిక, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఇవి కావాలి**

నాగార్జునసాగర్ జలాశయ స్పిల్‌వే ప్రాంతం వద్ద తరచూ గుంతలు ఏర్పడుతున్నాయి. మరమ్మతుల నిర్వహణ విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. 2014 కంటే ముందు వచ్చిన భారీ వరద కారణంగా పెద్ద గుంతలు పడడంతో ప్రభుత్వం రూ.40 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టింది. 2023-24లో రూ.19 కోట్లతో మరోసారి చేయగా.. 2024లో మళ్లీ అవే సమస్యలు వచ్చాయి.

నాగార్జునసాగర్ బుద్ధవన ప్రాజెక్టు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం రూ.15.39 కోట్లు యువజన సాంస్కృతిక శాఖ నిధుల నుంచి కేటాయించారు. వాణిజ్య దుకాణాల నిర్మాణం, లైటింగ్, పెయింటింగ్, కాటేజ్‌ల పునఃనిర్మాణ పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. బుద్ధవనంలోనూ చేయాల్సిన పెండింగ్ ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. పర్యాటకుల కోసం 'డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ మ్యూజిక్ సెంటర్' పనులు చేపట్టాల్సి ఉంది. బుద్ధచరితవనానికి కుడివైపు ప్రతిపాదిత స్థలం అందుబాటులో ఉన్నా పనులు సాగడం లేదు. నాగార్జున కొండపై 'టూరిస్ట్ డెస్టినేషన్' చేస్తామని చెప్పి.. నిధులు కేటాయించలేదు. రిజర్వాయర్ వద్ద ఉన్న 'చాకలిగట్టు'ను 'ఎకో టూరిజం' చేస్తామని ప్రకటించినా ప్రగతి లేదు. నాగార్జున సాగర్‌లోని నందికొండ పురపాలికకు సంబంధించి సరైన ఆర్థిక వనరులు లేవు. హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలలో రహదారుల నిర్మాణానికి నిధులు లేవు.

## పొలం చెంత.. చినుకు చింత

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ లేక రైతన్నలు నింగికేసి దిగాలుగా చూస్తున్నారు.. వేసిన పంటకు నీరందక.. నారు మడులు బీటలు వారి ఆవేదనలో మునిగిపోయారు.. వర్షాకాలం ప్రారంభమై రెండో నెల ముగిసే తరుణం సమీపిస్తున్నా భారీ వర్షాలు లేక ఉసూరుమంటున్నారు..

**లోటు ఇలా..**మొత్తం 63 మండలాలకుగానూ 11 మండలాల్లో సాధారణ లోటు కనిపిస్తుండగా మిగతా 52 మండలాల్లో తీవ్రమైన లోటు వర్షపాతం ఉంది. జగిత్యాల, రాయికల్, గన్నేరువరం, తిమ్మాపూర్, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఫరవాలేదనే పరిస్థితి ఉంది. ఇక అత్యధికంగా ఓదెల మండలంలో 65 శాతం లోటు వర్షపాతం నమోదవగా రామగుండం (61 శాతం), ఎలిగేడు (60), సుల్తానాబాద్ (60), కరీంనగర్ గ్రామీణం (59), మంథని (57), రామగిరి (57), గంగాధర (55), ధర్మారం (55), జూలపల్లి (55), రుద్రంగి (55), పెద్దపల్లి (54), వీణవంకలో (54), గొల్లపల్లి (51), చొప్పదండి (51), కరీంనగర్ (50), అంతర్గాం (50), కమాన్‌పూర్ మండలంలో 50శాతం లోటు నమోదైంది.

**పంటల పరిస్థితి..!**

ఈ సీజన్‌లో 12,47,811 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గానూ ఇప్పటి వరకు 3,47,263 ఎకరాల్లో మాత్రం వరి సహా అన్ని పంటలు వేశారు. మొత్తంగా 27.82 శాతం పంటలు వేశారు.

జులై రెండోపక్షం వచ్చిందంటే వాతావరణం పూర్తిగా చల్లబడాలి. కానీ ప్రస్తుతం పగలు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటూ ఉక్కపోత ఉంటోంది.

వీచే గాలులు, గాలిలో తేమశాతం తగ్గి పొడి వాతావరణం నెలకొనడం, రుతుపవనాల మందగమనం, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడకపోవటం, ద్రోణిప్రభావాలు తగ్గి పంటలకు కష్టమవుతోంది.

ఈ వాతావరణం వల్ల నాలుగు జిల్లాల్లో విత్తుకున్న పత్తిలో రసం పీల్చు పురుగులు, మక్కలో కత్తెరపురుగు, వరిలో మొగిపురుగు తదితరాలు కొన్ని చోట్ల ఆశిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

పత్తి, సోయా చిక్కుడు పెరుగుదలకు కిలో 19:19:19ను నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేస్తే మంచిది. వరి నారుమడిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లాలి.

# అవి'నీటి'దే అధికం



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో నీటి పారుదల శాఖ అధికారుల అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌తో పాటు ఈఈ స్థాయి అధికారి వరకు అక్రమాల చిట్టా బయటపడింది. ఉమ్మడి జిల్లాలోని నీటి పారుదల శాఖల్లో పనిచేసిన ఉన్నతాధికారులు ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారు. కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో కీలకంగా వ్యవహరించిన విశ్రాంత ఈఎన్‌సీ స్థాయి అధికారి వద్ద ఊహించని రీతిలో ఆదాయాలు వెలుగు చూస్తున్నాయి. నెల రోజుల కిందట ఎస్సారెస్పీ ఈఈ శ్రీధర్ నివాసాలపై అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు చేపట్టిన సోదాల్లో రూ.కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో నీటిపారుదల శాఖలో పనిచేసిన అధికారుల అవినీతిబాగోతం వెలుగు చూస్తుండగా మరికొంత మందిపై కూడా అనిశా అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

**రూ.వందలకోట్ల ఆస్తులు**

విశ్రాంత ఈఎన్‌సీ మురళీధర్‌రావు అక్రమాల పుట్ట బయటపడింది. మంగళవారం కరీంనగర్‌తో సహా మరో పది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అనిశా అధికారులకు స్థిర, చరాస్తుల చిట్టాలు బయటపడుతున్నాయి. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో చాలా కాలం పనిచేసిన మురళీధర్‌రావు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్లు సమాచారం. కాళేశ్వరం పునరాకృతితో పాటు అంచనాలు మార్పు చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఆయనది సిరిసిల్ల జిల్లా కోనరావుపేట. నీటిపారుదల శాఖలో అంచెలంచెలుగా ఎదిగి ఈఎన్‌సీ స్థాయికి చేరి ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం ఆయనను కొనసాగించింది. ఉమ్మడి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల నిర్మాణాలు ఆయన పర్యవేక్షణలోనే సాగాయి. ఈ క్రమంలోనే భారీ మొత్తంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అనిశా అధికారులు చేపట్టిన సోదాల్లో ఒక్కరోజులోనే రూ.వందల కోట్ల విలువ చేసే భూములు, బంగారం, బాండ్ల రూపంలో లభించినట్లు తెలుస్తోంది.

**స్థిర, చరాస్తులు**

సరిగ్గా నెల రోజుల కిందట ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శ్రీరాంసాగర్ ఈఈ శ్రీధర్ అనిశా అధికారులకు చిక్కగా అంతుచిక్కని ఆస్తులు బయటపడ్డాయి. కరీంనగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో భూములు, ఇతర ఆస్తుల వివరాలు సేకరించిన అనిశా అధికారులు రూ.కోట్లలో అక్రమంగా సంపాదించినట్లు గుర్తించారు. చొప్పదండి ఎస్సారెస్పీ డివిజన్-8 ఈఈగా పనిచేసిన శ్రీధర్‌ను మొదట ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ చేపట్టిన అనిశా అధికారుల కళ్లు బైర్లు కమ్మే ఆస్తులు వెలుగు చూశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, హనుమకొండ, సిద్దిపేట ప్రాంతాల్లో అక్రమాస్తులు గుర్తించారు. భూములు, విల్లాలు, నగదు, బంగారం బయటపడ్డాయి. వీటి విలువ రూ.కోట్లలోనే ఉండటంతో అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో వెల్లడైంది.

**మరి కొంత మందిపై నిఘా**

ఉమ్మడి జిల్లాలో నీటిపారుదల శాఖలో పనిచేసిన మరికొంత మందిపై కూడా అనిశా అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బ్యారేజీల నిర్మాణంతో పాటు వివిధ అనుమతులకు సంబంధించిన అంశాల్లో కీలకంగా వ్యవహరించిన వారి చిట్టాను అనిశా అధికారులు తయారు చేసినట్లు తెలుస్తోంది. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు దృష్టి సారించినట్లు భావిస్తున్నారు.

## దాతలు స్పందిస్తే.. ఓ సీసా అందిస్తే..!



మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాల అంటేనే పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలు చదువుకునే చోటని అందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నప్పటికీ తాగునీటిని ఇంటి నుంచే తీసుకెళ్తున్నారు. అయితే పాఠశాలల్లోని అనేక మంది విద్యార్థులు తాగునీటి అవసరాలకు వాడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, శీతల పానీయాల సీసాలను వాడుతున్నారు. దీంతో చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 68,216 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 30,900 మంది ఉన్నారు. వీరిలో సుమారు 20 వేల మంది హానికర ప్లాస్టిక్ సీసాలే వాడుతున్నారని అంచనా. తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులు 37,316 మంది ఉండగా..వీరిలో సుమారు 15వేల మందికి పైగా ప్లాస్టిక్ సీసాలు వినియోగిస్తున్నారు.

**ప్లాస్టిక్‌తో అనర్థమే..**

ప్లాస్టిక్ సీసాలు వాడడం వల్ల అందులోని మైక్రో ప్లాస్టిక్స్ చిన్నారుల శరీరంలో ప్రవేశించి..పొట్టలో సమస్యలతో పాటు మెదడుపై సైతం ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మంది విద్యార్థులు పేదలే ఉండడంతో వారిలో ఎక్కువ మంది వాడి పడేసిన ప్లాస్టిక్ సీసాలే వాడుతున్నారు. మరోవైపు ఎక్కువ మంది విద్యార్థులు ఒకసారి మాత్రమే వినియోగించాల్సిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, శీతల పానీయాల సీసాలు సైతం వాడుతున్నారు. దీని వల్ల ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులు పిల్లల శరీరంతో పాటు రక్తంలో చేసి క్యాన్సర్ వంటి రోగాలకు సైతం దారి తీస్తుంది. దీనిని నివారించాలంటే పిల్లలు తప్పనిసరిగా ప్లాస్టిక్ సీసాలకు ప్రత్యామ్నాయంగా స్టీలు, గాజు, మట్టితో తయారైన సీసాలు వాడడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం, దాతలు స్పందించి పేద విద్యార్థులకు ఆరోగ్యకరమైన నీళ్ల సీసాలు పంపిణీకి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**అవగాహన కల్పించాలి..**

-డాక్టర్ నితిన్ ప్రసాద్ రాయ్, ఆర్బీఎస్కే వైద్యాధికారి, మిర్యాలగూడ


ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మంది విద్యార్థులు హానికర ప్లాస్టిక్ సీసాలే వాడుతున్నారు. ఇటీవల మేము పలు పాఠశాలల్లో వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లినప్పుడు ఈ విషయాన్ని గుర్తించాం. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని నిపుణులు, వైద్యులు ఎంతగా హెచ్చరిస్తున్నా..ప్రజల్లో మార్పు రాల్లేదు. దీనికి ప్రధాన కారణం వారిలో అవగాహన లేకపోవడమే. ప్రభుత్వ అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు ముందుకు వచ్చి ప్లాస్టిక్ సీసాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.

## బోడకాకరకు భలే గిరాకీ

సూర్యాపేట: బోడ కాకర(ఆగాకర) సీజన్ వచ్చేసింది. మార్కెట్‌లో ఆకర్షిస్తున్నాయి. ఈ రకమైన కూరగాయలు ఏడాదిలో రెండు నెలలు మాత్రమే దొరుకుతాయి. సూర్యాపేట పట్టణంలో మార్కెట్‌లో ఇప్పుడిప్పుడే విక్రయానికి తీసుకొస్తున్నారు. ధర కిలో రూ.300 నుంచి రూ.350 వరకు పలుకుతోంది. స్థానిక కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం బండ్లతో పాటు, పలువురు వ్యాపారులు విక్రయించారు. సీజన్‌లో ఒక్కసారైనా తినేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..**బోడ కాకరను ఎక్కువగా ఖమ్మం, ఆంధ్రా ప్రాంతాల్లో పండిస్తారు. స్థానికంగా ఎక్కడ సాగు చేపట్టరు. పట్టణాల్లో డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ఆయా ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఎక్కువగా గుంటూరు ప్రాంతంలో రైతులు పండిస్తారు. నెలపదిహేను రోజులు వ్యాపారులు వీటిని మార్కెట్లలో విక్రయించి లాభాలు గడిస్తుంటారు.

బోడ కాకరలో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్ గుణాలు కలిగి ఉంటాయి. వీటితో ఇన్ఫెక్షన్లు, దగ్గు, జలుబు, చెవి నొప్పి నుంచి



ఉపశమనం కలుగుతుంది. కంటితోపాటు పక్షవాతం, వాపు వంటి సమస్యలను నివారిస్తాయి. శిశువు ఎదుగుదలకు ఉపయుక్తంగా ఉంటుంది. గర్భిణులకు మంచి ఆహారం. కనీసం వారానికి రెండుసార్లు తింటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

రోజుకు 25 కిలోలు అమ్ముతున్నానుమల్లయ్య, వ్యాపారిగుంటూరు నుంచి తీసుకొస్తున్నాను. రోజుకూ 25 కిలోలు అమ్ముతున్నాను. ప్రస్తుతం డిమాండ్ ఉండటంతో చాలామంది కొనేందుకు ముందుకొస్తున్నారు. ధర అధికంగా ఉన్నా వెనకాడటం లేదు.

## కొత్త కొత్త పరికరాలు.. చకచకా పనులు..!

ఖమ్మం : రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, యూపీఎస్‌లు సహా బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలను ప్రభుత్వం ఇటీవల సరఫరా చేసింది. ఖమ్మంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సహా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎనిమిది కంప్యూటర్లు, నాలుగు స్కానర్లు కేటాయించింది. వీటిలో ఒక స్కానర్‌ను రిజర్వ్‌లో ఉంచింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే ఈ స్కానర్‌ను పంపనుంది. కొత్త పరికరాలు సరఫరా చేసిన కంపెనీ ప్రతినిధులు వీటిని అమర్చుతున్నారు. ఉభయ జిల్లాల్లో ఖమ్మం, కూసుమంచి, ఖమ్మం రూరల్, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఖమ్మంలోని కార్యాలయంలో మాత్రమే కొత్త పరికరాలు అమర్చారు. మిగతా వాటిలో త్వరలో ఏర్పాటు చేయనున్నారు.

**సబ్ రిజిస్ట్రార్లు ఎక్కడ...?**

రెవెన్యూ, స్టాంపులు- రిజిస్ట్రేషన్లు, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గం సహా ఉభయ జిల్లాల్లోని ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేరు. ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రత్యేక శ్రద్ధ వహించి గతేడాది ఆగస్టులో ఈశాఖలో పెద్దఎత్తున బదిలీలు చేశారు. పదేళ్లుగా పాతుకుపోయిన వారికి స్థానచలనం కలిగించారు. ఉభయ జిల్లాల్లోనూ పదకొండు మంది సబ్ రిజిస్ట్రార్లను మార్చి కొత్తవారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఎక్కువమంది సెలవుపై వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్నా ఎక్కువగా సెలవులు పెడుతూ.. అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నారు. భద్రాచలం, బూర్గంపాడు,



ఇల్లెందులో సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఏడాది కాలంగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

కొత్తగూడెం, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్లు సెలవుపై వెళ్లిపోయారు. కల్లూరు, మధిర ఎస్‌ఆర్‌ఓలు అప్పుడప్పుడు వచ్చిపోతుంటారు. ఖమ్మం రూరల్ ఎస్‌ఆర్‌ఓ మే మాసంలో ఏసీబీకి చిక్కారు. వైరా ఎస్‌ఆర్‌ఓ బల్క్ రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురై ఆర్నెల్లు అవుతోంది. ఈ కార్యాలయాల్లో ఎస్‌ఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఖమ్మంలో ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు, కూసుమంచిలో ఒక ఎస్‌ఆర్‌ఓ మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు. చాలాఏళ్ల తర్వాత తమ కార్యాలయాలకు కొత్త కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు కొత్తవాటిని ప్రభుత్వం సమకూర్చిందని, పనులు వేగంగా చేయవచ్చునని ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 రామకిశోర్‌రెడ్డికు తెలిపారు. ఎస్‌ఆర్‌ఓ పోస్టుల భర్తీఅంశం ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు.

## పల్లెల్లో పడకేసిన ప్రత్యేక పాలన..!

ఖమ్మం : గ్రామ పంచాయతీల్లో 17 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. అప్పటి నుంచి స్థానిక సంస్థల్లో ప్రజల భాగస్వామ్యం లోపించింది. ఒక్కో గెజిటెడ్ అధికారికి 3-6 పంచాయతీల బాధ్యతలను సర్కారు కట్టబెట్టింది. సదరు అధికారి ఏరోజు ఏ పంచాయతీలో ప్రజలకు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. పైగా సొంత శాఖలో విధుల నిర్వహణకు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామ సర్పంచి స్థానంలో చేయాల్సిన పనులు ప్రత్యేకాధికారి చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శికి సంయుక్త చెక్ పవర్ ఇచ్చారు. జిల్లాలోని 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

**గ్రామసభల నిర్వహణ కాగితాలకే పరిమితం**

గతంలో మాదిరిగా రోజూ ఇళ్ల నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు రవాణా చేయటంలేదు. సెగ్రిగేషన్ షెడ్లను గాలికొదిలేశారు. ట్రాక్టర్లకు డీజిల్ పోయించేందుకు డబ్బులు కరవయ్యాయి. చాలా పంచాయతీలకు డీజిల్ అప్పు పుట్టడం లేదని అధికారులు వాపోతున్నారు. ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు పోసి కాపాడాలి. ఇలా చేస్తే డీఆర్‌డీఏ నుంచి డబ్బులు ఇస్తారు. అయినా ట్యాంకర్లను వదిలేశారు. బ్యాంకు రుణం తీసుకుని ట్రాక్టర్లు కొనుగోలు చేయగా ప్రతి పంచాయతీ నుంచి ఈఎంఐ (రుణ వాయిదా) సొమ్ము బకాయిలు పేరుకుపోతున్నాయి. వీధి దీపాలకు విద్యుత్తు బిల్లులు



పెండింగ్‌లో ఉన్నాయి. వీధి దీపాలు కాలిపోతే కొత్తవాటిని అమర్చలేని చిన్న పంచాయతీలు అంధకారంలో మగ్గుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసే నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు నిర్వహిస్తేనే కేంద్రం నిధులు కేటాయిస్తుంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం సైతం పంచాయతీలకు నిధులు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కార్యదర్శులు తంటాలు పడుతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనేందుకూ పంచాయతీల్లో డబ్బులు లేవంటున్నారు. చాలామంది కార్యదర్శులు సొంత డబ్బులతో పనులు చేయిస్తున్నారు. పంచాయతీలకు నిధులొస్తే తీసుకోవచ్చునని భావిస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో కొన్ని సమస్యలున్నాయి. ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన పంచాయతీలకు వెళుతున్నారు. పల్లెల్లో పాలన మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుబాటులో ఉన్న నిధులను సర్దుబాటు చేస్తున్నాం. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు వేర్వేరు ఉద్యోగ బాధ్యతలు అప్పగించగా వాటిని నెరవేర్చాల్సిన అవసరముంది.
ఆశాలత, డీపీఓ

# గట్టుదాటని దిద్దుబాటు

కర్నూలు : తప్పులు సరి చేయలేదు.. రైతుల విన్నపాలు పట్టించుకో లేదు.. హడావుడిగా కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయడంపై రైతులు మండిపడుతున్నారు. కర్నూలు జిల్లాకు 90,610, నంద్యాల జిల్లాకు 55 వేల వరకు పాసుపుస్తకాలు వచ్చాయి. వాటిని మండలాలకు చేర్చారు. వాటిని వీఆర్వోలు పరిశీలిస్తున్నారు. పేర్లు, ఫొటోలు, రెవెన్యూ గ్రామం వంటి వివరాలు సక్రమంగా ఉన్నాయి. కీలకమైన విస్తీర్ణం, సర్వే నంబరు, భూమి స్వభావం (మెట్ట లేదా మాగాణి) తదితర తప్పులు మాత్రం చాలావరకు అలాగే ఉన్నట్లు చెబుతున్నారు. వాటివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని రెవెన్యూ వర్గాలే చెబుతుండటం గమనార్హం.

**విన్నపాలు 'నేల'పాలు**

రీసర్వే గ్రామాల్లో జరిగిన తప్పులు సరిదిద్దేందుకు గతేడాది అక్టోబరు నుంచి నవంబరు వరకు గ్రామసభలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 450కి పైగా రీసర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో 32,859 దరఖాస్తులు వచ్చాయి. అందులో సర్వే శాఖకు సంబంధించి 24,432, రెవెన్యూ శాఖకు సంబంధించి 8,227 అర్జీలు వచ్చాయి.డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో 472, నంద్యాల జిల్లాలో 444 గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో మొత్తం 11,566 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కూడా 80 శాతం ఎల్పీఎం నంబర్లకు సంబంధించినవే ఉ



న్నాయి. ఇప్పటికీ వాటికి పరిష్కారం చూపలేదు.

**అవగాహన కల్పించడంలో విఫలం**

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేలో తప్పులు దొర్లాయి. హక్కుదారుల పేర్లు, భూ విస్తీర్ణం, గ్రామం వంటి వివరాలు తప్పులతడకగా నమోదు చేశారు. స్పందించిన కూటమి ప్రభుత్వం ఉమ్మడి ఎల్పీఎం నంబర్లను విభజించాలని ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. సబ్ డివిజన్ సేవ కోసం చెల్లించాల్సిన రూ.500 రుసుమును ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. జాయింట్ ఎల్పీఎంల విభజనకు 344 దరఖాస్తులే వచ్చాయి. జాయింట్ ఎల్పీఎంలున్న రైతులు సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోయారు. దీంతో ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది డిసెంబరు వరకు గ్రామ సచివాలయంలో రూ.50 చెల్లిస్తే జాయింట్ ఎల్పీఎంను విభజించే అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఆరు వేలకు మించి దరఖాస్తులు రాలేదు. రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఈ ప్రక్రియ కూడా సరిగా ముందుకు సాగడం లేదు.

# ఇది మన బ్రాండ్..!

పొందూరు : పొందూరు అనగానే మదిలో మెదిలేది ఖాదీ వస్త్రాలే. జిల్లా పేరును దేశ, విదేశాలకు తీసుకెళ్లాయి. కొండ పత్తితో దారం తీసే ప్రక్రియ, వస్త్రాల తయారీలో చేపముల్లు వినియోగం వీటికి ఇంత ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. 1921లో మహాత్మాగాంధీకి ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యం గురించి తెలిసింది. దీనికి ముగ్ధుడైన బాపూజీ కుమారుడు దేవదాస్ గాంధీని పంపారు. దీనిపై గాంధీజీ 'యంగ్ ఇండియా' పత్రికలో ఓ కథనం ప్రచురించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దిల్లీ ఎగ్జిబిషన్ మైదానంలోని హస్తకళా ప్రదర్శనలో ఈ వస్త్రాలను చూసి ఆశ్చర్యపోయారట. 1955లో ఆచార్య వినోభా బావే శంకుస్థాపన చేసిన పొందూరు ఖాదీ చేనేత సంఘ భవనమే నేడు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మిక అభివృద్ధి సంఘంగా సేవలందిస్తోంది.

**పలాస జీడిపప్పు.. ప్రత్యేక గుర్తింపు**

పలాస ప్రాంతంలో లభించే జీడిపప్పునకు దేశ, విదేశాల్లోనూ పేరుంది. జిల్లా వ్యాప్తంగా 350 పరిశ్రమల ద్వారా రోజుకు 80 టన్నుల వరకు ఉ



త్పత్తి జరుగుతోంది. రుచితో పాటు నాణ్యత ఉండటంతోనే ఇంత పేరొచ్చింది. ఇక్కడ తయారైన పప్పు ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. దేశంలో కొత్తగా పలు రాష్ట్రాల్లో జీడి కర్మాగారాలున్నా పలాస సరకుకు గిరాకీ తగ్గలేదు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలోనూ పప్పునే వాడుతున్నారు.

**మందస కోవా.. రుచి వహ్వా..**

పాలకోవా అన్ని ప్రాంతాల్లో దొరుకుతుంది. మందస పాలకోవా రుచికి మాత్రం ఏదీ సాటిరాదు. అందుకు ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. వనమూలికలకు నిలయమైన మహేంద్రగిరులపై పచ్చిక బయళ్లలో మేత మేసే గేదె పాలతో వీటిని తయారు చేయడంతో రుచి, సుచి అద్భుతంగా ఉంటాయి. కట్టెల పొయ్యిపైనే తయారు చేస్తారు. కప్పుల్లో వేసి క్రీం కోవాగా మార్కెట్ చేస్తారు. ముద్దగా చేసి బిళ్లలు కూడా విక్రయిస్తారు.వన్నె తగ్గని బుడితి పరిశ్రమ..: వందేళ్ల చరిత్ర బుడితి కంచు, ఇత్తడి పరిశ్రమ సొంతం. దీనిపై ఆధారపడి 60 వరకు కుటుంబాలు జీవిస్తున్నాయి. పూర్వకాలంలో బరువైన బిందెలు, దీపం కుందులు, కంచాలు, గ్లాసులు తయారు చేసేవారు. వాటికి డిమాండు తగ్గడంతో ప్రస్తుతం పూలకుండీలు, దేవతామూర్తుల విగ్రహాలు, ఇళ్లలో అలంకరణ వస్తువులు చేస్తున్నారు. వాటిని ఆర్డర్లపై లేపాక్షికి వస్తువులు పంపుతారు. రాజమహేంద్రవరం, విశాఖ వంటి ప్రాంతాల నుంచి ముడి సరకు రప్పిస్తారు. దిల్లీ, ఆగ్రా, ముంబయి, కోల్‌కతా, చెన్నై వంటి మహానగరాల్లోనూ ప్రత్యేక స్టాళ్లలో వీటిని విక్రయిస్తారు.

**ఏడుకొండలపైకి ఇక్కడి బెల్లం..**ఆమదాలవలస మండలం నిమ్మతొర్లు వాడ గ్రామంలో తయారయ్యే బెల్లానికి గుర్తింపు ఉంది. ఇందుకు కారణం తయారీ విధానం, సేంద్రి య పద్ధతిలో సాగు చేసిన చెరకు వినియోగం. సేంద్రియ సాగు కారణంగా చెరకు సహజంగానే బంగారు రంగులో ఉండటంతో రసాయనాలు వాడకుండా చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల అవశేషాలతో పాటు తేమ లేకుండా ఉండటం, రంగూరుచీ బాగుండటంతో రెండున్నరేళ్ల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం ఈ బెల్లాన్ని తీసుకుంటోంది. ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడు కాజాల తయారీలోనూ దీన్నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఒడిశా, బెంగాల్ వ్యాపారులు సైతం కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

# ఉపాధి చూపినా.. వెనకడుగే!!



విశాఖపట్నం: ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థుల కోసం జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. వీటిలో పలువురు యువత ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అప్పటి వరకు ఉద్యోగం కోసం ఆశగా ఎదురు చూసి ఎంపికైన అభ్యర్థుల్లో.. 50 శాతానికి పైగా వాటిలో చేరట్లేదు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడానికి ఆయా యాజమాన్యాలు నెల రోజుల సమయం ఇస్తున్నాయి. ఆ సమయంలో పలువురు వెనకడుగు వేస్తున్నారు. మరికొందరు ఉద్యోగాల్లో చేరిన వారం రోజులకే యాజమాన్యాలకు సమాచారం అందించకుండా మానేస్తున్నారు. ఆ ఖాళీల కోసం మళ్లీ మేళాలు నిర్వహించాల్సిన పరిస్థితి.

**నైపుణ్యాలు మెరుగైతేనే..:** ఇంటర్, డిగ్రీ పూర్తయిన తర్వాత చాలామంది అభ్యర్థులు ఇతర నైపుణ్యాలపై దృష్టి పెట్టట్లేదు. నైపుణ్య శిక్షణ తీసుకొని, అనుభవం ఉన్న అభ్యర్థులు ఇతర మార్గాల్లో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారు. మిగిలినవారు ఉపాధి కార్యాలయాల్లో మేళాలకు హాజరవుతున్నారు. వారు కమ్యూనికేషన్ స్కిల్స్, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంపొందించుకోవట్లేదని నిపుణులు చెబుతున్నారు. నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచిస్తే 'మళ్లీ నేర్చుకోవాలా.?' అనే వైఖరితో ఉంటున్నారు. మరోవైపు కంపెనీల యాజమాన్యాల ఎక్కువ నైపుణ్యాలున్న అభ్యర్థులను తీసుకోవడానికి ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మంచి అవకాశాలు చూపిస్తే ఎక్కువ మంది అభ్యర్థులకు ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కారణాలివేనా.....**

ప్రస్తుతం ఉత్పత్తి, రిటైల్, సేల్స్, మార్కెటింగ్, ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువగా అవకాశాలుంటున్నాయి. వాటిలో కనీసం రూ.15 వేల నుంచి జీతాలు మొదలవుతున్నాయి. ఎక్కువ క్షేత్రస్థాయిలో తిరిగి పనిచేయాల్సినవే అధికం. ఆయా రంగాల్లో, ఒత్తిడికి గురయ్యే ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడట్లేదు. ఇప్పటికే ఉద్యోగం చేస్తున్న కొందరు అభ్యర్థులు ఎక్కువ జీతం వచ్చే మెరుగైన అవకాశం కోసం జాబ్‌మేళాలకు హాజరవుతున్నారు.

నైపుణ్యాలు, అనుభవం లేకపోయినా భారీగా అంచనాలు పెట్టుకుంటున్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఎక్కువ జీతాలు ఆశిస్తున్నారు.

స్థానికంగానే ఉద్యోగాలు కావాలని కోరుకుంటున్నారు. పొరుగు జిల్లాలకు వెళ్లాలని సూచిస్తే ప్రతి 100 మందిలో 10 శాతం మాత్రమే రిపోర్ట్ చేస్తున్నారు.

మహిళా అభ్యర్థులు వసతి, ఇతర సదుపాయాలు సరిగాలేకపోవడంతో చేరట్లేదు.ఈ ఏడాదిలో నిర్వహించిన జాబ్‌మేళాలు: 27

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు: 924

**చిన్న కారణాలతో వెనకడుగు–అరుణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి**

జాబ్‌మేళాల ద్వారా యాజమాన్యాలు, అభ్యర్థులకు మధ్య వారధిలా పనిచేస్తున్నాం. బయటి జాబ్‌మార్కెట్‌పై కొందరు అభ్యర్థులకు పూర్తి అవగాహన ఉండట్లేదు. మేళాలకు హాజరైన 100 మందిలో 10 మంది ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. ఉద్యోగంలో చేరి, అనుభవం సంపాదించాలని సూచిస్తున్నా చిన్న చిన్న కారణాలతో పలువురు వెనకడుగు వేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

# క్యాన్సర్ రక్కసికి.. ఆధునిక చికిత్స




కాకినాడ: మారుతున్న జీవనశైలితో క్యాన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. బోధనాసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నా ఆధునిక పరికరాలు లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇకపై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోనే (జీజీహెచ్) అత్యాధునిక చికిత్స అందుబాటులోకి రానుంది. ఇందుకోసం కొంగొత్త వైద్య పరికరాలు సమకూర్చుతున్నారు. కలెక్టర్ షాన్‌మోహన్, నేతల చొరవతో రూ.42 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలరేటర్ క్యాన్సర్ చికిత్స యంత్రాన్ని ఓఎన్‌జీసీ కంపెనీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఈ యంత్రం ఏర్పాటు, చికిత్స అందించేందుకు వీలుగా జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా రూ.6 కోట్లతో భవనం నిర్మిస్తారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీటికి శంకుస్థాపన చేయబోతున్నారు.

కాకినాడ జీజీహెచ్‌కు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి చికిత్సకు అధికసంఖ్యలో వస్తుంటారు. అందులో క్యాన్సర్ పీడితుల సంఖ్య భారీగానే ఉంటోంది. గత అయిదేళ్లలో కొత్తగా 2,303 క్యాన్సర్ కేసులు వచ్చాయి. కొత్త, పాతవి కలిపి ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు 8 వేల మందికి పైగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్‌సీడీ సర్వేలో మరింతమంది అనుమానితులను గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. వీరందరికీ ఇరవయ్యేళ్లక్రితం నుంచి వినియోగిస్తున్న కోబాల్ట్ యంత్రంతోనే నేటికీ చికిత్స అందిస్తున్నారు. కొన్నేళ్లుగా హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ యంత్రం కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నా ఫలితం లేకపోయింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కోసం పలుమార్లు ఓఎన్‌జీసీ దృష్టికి జిల్లా అధికారులు తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ఆధునిక యంత్రం అందుబాటులోకి రానుంది.

**ప్రత్యేకంగా బంకర్..**లీనియర్ యాక్సిలరేటర్ యంత్రం ఏర్పాటుకు ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు అనుమతి ఉండాలి. రేడియో ధార్మిక కిరణాలు బయటకు సోకకుండా ఓ బంకర్ నిర్మించాలి. కాకినాడలో ఐటీఐ వెనుక రంగరాయ కళాశాలకు చెందిన స్థలం ఉంది. అందులో ఈ బంకర్‌తో పాటు రోగుల వార్డు, చికిత్సకు అవసరమైన 12 వేల చదరపు అడుగులతో భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకోసం రెడ్‌క్రాస్ నిధులను వెచ్చిస్తున్నారు.

**ఆధునిక యంత్రంతో ఉపయోగమిలా..**

క్యాన్సర్ బాధితులకు ప్రస్తుతమున్న యంత్రంతో రేడియేషన్ చికిత్స చేసినప్పుడు క్యాన్సర్ కణంతో పాటు మిగతా భాగాలపైనా ప్రభావం పడుతోంది. కచ్చితత్వం ఉండడం లేదు. లీనియర్ యాక్సిలరేటర్ వంటి అధునాత యంత్రాన్ని ఉపయోగిస్తే ఏ భాగంలో క్యాన్సర్ కణం ఉందో కచ్చితంగా అక్కడే చికిత్స ఇవ్వొచ్చు. చుట్టూ ఉన్న ఆరోగ్యకర కణజాలం దెబ్బతినదు. నొప్పి తగ్గించడానికి, ట్యూమర్ వృద్ధిని ఆపడానికి వీలవుతుంది బసవతారకం ఆసుపత్రిలో ఇలాంటి యంత్రంతోనే చికిత్స అందిస్తున్నారు.

# గట్టుదారి.. పట్టు జారి!



ఆచంట : పశ్చిమలో వశిష్ఠ గోదావరి తీరం వెంబడి పెనుగొండ మండలం దొంగరావిపాలెం నుంచి నరసాపురం వరకు మూడు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న ఏటి గట్టు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. ఏటిగట్టు రోడ్ల అభివృద్ధికి వైకాపా ప్రభుత్వ హయాంలో పైసా కూడా ఖర్చు చేయలేదు. తీర గ్రామాల ప్రజల రాకపోకలకు, వరద సమయంలో సహాయక చర్యలకు ఈ మార్గమే ఆధారం. వర్షం కురిస్తే ఈ మార్గం పలుచోట్ల బురద కయ్యలా మారి ద్విచక్ర వాహనం కూడా కదలని దుస్థితి నెలకొంది.

**భారీ వాహనాల తాకిడితో..**పశ్చిమ గోదావరిలో 60 కిలోమీటర్ల మేర ఏటు గట్టు ఉంది. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం నుంచి కంచుస్తంభం పాలెం వరకు భారీ గోతులు ఏర్పడ్డాయి. సిద్ధాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి గ్రామాల నుంచి గతంలో ఈ మార్గంలో పెద్ద ఎత్తున ఇసుక, మట్టి రవాణా జరిగింది. భారీ వాహనాలు అడ్డూ అదుపు లేకుండా తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, భీమలాపురం, కోడేరు, పెదమల్లం గ్రామాల్లో అయితే వాహనాల రాకపోకలకు ఏమాత్రం అవకాశం లేని విధంగా ఈ మార్గం ఛిద్రమైంది.

రినడిపూడి, చినమల్లం, పెదమల్లం తదితర తీర గ్రామాల నుంచి పచ్చిమిర్చి, కూరగాయలను రైతులు ఏటిగట్టు మార్గంలో సిద్ధాంతం మార్కెట్టుకు తరలించేవారు. ఇప్పుడు కనీసం సైకిల్‌పై కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. లంక గ్రామాల నుంచి కొబ్బరికాయలు, ఇతర పంట ఉత్పత్తులు తరలించేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు.

పరిమితంగానే నిధులు.. కూటమి సర్కారు వచ్చాక ఏటిగట్టు రోడ్డు అభివృద్ధికి మూడు భాగాలుగా ప్రతిపాదనలు చేశారు. పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో కంచుస్తంభపాలెం– బాడవ మధ్య భాగానికి మాత్రమే రూ.4 కోట్లు మంజూరయ్యాయి. సిద్ధాంతం– కోడేరు, కోడేరు–భీమలాపురం పరిధిలో పనులకు మరో రూ.4 కోట్లు అవసరం కాగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నిధులు కేటాయించిన ప్రాంతంలో వర్షాలు తగ్గాక రోడ్డు నిర్మాణం చేపడతామని ఏటిగట్టు పరిరక్షణ శాఖ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు.

# అలనాటి వైభవం.. ఆధ్యాత్మిక సౌరభం..!

శ్రీకాకుళం : సిక్కోలు నేలపై అడుగుపెడితే ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. ఓ వైపు నాగావళి.. మరో వైపు వంశధార.. నదీమతల్లి ఒడిలో వెలసిన పురాతన దేవాలయాలు.. పవిత్ర ప్రాంతాలకు కొదవ లేదు. సుదీర్ఘ చరిత్ర కలిగిన పుణ్యధామాలెన్నో దేదీప్యమానంగా వెలుగులీనుతూ జిల్లాను పునీతం చేస్తున్నాయి. నిత్య పూజలతో అలరారుతున్నాయి. తరతరాల సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలంగా నిలుస్తున్నాయి. ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని రెట్టింపు చేస్తున్నాయి. వజ్రోత్సవాల సందర్భంగా ప్రముఖ క్షేత్రాలపై ప్రత్యేక కథనం..

**అదిగో అరసవల్లి..**

జిల్లా పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చేది అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం. శ్రీకాకుళం నగరానికి కూత వేటు దూరంలో కొలువైన ఈ క్షేత్ర సందర్శనకు నిత్యం ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. దేవేంద్రుడు ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాల గాథ. రథసప్తమి రోజున ఇక్కడ స్వామి నిజరూపంలో దర్శనమిస్తారు. ఆరోజున వేల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తుం



టారు. ఏటా అక్టోబరు, మార్చి నెలల్లో ఆదిత్యుడి మూలవిరాట్‌పై సూర్యకిరణాల పడుతుంటాయి. ఏకాదశి పర్వదినాల్లో స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహిస్తారు.

**700 ఏళ్ల నాటి కోవెల..**

చుట్టూ పచ్చని కొండలు.. ప్రశాంత వాతావరణం మధ్యన ఉండే మందస గ్రామంలో ఉంది వాసుదేవ్ పెరుమాళ్ స్వామి ఆలయం.దాదాపు 700 ఏళ్ల కిందట కళింగ రాజ్యంలో దీన్ని నిర్మించారు. అందుకే ఇక్కడి శిల్పకళ ఒడిశా సంప్రదాయాలను గుర్తు చేస్తుంది. ఒకప్పుడు వేద పాఠశాలగా వర్ధిల్లిన దేవాలయంలోనే త్రిదండి రామానుజ పెద్ద జీయర్‌స్వామి శ్రీభాష్యం అభ్యసించినట్లు సమాచారం. ఆయన శిష్యుడు త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి శిథిలావస్థలో ఉన్న వాసుదేవాలయాన్ని పునరుద్ధరించారు. ఏటా మాఘమాసంలో స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

**మన దగ్గరే దక్షిణ కాశీ..**

వంశదార నదీ తీరాన కొలువైన పవిత్ర శైవ క్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయం. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం గ్రామంలో ఉన్న ఈ కోవెలకు సుదీర్ఘం చరిత్ర ఉంది. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని శాసనాలు చెబుతున్నాయి. క్రీ.శ 573లో పూర్వ గంగ వంశీకులు హస్తివర్మ నిర్మించగా.. 14వ శతాబ్దంలో పర్లాఖెముండి రాజులు జీర్ణోద్ధరణ చేశారు. మహాశివరాత్రితో పాటు ఏటా మూడు రోజుల పాటు జరిగే చక్రతీర్థ స్నాన ఘట్టంలో పాల్గొనేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. గంగ, చాళుక్య శిల్ప కళతో క్షేత్రం నేటికీ నిత్యనూతనంగా విరాజిల్లుతోంది.

**శ్రీకూర్మం.. పవిత్ర ధామం..**

శ్రీమన్నారాయణుడు శ్రీకూర్మనాథుని అవతారంలో కొలువైన పవిత్ర స్థలం జిల్లాలోనే ఉంది. అదే జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గార మండలం శ్రీకూర్మం. ఆలయంలో రెండు ధ్వజ స్తంభాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఈ దేవాలయ మండపాన్ని 24 నల్లరాతి ఏకశిలా స్తంభాలతో నిర్మించారు. అద్భుతమైన శిల్పసౌందర్యం ఈ క్షేత్రం సొంతం. బేడా మండపంలోని కుడ్య చిత్రాలు నాటి చరిత్ర, క్షేత్ర మహత్యాన్ని కళ్లకు కడతాయి. ఇక్కడ ఎక్కువగా పితృకర్మలు నిర్వహిస్తుండటంతో ఒడిశాతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వస్తుంటారు.

**మరెన్నో క్షేత్రాలు..**

నాగావళి నదీ తీరంలో బలరాముడు ప్రతిష్ఠించి క్షేత్రాల్లో రెండు జిల్లాలోనే ఉన్నాయి. అవే శ్రీకాకుళం నగరం గుడి వీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం, శ్రీకాకుళం గ్రామీణ మండలం కళ్లేపల్లిలోని మణినాగేశ్వరస్వామి ఆలయం.టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లికార్జున స్వామి ఎత్తైన రాతి శివలింగం రూపంలో భక్తులు దర్శనమిస్తారు.కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి, పాతపట్నం నీలమణి దుర్గమ్మ దేవస్థానాలు నిత్యం భక్తులతో కళకళలాడుతుంటాయి.

ఇవే కాకుండా ప్రసిద్ధి చెందిన, పురాతన ఆలయాలెన్నో సిక్కోలు నేలను పరమపవిత్రం చేస్తున్నాయి.

# ప్రయాణ కష్టాలకు మోక్షం..!

పొందూరు : రహదారి అధ్వానంగా ఉండటంతో వజ్రపుకొత్తూరు వెళ్లడానికి సమీప గ్రామాల ప్రజలు, అధికారులు అవస్థలు పడేవారు. ఒక వరుస మార్గం కావడంతో సమస్య మరింత తీవ్రమైంది. కొన్నేళ్ల నుంచి రెండు వరుసలతో విస్తరణ చేపట్టాలని స్థానికులు డిమాండు చేశారు. వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. పెద్ద గోతులు ఏర్పడి దారుణంగా మారింది. చిన్న వర్షం పడినా ప్రయాణానికి నరకయాత న పడాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్రయాణ కష్టాలపైలో వరుస కథనాలు ప్రచురించడంతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించారు. అపరిష్కృత బిల్లులు చెల్లించేలా చొరవ చూపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

**శరవేగంగా పనులు**

వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు నుంచి బెండి, బెండిగేటు మీదుగా పలాస మండలం రేగులపాడు వరకు సుమారు 16 కి.మీ రహదారిని సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) కింద రూ.25 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రెండు వరుసలతో తారు రోడ్డు విస్తరణను వైకాపా పాలకులు నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే శిరీష హామీ ఇచ్చారు. వారం రోజులుగా శరవేగంగా సాగుతున్నాయి. బెండి, గల్లీ మధ్య పాడైన కల్వర్టులు తొలగించి కొత్తవి నిర్మిస్తున్నారు. బెండిగేటు నుంచి తారు వేయడానికి సిద్ధం చేస్తున్నారు.

**నెలాఖరుకు పూర్తి చేస్తాం..:** గత ప్రభుత్వం రోడ్డు పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో పూర్తి చేయలేకపోయాం. ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బకాయిలు చెల్లించేలా చొరవ చూపడంతో తిరిగి ప్రారంభించాం. ఈ నెలాఖరుకు బీటీ రోడ్డు పనులు పూర్తి చేస్తాం.
విక్రమ్, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ, పలాస డివిజన్

చురకలు



# ముఖహాజరులో మాయాజాలం!



అనంతపురం : గుత్తి ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహంలో 291 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు. అక్కడ 180 మందికి మించి ఉండటం లేదు. ఉదయం హాస్టల్ వద్ద 20 నుంచి 30 మంది విద్యార్థులకు మాత్రమే హాజరు వేస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు వెళ్లి మిగిలిన విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు.

నార్పలలోని బీసీ బాలికల వసతిగృహంలో 400 మంది ఉన్నట్లు చూపుతున్నారు. 200 మందికి మించి లేరు. హాస్టల్‌కు ఆనుకుని ఉన్న పాఠశాలలోనే ప్రతి రోజూ మధ్యాహ్నం ముఖహాజరు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తున్నా కొందరు వార్డెన్లు అడ్డదారులు తొక్కుతున్నారు. పారదర్శకత కోసం తీసుకొచ్చిన ముఖహాజరు విధానాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. రోజూ ఉదయం హాస్టల్ ఆవరణలోనే విద్యార్థుల ముఖహాజరు వేయాల్సి ఉండగా.. ఇందుకు విరుద్ధంగా మధ్యాహ్నం వేళల్లో పాఠశాలల వద్దకు వెళ్లి నమోదు చేస్తున్నారు. బయటి విద్యార్థులను కూడా హాస్టళ్లలోనే ఉంటున్నట్లు హాజరు వేస్తున్నారు. వారంతా ఇక్కడే భోజనం చేస్తున్నట్లు చూపి బిల్లులు డ్రా చేసుకుంటున్నారు.

**లోపాలను ఆసరాగా తీసుకుని..**

గతంలో బీసీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో బయోమెట్రిక్ పద్ధతిలో విద్యార్థుల హాజరు నమోదు చేసేవారు. విద్యార్థులు ఉదయం 8 గంటల లోపు అల్పాహారం తిని వెళ్లేవారు. దీంతో ఉదయం 5 నుంచి 8 గంటల వరకే హాజరు వేసేందుకు అవకాశం ఉండేది. తర్వాత అటెండెన్స్ ఆప్షన్ లాక్ అయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ ఆధారిత హాజరు విధానాన్ని(ఎఫ్ఆర్ఎస్)ను తప్పనిసరి చేసింది. అయితే ఎలాంటి కాలపరిమితి విధించలేదు. ఎక్కడి నుంచైనా నమోదు చేసే వెసులుబాటు కల్పించింది. దీన్ని కొందరు వార్డెన్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. పలుచోట్ల విద్యార్థుల వాస్తవ సంఖ్య కంటే ఎక్కువగా చూపుతున్నారు. అనంతపురం జిల్లాలోని గుత్తి (ఎస్టీ), నార్పల (బీసీ), అనంతపురం (కాలేజ్ బాయ్స్ హాస్టల్), ఉరవకొండ (బీసీ), కళ్యాణదుర్గం (బీసీ) హాస్టళ్లు, శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి (బీసీ), కొత్తచెరువు (బీసీ), ముదిగుబ్బ (బీసీ బాలికల) హాస్టళ్లల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**తెలిసినా పట్టించుకోరా?**

ముఖహాజరులో అక్రమాలు ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?, ఏ సమయంలో.. ఎక్కడ హాజరు నమోదు చేస్తున్నారనే వివరాలు ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డులో కనిపిస్తాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని బీసీ, ఎస్టీ హాస్టళ్లలో 80 శాతం విద్యార్థుల హాజరు మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్యే నమోదు చేస్తున్నారు. ఇదంతా ఆన్‌లైన్‌లో స్పష్టంగా కనిపిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంగా అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివనారాయణశర్మ వివరణ కోరగా క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# నగరం.. ఎన్నాళ్లీ నరకం

రాజమహేంద్రవరం : ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షం కురుస్తోంది. దీంతో నగరంలో ముంపు సమస్య తీవ్రమవుతోంది. వర్షాకాలం వచ్చిందంటే నగర ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. దశాబ్దాలుగా ముంపు సమస్య వేధిస్తూనే ఉంది. పాలకులు మారినా శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదు. కాలువలు విస్తరణకు నోచుకోకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా పల్లపు ప్రాంతాలు నీట మునగడం పరిపాటిగా మారింది.

**కానరాని కాలువల ప్రక్షాళన**

కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సి ఉన్నా..ఆ దిశగా యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. పూడికలు పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వేసవి కాలంలోనే ఈ పనులు చేపట్టాల్సి ఉంది. కాలువల్లో చెత్త, చెదారం కొట్టుకువచ్చి పేరుకుపోతోంది. కనీసం వర్షాలను దృష్టిలో పెట్టుకొని వారానికి ఒకసారైనా పూడిక తొలగిస్తే ముంపు సమస్య తగ్గుతుంది.

**సిబ్బంది కొరతతో...**అర్బన్‌లో సుమారు 620 కి.మీ మేర కాలువ



వ్యవస్థ ఉంది. నల్లా ఛానల్, ఆవ ఛానల్‌లు 23 కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. వారానికి రెండు సార్లు పారిశుద్ధ్య కార్మికులు పూడిక తొలగించాల్సి ఉంది. సిబ్బంది కొరతతో ఈ పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఇంటింటా చెత్త సేకరణకే సిబ్బందిని వినియోగిస్తున్నారు. మిగిలిన వారికి ముఖ్య రోడ్లు, జంక్షన్లను శుభ్రం చేయడానికి సరిపోతుంది. ఇక ప్రధాన కాలువల్లో యంత్రాల సహాయంతో పూడిక తొలగించాల్సి ఉంది. ః నగర పరిస్థితులకనుగుణంగా ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాల్సి ఉంది. నగరంలో సుమారు 920 మంది వరకూ పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. తుమ్మలావ, కంబాలచెరువు, ఆర్యాపురం, కోటిపల్లి బస్టాండ్, ఆల్కట్‌గార్డెన్స్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ముంపు తీవ్రత ఎక్కువగా ఉంది.

# రూపాయికే ఇంటి ప్లాన్

చింతలపూడి : పట్టణాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలగనుంది. జీవో నం.20 ద్వారా 50 చదరపు మీటర్ల లోపు ఇల్లు కట్టుకునేవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఒక్క రూపాయి చెల్లిస్తే ప్లాన్ అనుమతి లభించనుంది. గతంలో ఇంటిప్లాన్ అనుమతి కావాలంటే ఫీజుల రూపంలో రూ.వేలకు వేలు చెల్లిండంతోపాటు, అధికారులకు అదనంగా చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనలు సులభతరం చేసింది. గతంలో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భవనం నిర్మించుకోవాలంటే అప్లికేషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, స్థల అనుమతులు, భవన అనుమతి, చెట్ల సంరక్షణ, ఇంకుడు గుంతలు, లేబర్ చెస్, తదితర ఛార్జీలతో ప్లాన్ పొందాలంటే తడిసి మోపెడయ్యేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించింది.మొత్తం ఆన్‌లైన్‌లోనే.. అనుమతి కలిగిన సాంకేతిక నిపుణులు (ఎల్‌టీపీ)ల ద్వారా సులువుగా పని జరిగిపోతుంది. ఖాళీ



స్థలం ఫొటోతోపాటు దస్త్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత అధికారుల పరిశీలన అనంతరం చరవాణికి చలానా సందేశం వస్తుంది. ఆ చలానా చెల్లించిన వెంటనే అనుమతి లభిస్తుంది. తాజా నిబంధనలతో లబ్ధిదారులు వాళ్ల పరిధిలోని కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ప్లాన్ పొందవచ్చు.

ఇప్పుడు సులభంగా పొందవచ్చు.. పట్టణాల్లోని పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఇంటి ప్లాన్ అనుమతులపై ప్రభుత్వం భారం తగ్గించింది. అవసరమైన వారు ఆన్‌లైన్ ద్వారా సులువుగా ఒక్క రూపాయికే అనుమతులు పొందవచ్చు. – షేక్ అజీద్‌బాబా పట్టణ ప్రణాళిక అధికారి, చింతలపూడి

# ఎరక్కపోయి వెళ్తే.. ఇరుక్కుపోవాల్సిందే

ఆదోని : ఆదోని పట్టణ శివారు 'దారి'ణంగా మారింది. బసాపురం బైపాస్ రహదారి నుంచి మార్కెట్‌యార్డుకు వెళ్లే రహదారిపై మోకాలు లోతు గుంతలు పడ్డాయి. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో పరిశ్రమలు న్నాయి. మార్కెట్‌యార్డు ఉండటంతో రైతులు పంట ఉత్పత్తులను యార్డుకు తెచ్చేందుకు ఈ మార్గంలోనే వెళ్తుంటారు. సీజన్ సమయంలో రోజు మూడు వేల వాహనాలు తిరుగుతాయి. గుంతలు దాటలేక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రహదారి



పంచాయతీ రాజ్ పరిధిలో ఉండటం, అటు మార్కెటింగ్ శాఖ, ఇటు పురపాలక సంఘం నిధులు వెచ్చించలేకపోతున్నాయి. దీంతో 17 ఏళ్లుగా దారి సమస్య పరిష్కారం కావటం లేదని స్థానికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి అక్రమాలకు ఏఐతో చెక్



అనకాపల్లి : మండలం చింతనిప్పుల అగ్రహారంలో రాజాన లక్ష్మి పేరు మస్తరులో దిద్దుబాటు చేసి ఆమెకు రూ.690 వేతనం మంజూరు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. మాకవరంలో సంతకాలు, వేలిముద్రలు వేయకుండానే తలారి గణేష్‌కు వేతనం మంజూరు చేసి ఆ మొత్తాన్ని స్వాహా చేశారు. కశింకోట మండలం ఇ.చౌడువాడలో ఉపాధి హామీ రికార్డుల్లో పనికి రాకపోయినా మస్తర్లు వేశారు. పేరు ఒకరిదైతే పనికి వచ్చేది మరొకరని చూపారు. సామాజిక తనిఖీల్లో బినామీ మస్తర్లతో రూ.87 వేలు కాజేసినట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. సామాజిక తనిఖీ ప్రజావేదికల్లో ఆడిట్ బృందాలు అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్నాయి. ఉపాధి శ్రామికులకు క్షేత్ర సహాయకులు కుమ్మక్కు అవుతున్నట్లు గుర్తించారు. 2024–25లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.1.09 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చారు. ఎక్కువగా బోగస్ జాబ్‌కార్డులు, మస్తర్ల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇవన్నీ మండల స్థాయిలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చినవే. క్షేత్రస్థాయిలో వెలుగులోకి రానివి చాలానే ఉన్నాయి. ఇకపై అడ్డగోలు వ్యవహారాలు, అక్రమాలకు ప్రభుత్వం ఏఐ సాంకేతికతో చెక్ పెట్టనుంది. హాజరు నుంచి పని కొలతల వరకు ఎక్కడా అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టడం చేయనుంది. 24 మండలాల పరిధిలో 3,13,661 మంది కూలీలు ఉన్నారు. 2,79,897 మందికి జాబ్ కార్డులున్నాయి. వీరిలో 1,98,535 మంది పనులకు హాజరవుతున్నారు. ఇప్పటివరకు ఎన్ఎంఎంఎస్‌లో ఫొటోల అప్‌లోడ్ చేసే విధానం అమలులో ఉంది. రోజూ పనిచేసిన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. బినామీ, బోగస్ శ్రామికుల ఫొటోలు పెట్టినా గుర్తించే సాంకేతికత లేదు. ఒకసారి అప్‌లోడ్ చేసిన ఫొటోలు 15 రోజుల తర్వాత యాప్‌లో కనిపించవు. దీంతో అడ్డగోలుగా వ్యహరించే వారు. ఏఐ ఆధారిత వ్యవస్థ ద్వారా ముఖ గుర్తింపు హాజరుతో ప్రతిదీ పక్కాగా నమోదు అవుతుంది. కూలీల ఫొటోలను జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ముందుగా అప్‌లోడ్ చేస్తారు. పని ప్రదేశంలో రెండు పూటలా కూలీల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకరి బదులు మరొకరు వస్తే యాప్ అనుమతించదు. రెండు పూటల ఫొటో దిగితేనే వేతనం వస్తుంది. ఉపాధి హామీ పథకంలో ముందుగా గుర్తించిన పనులు చేసేటప్పుడు జీఐఎస్‌ని ఉపయోగించి ఇకపై జియోట్యాగ్ చేస్తారు. వీటిని శాటిలైట్ ఇమేజ్‌కు లింక్ చేస్తారు. తద్వారా రెండోసారి అవే పనులు చేయడానికి వీలుండదు. పదేపదే అవే పనులు చేయడానికి ప్రయత్నించిన సమాచారాన్ని అధికారులకు చేరవేస్తుంది. చేసిన పనులకు సంబంధించి తప్పుడు బిల్లుల చెల్లింపులకు ఆస్కారం ఉండదు.

# బాలికా జరభద్రం.. అప్రమత్తతే ఆయుధం

రాయదుర్గం : బాలికల భద్రతే లక్ష్యంగా 'శక్తి' బృందం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఇటీవల బాలికల పట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసులు సైతం నమోదవుతున్న ఘటన ఉంటున్నాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

**గుడ్ టచ్, బ్యాడ్ టచ్..**

ఎవరైనా బాలికలను తాకరాని చోట తాకినా, దురుద్దేశంతో వ్యవహరించినా.. నేరమేనని విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, పోలీసులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. అలాగే ఉన్నత పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

**అన్నీ యాప్‌లోనే...**

పోలీస్‌స్టేషన్ వెళ్లకుండానే సచివాలయం, మహిళా పోలీసులకు సమాచారం అందాలంటే 'శక్తి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. అందులోని హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు అనుకోకుండా అక్కడే రాత్రి బస చేయాల్సిన సందర్భం



వస్తే... శక్తి యాప్‌లో సమాచారం అందిస్తే మహిళా పోలీసులు రక్షణ కల్పిస్తారు. విద్యార్థినులు ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కినప్పుడు 'సేఫ్‌ట్రాక్, సేఫ్ హోమ్' యాప్‌లను వినియోగించి జాగ్రత్తలు తీసుకోవాల్సిన తీరుపై అవగాహన కల్పిస్తున్నారు.

**చైతన్యపరచడమే లక్ష్యం..**–విజయ్, ఏఎస్సై, శక్తిబృందం

ఇప్పటికే రాయదుర్గం నియోజకవర్గంలోని 68 పాఠశాలలు, 25 స్వయం సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాం. అన్ని పాఠశాలల్లో సదస్సులు పూర్తి చేస్తాం. విద్యాసంస్థల యాజమాన్యాలనూ అప్రమత్తం చేస్తున్నాం.

# శివభాష్యం నిండింది.. భవనాశి ఉప్పొంగింది

ఆత్మకూరు : భారీ వర్షాల నేపథ్యంలో ఆత్మకూరు మండల పరిధి.. నల్లమలలోని ఆర్లవాగుపై నిర్మించిన శివభాష్యం సాగర్ ప్రాజెక్టు బుధవారం పూర్తిగా నిండింది. దీంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 0.4 టీఎంసీలు. పూర్తిగా నిండటంతో గేట్లు ఎత్తి విడుదల చేసినట్లు ఏఈ మురళీకృష్ణ తెలిపారు. 2009 తర్వాత ప్రాజెక్టుకు ప్రస్తుతం నీరు ఉద్ధృతంగా వచ్చిందని తెలిపారు. ఈ నీరంతా భవనాశి వాగులోకి చేరింది. ఫలితంగా ఆత్మకూరు–కురుకుంద మధ్య వాగు ఉప్పొంగి వంతెనపై ప్రవహిస్తోంది. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.

**కొత్తపల్లిలో 20.4 మి.మీ.**

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. కొత్తపల్లి మండలంలో 20.4 మి.మీ.లుగా నమోదైంది. మిడుతూరు 16.4, రుద్రవరం 15.2,



ఆత్మకూరు 12.8, పగిడ్యాల 12.4, పాములపాడు 11.4, జూపాడు బంగ్లా, నంద్యాల అర్బన్ 10.2, నంద్యాల రూరల్ 7.6, శ్రీశైలం 7.2, నందికొట్కూరు 6.8, వెలుగోడు, మహానంది 5.8, బండిఆత్మకూరు 5.4, గడివేముల, శిరివెళ్ల 4.2, గోస్పాడు 4.0, బేతంచెర్ల 1.6, బనగానపల్లిలో 1.2 మి.మీ.లు కురిసింది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుందూ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆత్మకూరు, బండిఆత్మకూరు తదితర మండలాల్లో రహదారులపై పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి.

**కుందూలో నీటి ఉద్ధృతి**

నంద్యాల నుంచి నందమూరినగర్‌కు వెళ్లే మార్గంలో వంతెన ఆనుకుని కుందూ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నది నిండుగా ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమై తగిన చర్యలు చేపట్టారు. మరోవైపు నదిపై ఉన్న పాత వంతెనపై రాకపోకలు సాగించేందుకు జనం ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కిందట నిర్మించడం.. మరమ్మతులు లేక దెబ్బతిందని పలువురు పేర్కొన్నారు. వెంటనే కొత్త వంతెన పనులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

# కంటి'తుడుపు' వైద్యం

కర్నూలు : జిల్లాలో నేత్రదానం చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏడాదికి సుమారు 400 మంది మృతుల నుంచి కార్నియాలను సేకరిస్తున్నారు. ఐబ్యాంకు లేకపోవడంతో సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లో ఎల్‌వీ ప్రసాద్ ఐబ్యాంకుకు పంపించాల్సి వస్తోంది. దీంతో కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు ఆశించిన మేరకు జరగడం లేదు.

**పరికరాలు మూలనపడేశారు**

ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో నలుగురు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్లు, పదిమంది అసిస్టెంట్లు, 30 మంది పీజీలు ఉన్నారు. 2010లో ఐబ్యాంకుకు సంబంధించిన స్పెక్యులర్ మైక్రోస్కోప్ తెప్పించారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దానిని మూలన పడేశారు. దీంతో ఐబ్యాంకు ఊసే లేకుండాపోయింది. రెండు దశాబ్దాలుగా ఐ కలెక్ట్ సెంటర్‌గానే మిగిలిపోయింది.

కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా మూలనపడేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిధులు సమకూరిస్తే ఐబ్యాంకు ఏర్పాటుతో పాటు కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేయడానికి ఆపరేషన్ థియేటర్, ఇతర వసతులు సమకూర్చుకోవచ్చు.



**కొరవడిన ప్రచారం**

జిల్లాలో నేత్రదానంపై అవగాహన సరిగా జరగడం లేదు. ప్రాంతీయ కంటి ఆసుపత్రి అధికారులు, అంధత్వ నివారణ సంస్థ జిల్లా సమన్వయ కర్త, అక్కడ పనిచేసే డెమోలు ప్రచారంపై దృష్టిపెట్టడం లేదు. జిల్లా అంధత్వ నివారణ కన్వీనర్, అక్కడ పనిచేసే హెల్త్ ఎడ్యుకేటర్ రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నా కార్యాలయాలకే పరిమితమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాంతీయ కంటి ఆసుపత్రి పర్యవేక్షుడు దీనిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

**హైదరాబాద్‌కు పరుగులు**

జిల్లా వ్యాప్తంగా కార్నియా దెబ్బతిన్న వారు, ఇతర నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు వందల్లో ఉన్నారు. కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకోవాలంటే హైదరాబాద్‌లోని సరోజిని కంటి ఆసుపత్రి లేదా ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్‌కు వెళ్లాల్సి వస్తోంది.

ప్రైవేటుగా అయితే సుశీల నేత్రాలయ, అమీలియో ఆసుపత్రుల్లో తక్కువ సంఖ్యలో కార్నియా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. స్థానికంగా ఐబ్యాంకు లేకపోవడంతో వీరూ హైదరాబాద్ నుంచి కార్నియాలు తెప్పించుకుని శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తోంది. నగరంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడానికి సౌకర్యాలున్నా శస్త్రచికిత్సలు చేయడానికి నిపుణులు లేకపోవడంతో అంధులకు నిరాశే మిగులుతోంది. జిల్లాలో ఏటా వందల సంఖ్యలో నేత్రాలు సేకరిస్తున్నా జిల్లా వాసులకు ఉపయోగపడని దుస్థితి నెలకొంది.


**సౌకర్యాలు లేవు :** డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి పర్యవేక్షకుడు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్ లేదు. శిక్షణ తీసుకొన్న వైద్యులు అందుబాటులో లేరు. ఈ కారణంగా ఇక్కడ కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం లేదు. ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ ఐబ్యాంకు లేకపోవడమూ సమస్యగా మారింది. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

## శ్రమయేవ స్వయం వృద్ధి

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్‌ను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్హులైనవారికి రుణాలిచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. సంప్రదాయ యూనిట్లకు భిన్నంగా సాంకేతికత జోడించి కొత్త యూనిట్లు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. రుణాల పంపిణీకి సంబంధించి మూడుగా విభజించారు. మొదటి విభాగం రూ.3 లక్షల లోపు, రెండో విభాగం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు, విభాగంలో రూ.10 లక్షల లోపు యూనిట్లు ఉంటాయి.

**బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున రుణాలిచ్చారు. కేంద్ర ప్రభుత్వం.. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద గతంలో రుణాలిచ్చింది. వీటితో చాలామంది ఇన్నోవా వాహనాలతోపాటు వ్యవసాయ యంత్రాలు తదితరాలు కొనుగోలు చేశారు. 2015 నుంచి 2018 వరకు ఈ రుణాలు తీసుకుని పలువురు ఆర్థికంగా స్థిరపడ్డారు. కానీ చాలామంది లబ్ధిదారులు బ్యాంకులకు రుణాలు చెల్లించలేదు. సుమారు రూ.50 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సమాచారం. వీటిని వసూలు చేసేందుకు ప్రత్యేకంగా రికవరీ అధికారులను నియమిస్తున్నారు. వీరి ద్వారా బకాయిలు త్వరగా వసూలు చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించారు.



**సృజనాత్మకత జోడించేలా..**

సంప్రదాయ పద్ధతుల్లో కాక సాంకేతికత, సృజనాత్మక జోడించి వ్యాపారం చేసేలా ప్రభుత్వం ఎస్సీ యువతను ప్రోత్సహిస్తోంది. పూల బొకేల వ్యాపారం, వర్మీ కంపోస్టు, ఐటీ సేవలు, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్ఈడీ బల్బుల తయారీ, నీళ్ల సీసాల రీఫిల్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లు తదితరాలు మొదటి విభాగంలో ఉన్నాయి.

చరవాణుల మరమ్మతులు, సబ్బుల తయారీ, మొబైల్ కార్‌వాష్, అడ్వెంచర్ టూరిజం, పట్టు పరిశ్రమ, వెడ్డింగ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్, జూట్ బ్యాగ్, సౌరశక్తి పరికరాల అమరిక, సోలార్ ప్యానెళ్లు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఆయుర్వేదిక్, హెర్బల్ స్టోర్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్, బేకరీ, బ్రిక్ ఫ్లైయాష్, ఈవీ బ్యాటరీ తయారీ విభాగాలు రెండో విభాగంలో ఉన్నాయి.

ప్యాసింజర్ కారు, ఆటో, రవాణా రంగంలో వాహనాలు, వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం తదితరాలు మూడో విభాగంలో ఉన్నాయి. ప్రభుత్వం మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా స్థిరపడేలా యువతకు అవకాశం కల్పించనున్నారు.

## ఇటుక పెట్టలేదు.. ఇటువైపు చూడలేదు

పెనుగొండ : పిల్లర్ల దశలో కనిపిస్తున్న ఈ నిర్మాణం పెనుగొండ మండలం ములపర్రులోని గ్రామ సమాఖ్య భవనం. సుమారు ఆరేళ్ల కిందట దీని నిర్మాణం చేపట్టగా.. ప్రభుత్వం మారడంతో ఇలా వదిలేశారు. బేస్‌మెంట్‌తో పాటు పిల్లర్లు సైతం పాడయ్యాయి.

గ్రామాల్లో డ్వాక్రా మహిళల కార్యకలాపాల నిర్వహణకు సొంత భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీలుగా గతంలో ప్రభుత్వం మండల సమాఖ్య వ్యవస్థను తీసుకొచ్చింది. దీని ద్వారా మహిళలు తమ సమస్యలను చర్చించుకోవడం, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవడం, ఆర్థికంగా నిలదొక్కునేందుకు వ్యాపార పరమైన ఆలోచన చేయడం వంటి ఎన్నో నిర్ణయాలు ఇక్కడ చేసేవారు.

ఇవన్నీ సత్ఫలితాలు ఇవ్వడంతో గత తెదేపా ప్రభుత్వం వీటిని విస్తరించేందుకు ప్రతి పంచాయతీలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2017లో ఉపాధి పథకం నుంచి రూ.7 లక్షలు, డీఆర్‌డీఏ నుంచి రూ.6 లక్షలతో నిర్మించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. కొన్ని చోట్ల వీటి నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురాగా.. మరికొన్ని చోట్ల నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

గాలికి వదిలేసిన వైకాపా ప్రభుత్వం.. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని పూర్తిగా విస్మరించింది. దీంతో పలు చోట్ల భవనాలు శిథిల దశకు చేరుకోగా, మరికొన్ని చోట్ల పిచ్చి మొక్కలు మొలిచాయి. కొన్ని చోట్ల ఈ అసంపూర్తి భవనాలను స్థానికులు తమ అవసరాలకు వినియోగించుకుంటూ క్రమంగా ఆక్రమించుకుంటున్నారు.

**వాటికి కేటాయించడంతో..** వైకాపా ప్రభుత్వ నిర్ణయంతో కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా మహిళలు ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. సచివాలయం, ఆర్బీకేల ఏర్పాటు పేరుతో వీటి కార్యకలాపాలను ఈ భవనాల్లో ప్రారంభించారు. దీంతో డ్వాక్రా సమావేశాలన్నీ గుడులు, చెర్వుగట్లు, మండపాల్లో నిర్వహించుకుంటున్నారు. పైగా గ్రామ సమాఖ్య కార్య
కలాపాల కోసం కొనుగోలు చేసిన కంప్యూటర్లు, ఇతర కార్యాలయ సామగ్రి సైతం సచివాలయాలకు అప్పగించారు. ఈ భవనాల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు.

ఇది వీరవాసరం మండలం వడ్డిగూడెంలోని గ్రామ సమాఖ్య భవనం. కొద్దిపాటి పనులు చేసి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా.. దీనిని పట్టించుకోలేదు. ఫలితంగా ప్రాంగణం గడ్డి, ఇతర వ్యర్థాలతో నిండి విష సర్పాలు, కీటకాలకు ఆవాసంగా మారింది.

**జిల్లాలో పరిస్థితి ఇదీ**

మంజూరైన భవనాలు- 372
కేటాయించిన నిధులు- రూ.48.36 కోట్లు
నిర్మాణం పూర్తయినవి -144
గ్రామ సమాఖ్యలకు అప్పగించినవి -81
ఇతర శాఖలు వినియోగిస్తున్నవి -43
ఇంకా ప్రారంభం కానివి -20
వివిధ దశల్లో ఉన్నవి- 228

## అంధకారంలో వదిలేశారు!



రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జాతీయ రహదారి 16, 216ఏలపై ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నా నియంత్రణకు అడుగులు పడడంలేదు. మూడు నెలలకో సారి రహదారి భద్రత సమావేశాలు నిర్వహిస్తున్నా ఆ నిర్ణయాలు అమలవడంలేదు. అధిక శాతం ప్రమాదాలు రాత్రివేళల్లోనే.. హైవేలపై కనీసం దీపాలు వేయలేని పరిస్థితి. మలుపులు, కూడళ్ల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదు. మొత్తంగా 104 ప్రమాదకర ప్రదేశాలున్నాయి.

**532 సౌర దీపాలు ఏమయ్యాయి?**

తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో సుమారు 377 కి.మీ మేర (రాజమహేంద్రవరం ఎన్‌హెచ్ పీడీ పరిధి) జాతీయ రహదారులు ఉన్నాయి. వాటిపై 64 ప్రమాద ప్రదేశాలు, 40 బ్లాక్‌స్పాట్లు కనిపిస్తాయి. ఆయాచోట్ల రూ.13 కోట్లతో 532 సౌర దీపాల ఏర్పాటుకు జనవరిలోనే నిర్ణయించినా నేటికీ టెండర్ల దశ దాటలేదు. మూడునెలల క్రితం రాజమహేంద్రవరంలో నిర్వహించిన రహదారి భద్రత సమావేశంలోనూ చర్చకు వచ్చినా చర్యలు లేవు.

**ఎన్‌హెచ్ 16లో ఇవీ ప్రమాదకర ప్రదేశాలు**

జాతీయ రహదారి 16పై అనకాపల్లి నుంచి అన్నవరం మధ్యలో 27 ప్రమాద ప్రదేశాలున్నాయి. అన్నవరం డిగ్రీ కళాశాల, మండపం సెంటర్ నుంచి గుడి వరకు 100 మీటర్ల పరిధి.. టి.తిమ్మాపురం, అన్నవరం ఆర్చ్ వద్ద ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

అన్నవరం-దివాన్‌చెరువు మధ్యలో 19 ప్రదేశాలు ఉన్నాయి. అవి: వెన్నుపూడి కూడలి, ధర్మవరం శివారు, రాచపల్లి క్రాస్ రోడ్డు, ప్రత్తిపాడు సంతోషిమాత ఆలయం..చిన్నింపేట, ఎర్రవరం, కృష్ణవరం, తాళ్లూరు దాబా, కత్తిపూడి పెట్రోల్‌బంక్, గండేపల్లి, నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంతాలు.

కొవ్వూరు- దేవరపల్లి- గుండుగొలను సెక్షన్‌లో పుల్లలపాడు పెట్రోలు బంక్, కప్పలగుంట వేబ్రిడ్జి, గున్నంపల్లి, బుట్టాయిగూడెం, సీతంపేట, డైమండ్ జంక్షన్ ఉన్నాయి.

దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద 14 దీపాలు ఉంటే ఆరు వెలగడం లేదు. కొత్తగూడెం దిగువ ప్రాంతం, గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి యాదవోలు వరకు అంధకారమే.

216ఏలో ఎక్కడెక్కడంటే..

దివాన్‌చెరువు-సిద్ధాంతం, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక సెంటర్, చొప్పెళ్ల, జొన్నాడ ఆంజనేయస్వామి గుడి, దివాన్‌చెరువు పండ్ల మార్కెట్, ఆటోనగర్, హౌసింగ్‌బోర్డు కూడలి, బొమ్మూరు, ఆలమూరు, రావులపాడు

ఎన్‌హెచ్ 216లో కత్తిపూడి - కాకినాడ బైపాస్ పరిధిలో విరవాడ వద్ద ఎక్కువ ఘటనలు జరుగుతున్నాయి.

కోనసీమ జిల్లా పరిధిలో 216 రహదారిపై ఎక్కడా దీపాలు లేవు.

**31న టెండర్లు తెరుస్తాం..**జాతీయ రహదారులపై సౌర దీపాల ఏర్పాటుకు టెండర్ల గడువు ఈనెల 30తో ముగుస్తుంది. 31న తెరిచిన తరువాత ఏజెన్సీని ఖరారు చేసి ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. అక్టోబరు నాటికి పనులు ప్రారంభిస్తాం.

రోహిత్‌కుమార్, ఎన్‌హెచ్ పీడీ (ఎఫ్ఏసీ), రాజమహేంద్రవరం)

## రుణం కొండంత.. రికవరీ గోరంత



చిత్తూరు : నా ఎస్సీలు అంటూ ఊరూరా ఊదరగొట్టిన జగన్ అధికారంలోకి రాగానే వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. తెదేపా హయాంలో అమలు చేసిన పదుల సంఖ్యలో పథకాలు రద్దు చేసి ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. ఐదేళ్లలో కనీసం ఒక్క పథకం అమలు చేయలేదు. 2021-22లో ఉమ్మడి జిల్లాలో రూ.28.77 లక్షలతో ఏడు యూనిట్లు మాత్రమే మంజూరు చేశారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను దారి మళ్లించారు. రుణాలు మంజూరు చేయకపోగా, పాతవాటిని రికవరీ చేయలేదు.

తెదేపా ప్రభుత్వ హయాంలో 2015-18 మధ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 736 మందికి నేషనల్ షెడ్యూల్డు కులాల ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్ఎఫ్‌డీసీ) పథకం కింద స్వయం ఉపాధి, వాహనాల కొనుగోలు, ఆటో, కార్లు, భూ కొనుగోలుకు రూ.23.50 కోట్లు రుణం మంజూరు చేశారు. ఇందులో రూ.5.57 కోట్లు రికవరీ చేయగా, మిగిలిన రుణం వడ్డీతో కలిపి రూ.19.90 కోట్లు బకాయిలు ఉన్నాయి. నేషనల్ సఫాయి కర్మచారీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌కేఎఫ్‌డీసీ) పథకం కింద 396 మందికి రూ.6.50 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.52.10 లక్షలే రికవరీ చేయగా, ఇంకా వడ్డీతో కలిపి రూ.6.44 కోట్లు బకాయిలు ఉన్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వైకాపా ప్రభుత్వంలో ఏడుగురికి రూ.27.93 లక్షలు రుణమిచ్చి, రూ.95 వేలు రికవరీ చేశారు. వడ్డీతో కలిపి రూ.28.77 లక్షలు బకాయిలు ఉన్నాయి. మొత్తంగా రూ.23.63 కోట్లు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయగా, రూ.6 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. ఇంకా 20.52 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.

**బకాయిదారులకు తాఖీదులు..**

వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్‌ను గాలికి వదిలేయడంతో కొత్త రుణాలు ఇవ్వకపోగా, అంతకు ముందు ఇచ్చిన రుణాలను రికవరీ చేయడంలోనూ విఫలమైంది. దీంతో రుణం తీసుకున్న వారిలో పలువురు యూనిట్లను మూసేయగా, వాహనాలు విక్రయించేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో రుణాలు చెల్లించలేదు. దీంతో కొత్త వారికి అవకాశం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తోంది. మొండి బకాయిల రికవరీకి చర్యలు చేపట్టింది. రుణాలు తీసుకున్న వారితో పాటు, వారికి జామీను ఇచ్చిన వారికీ తాఖీదులు సిద్ధం చేసింది. పాతవి రికవరీ అయితే కొత్త వారికి రుణాలు అందనున్నాయి.

**రికవరీకి చర్యలు చేపడుతున్నాం..**

ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి. రుణం తీసుకున్న వారితో పాటు, జామీనుదారులకు తాఖీదులు ఇస్తున్నాం. త్వరలో బకాయిలు రాబట్టి, మరింత మంది ఎస్సీ నిరుద్యోగులకు రుణం మంజూరయ్యేలా కృషి చేస్తాం.

శ్రీదేవి, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

ఉమ్మడి జిల్లాలో రుణాలు ఇలా..

లబ్ధిదారులు 1,139
మంజూరు చేసిన రుణం రూ.26,63,29,212
రికవరీ రూ.6,10,92,920
బకాయిలు రూ.20,52,36,292

## ద్రవిడ.. సాంకేతిక తోవ..!

కుప్పం : ద్రావిడ సంస్కృతి.. సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ద్రవిడ విశ్వవిద్యాలయం సాంకేతికత వైపు అడుగులేస్తోంది. కాలానుగుణంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ విద్యను ప్రవేశపెట్టింది. తొలి అడుగులోనే కూటమి ప్రభుత్వం ద్రవిడ విశ్వవిద్యాలయానికి సీఎస్ఈ, సీఎస్ఎం (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) రెండు కోర్సులకు అనుమతి ఇచ్చింది. ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ప్రకటించడంతో ఇంజినీరింగ్ చదవాలనే ఎంతోమంది నిరుపేదలకు వరంలా మారింది.

**సీఎస్ఈ విభాగంలో..**

కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై అవగాహన కల్పించడంతో పాటు ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, డేటా బేస్ మేనేజ్‌మెంట్, నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కోర్సు చదువుకున్నవారికి సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డిజైనర్, సిస్టమ్ ఎనలిస్ట్, నెట్‌వర్క్ ఇంజినీర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్టులుగా కార్పొరేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగావకాశాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

**సీఎస్ఎంలో..**

ఈ కోర్సులో డీప్ లెర్నింగ్, డేటా సైన్స్, న్యూరల్ నెట్‌వర్క్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, రోబోటిక్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కోర్సు చదువుకున్న వారికి ఏఐ ఇంజినీర్, డేటా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ డెవలపర్, బిగ్ డేటా ఎనలిస్ట్ తదితర రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.



**కార్పొరేట్‌కు దీటుగా బోధన**

ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ద్రవిడ విశ్వవిద్యాలయానికి ఇంజినీరింగ్ కోర్సులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఏపీఈఏపీ సెట్ ద్వారా అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం. రెండు కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఒక్కో కోర్సులో 60 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాం. ద్రవిడలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంజినీరింగ్ విద్యార్థులకు విద్యాబోధన చేపడతాం.

ఆచార్య దొరస్వామి, ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం

## లేఖ ఉంటే ఇచ్చేయ్.. లేకుంటే వదిలేయ్!

విజయనగరం : సీతానగరం మండలానికి చెందిన ఓ యువతి బొబ్బిలి మండలంలో పనిచేస్తోంది. ఆమె భర్త బొబ్బిలిలో ప్రభుత్వ ఉద్యోగం చేయడంతో స్పౌజ్ కోటాలో కోమటిపల్లి, మెట్టవలస, బూర్జవలస ప్రదేశాలను ఎంచుకున్నారు. అలజంగి, పెంట సచివాలయాల్లోనూ ఖాళీలున్నాయి. ఇవేవీ ఇవ్వకుండా పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేటకు స్థానచలనం చేశారు. సీనియార్టీ, స్పౌజ్ కేటగిరీలను పరిగణనలోకి తీసుకోలేదు. ఆమె కన్నా సీనియార్టీ తక్కువున్న ఇద్దరిని అలజంగి, పెంట కార్యాలయాలకు పంపించారు.

ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సచివాలయాల బదిలీల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేతల సిఫార్సులు, లేఖలకే అధికారులు ప్రాధాన్యం ఇచ్చారని, కేటగిరీలను పట్టించుకోకుండా నచ్చిన ప్రాంతాలకు పంపించారని ఇటీవల పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. గురువారం కొందరు మహిళా డిజిటల్ అసిస్టెంట్లు న్యాయం చేయాలని కోరుతూ జేసీ సేధు మాధవన్ దగ్గర ఆవేదన వినిపించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు సొంత మండలం ఇవ్వకూడదు. అంధులు, మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందినవారికి తొలుత ప్రాధాన్యమిచ్చి దగ్గర కార్యాలయాలు కేటాయించాలి. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉ



ద్యోగులైతే పక్కపక్క సచివాలయాలు లేదా ఒకేచోట అవకాశం ఇవ్వాలి. కానీ ఉమ్మడి జిల్లాలో ఈ నిబంధనలు అమలు కాలేదు. నేతల సిఫార్సులకే అధికారులు పెద్దపీట వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అన్ని శాఖల్లో అదే తీరు!**

సర్వేశాఖలో సిఫార్సు లేఖలపై సంబంధిత అధికారులే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడం గమనార్హం.పశుసంవర్ధక శాఖకు సంబంధించి సుమారు వంద మందిని సిఫార్సులు చేస్తూ ప్రజాప్రతినిధులు లేఖలు ఇచ్చినట్లు ఆ విభాగం పేర్కొంది. అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**రిలీవ్ చేయని ఎంపీడీవోలు**

హేతుబద్ధీకరణలో భాగంగా పంచాయతీశాఖలో గ్రేడ్-5 కార్యదర్శులు, పట్టు పరిశ్రమ, విద్యుత్తుశాఖ మినహా 12 శాఖల్లో బదిలీలు నిర్వహించారు. ఇందులో పురపాలక/అర్బన్ డెవలప్‌మెంట్, 11 ఇతర విభాగాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 3,815 మంది ఉద్యోగుల బదిలీలకు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటివరకు 90 శాతం మంది కేటాయించిన స్థానాల్లో చేరారు. కొన్ని మండలాల్లో ఎంపీడీవోలు రిలీవ్ చేయకపోవడంతో విధుల్లో చేరని పరిస్థితి ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, మక్కువ, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో ఈ పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని సచివాలయాల అధికారిణి ఎస్.రోజారాణి తెలిపారు. నిబంధనల ఉల్లంఘన విషయం తమకు సంబంధం లేదన్నారు.

## ప్రైవేటుకు తగ్గిన విద్యార్థులు

విజయనగరం : ఇంటర్మీడియట్‌లో రెండు విడతల ప్రవేశాల ప్రక్రియ పూర్తయింది. గతేడాదితో పోల్చితే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు విద్యార్థులు తగ్గుముఖం పట్టారు. ప్రభుత్వ యాజమాన్యాల్లో పెద్దగా మార్పు లేదని అధికారులు చెబుతున్నారు. గతేడాది ప్రైవేటు విద్యాలయాల్లో 15,631 మంది చేరగా.. ఈ సారి 13,988 మందే ముందుకొచ్చారు. జేఈఈ, నీట్, ఏపీఈఏపీసెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఇతర జిల్లాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. కొందరు ఐటీఐ, డిప్లొమా, ఐఐఐటీల్లో చేరి ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఇంకా కొరతే..** జిల్లా వ్యాప్తంగా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని యాజమాన్యాల్లో 19,021 మంది ప్రవేశాలు పొందారు. గతేడాదిలో 20,903 మంది చేరారు. ఇంకా 1882



మంది విద్యార్థుల కొరత కనిపిస్తోంది. ప్రభుత్వ విద్యలో స్వల్ప వ్యత్యాసమే నెలకొంది. గతేడాది 2,636 మంది ఆశ్రయించగా.. ఈసారి 2,482 మంది చేరారు. కొందరు కళాశాలల్లో నమోదైనప్పటికీ ఆన్‌లైన్‌లోకి రాలేదని అధికారులు చెబుతున్నారు. సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైనందున ఇంకా వస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడో విడత కౌన్సెలింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు.

**ప్రభుత్వ విద్యలో..**

కూటమి వచ్చిన తర్వాత ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న వారికి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. గత ప్రభుత్వం నిలిపివేసిన ఈ పథకాన్ని పునరుద్ధరించింది. పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ విద్యాసంవత్సరంలో ఏప్రిల్ నుంచే ప్రవేశాలు ప్రారంభించింది. నెల రోజుల పాటు బ్రిడ్జికోర్సు నిర్వహించింది. జాతీయ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మెటీరియల్‌ను అందజేసింది. పాఠశాల తరహాలోనే విద్యార్థి మిత్ర, తల్లికి వందనం పేరుతో కిట్లను అందజేశామని ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఈ నెలాఖరు వరకు ప్రవేశాలకు గడువుందని చెప్పారు.

# వరద తగ్గింది.. దందా మొదలైంది

పి.గన్నవరం: గోదావరి నదికి పదిహేను రోజుల క్రితం వరదనీరు రావడంతో ఇసుక అక్రమ తవ్వకాలకు వీలు లేకుండాపోయింది. ప్రస్తుతం వరద తగ్గి ఇసుకతిన్నెలు బయటపడటంతో అక్రమార్కులు మళ్లీ రంగంలోకి దిగారు. లంకలగన్నవరం వద్ద వశిష్ఠ నదీ పాయలోంచి గురువారం పడవల్లో ఎగుమతి చేసి రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి వరదల సీజన్‌కు ముందే ఈ అక్రమ ర్యాంపు నుంచి విచ్చలవిడిగా ఇసుక తవ్వి రవాణా చేయాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కొంతమంది నాయకుల మధ్య ఈ వ్యవహారంలో సయోధ్య ఏర్పడటంతో మళ్లీవారు రంగంలోకి దిగారు. ఇక్కడ పడవల ద్వారా ఇసుక తీయడం మొదలు పెట్టారు. వరద ఎక్కువగా వచ్చేవరకు తీయాలని కార్యాచరణ చేసుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అనుమతులు ఇచ్చారంటూ సమాధానం



చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అక్టోబరు వరకు నదీపాయల్లో ఇసుక తీయకూడదని ఇటీవల జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. ఎవరైనా తీస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించిప్పటికీ అక్రమార్కులు బేఖాతరు చేస్తున్నారు.

**కేసులు పెడతాం..**

లంకలగన్నవరం వద్ద ఇసుక తీస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఆర్.ఐ., సిబ్బందిని అక్కడికి పంపించాం. తవ్వకాలను నియంత్రించాం. అక్టోబరు మాసాంతం వరకు గోదావరిలో ఎవరూ ఇసుక తీయకూడదు. ఎలాంటి అనుమతులు లేవు. అక్రమాలకు పాల్పడితే కేసులుపెడతాం.
పి.శ్రీపల్లవి, తహసీల్దార్, పి.గన్నవరం

## చిత్తూరు కార్పొరేషన్ భూమికే ఎసరు!

చిత్తూరు: ఆక్రమణలతో చిత్తూరు నగర పాలక సంస్థకు చెందిన భూములు మాయం కాగా.. ఇప్పుడు కొందరు అక్రమార్కులు డంపింగ్ యార్డు స్థలానికే ఎసరు పెట్టారు. మంగసముద్రం రెవెన్యూ లెనిన్‌నగర్ సర్వే నంబరు 113లో నగరపాలక సంస్థకు 1.50 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.6 కోట్లు. దశాబ్దాలుగా అడంగల్‌లో డంపింగ్ యార్డు స్థలంగా చూపుతోంది. తాజాగా కొందరు ఆ భూమి చుట్టూ రాతి కూసాలు నాటి వెంచర్ వేసేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి కబ్జా వ్యవహారం వెళ్లడంతో ఆయన ఆఘమేఘాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులను అక్కడకు పంపారు. కమిషనర్ నరసింహ ప్రసాద్.. సిబ్బందితో స్తంభాలు తొలగింపజేశారు. కొందరు తమకు గతంలో పట్టాలు ఇచ్చారని చెప్పగా




అభ్యంతరం ఉంటే రెవెన్యూ యంత్రాంగంతో మాట్లాడాలని సూచించారు. స్థానిక వీఆర్వోకు కబ్జా గురించి తెలిసినా అక్రమార్కులకు సహకరించారనే ఆరోపణలున్నాయి. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ప్రమేయం ఉందని కలెక్టరేట్ వర్గాలు భావిస్తున్నాయి.

**సహకరిస్తే కఠినచర్యలు తప్పవన్న కలెక్టర్**

కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది.. రాజకీయ నాయకులతో కలిసి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేయడాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్లను హెచ్చరించారు. డిజిటల్ కీలు దుర్వినియోగం చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## అర చేతిలో వ్యవసాయ విద్య

గుంటూరు : వ్యవసాయం, అనుబంధ రంగాలపై మీకు ఆసక్తి ఉందా.. పుట్ట గొడుగులు, చిరుధాన్యాలు, తేనెటీగలు పెంచాలని ఉన్నా మెలకువలు తెలియడం లేదా..? మీ కోసమే ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం కొత్త కోర్సులు తీసుకొచ్చింది. ఇంటి వద్ద ఉంటూనే ఆన్‌లైన్లో తరగతులకు హాజరై పరిజ్ఞానం పెంచుకోవచ్చు. వ్యవసాయ విద్యను రైతులు, మహిళలు, యువత, ఆసక్తి ఉన్న అందరికీ అందించాలనే ఉద్దేశంతో దూరవిద్య కేంద్రాన్ని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ప్రారంభించింది. వ్యవసాయంలో నైపుణ్యం పెంచుకోవాలని అనుకున్నవారికి ఇదో చక్కటి అవకాశం.



**అందరూ అర్హులే..**

మొత్తం ఎనిమిది వారాల పాటు సర్టిఫికెట్ కోర్సులుంటాయి. తెలుగు రాయడం, చదవడం వస్తే చాలు. ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. వయో పరిమితి లేదు. అభ్యర్థుల వద్ద కంప్యూటర్ లేదా ఆండ్రాయిడ్ చరవాణి ఉండాలి. కోర్సులో భాగంగా ఆరు ఆన్‌లైన్ తరగతులు, ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్‌లో అనుభవ పూర్వక, ప్రయోగాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారంలో ఒకరోజు 2-3 గంటల ఆన్‌లైన్ తరగతి ఉంటుంది. వరి వారంలో జరిగే పరీక్ష రాయాలంటే 100 శాతం హాజరు తప్పనిసరి. విశ్వవిద్యాలయమే పాఠ్య పుస్తకాలు ఇస్తుంది. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే ధ్రువపత్రం అందజేస్తారు.

ఇలా నమోదు చేసుకోండి..

%www.angrau.ac.in% వెబ్‌సైట్‌ను సందర్శించి నమోదు పత్రం డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి వివరాలు నింపి రూ.1,500 డీడీ, మని ఆర్డర్‌ను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్ ఏఎన్‌జీఆర్‌ఏయూ పేరుతో గుంటూరులో చెల్లే విధంగా తీసి పంపించాలి. మరిన్ని వివరాలకు జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం లేదా 90632 19959 నంబరును సంప్రదించాలని కురుపాం కేవీకే శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు తెలియజేశారు.

# సాగుకు డ్రోన్ దన్ను



అనంతపురం : కూటమి ప్రభుత్వం వ్యవసాయంలో రైతులకు అండగా నిలుస్తోంది. రాయితీపై విత్తనాలు, పరికరాలను అందిస్తోంది. సాగులో సాంకేతికత వినియోగానికి సంబంధించి.. గత ప్రభుత్వ కాలంలో మూలన పడిన కిసాన్ డ్రోన్ల పథకం నిబంధనలు సడలించింది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు పురుగుమందులు పిచికారీ చేసేలా డ్రోన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. వాటికోసం రైతులు ఆసక్తి చూపుతూ ముందుకొస్తున్నారు.

**నిబంధనల సడలింపు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మండలానికి 3 చొప్పున 189 డ్రోన్లను రైతులకు ఇవ్వాలని 2023లో వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. ఎవరూ ముందుకు రాకపోవడంతో మండలానికి ఒకటి మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల తరహాలో రైతు గ్రూపులను ఏర్పాటు చేసి అందించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డిప్లొమా, బీటెక్ వ్యవసాయ (బీఎస్సీ) విద్యార్హతతోపాటు పాస్‌పోర్టు విధిగా ఉంటేనే డ్రోన్ ఇస్తామని నిబంధన విధించారు. దీంతో ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం తాజాగా నిబంధనలను సడలించింది. విద్యార్హత ఇంటర్ ఉంటే చాలు. డ్రోన్ మంజూరు అయ్యేలోపు పాస్‌పోర్టు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. గ్రూపులో ఐదుగురు సభ్యుల కంటే ఎక్కువమంది ఉండాలి. వారిలో ఒకరు ఇంటర్ చదివి, పట్టాదారు పాసుపుస్తకం ఉంటే పైలెట్‌గా తీసుకుంటారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. తొలుత రైతు గ్రూపు సభ్యులు, నిరుద్యోగ యువతను ఎంపిక చేస్తారు. ఆ జాబితాను జిల్లా వ్యవసాయశాఖ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు పంపుతారు. ఆ తర్వాత గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులు డ్రోన్లపై ఉచిత శిక్షణ ఇస్తారు. ఎంపికైన వారికి సాంకేతిక పరిజ్ఞానం, మెడికల్ సర్టిఫికెట్ పరిగణనలోకి తీసుకుంటారు.

**సమయం, డబ్బు ఆదా**

ఉమామహేశ్వరమ్మ, అనంతపురం జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లాలో రైతులు పంటలకు తరచూ పురుగుమందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. అందుకు ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరం. తద్వారా సమయం, డబ్బు అధికంగా ఖర్చయ్యేది. డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. రైతులు మందులు పిచికారీ, ఇతరులకు అద్దెకు ఇవ్వచ్చు. ఆదాయం వస్తుంది, సమయం ఆదా అవుతోంది.

**రాయితీ ఇలా..** మొత్తం కిసాన్ డ్రోన్లు: 70
ఒక్కో దాని విలువ : రూ.9.80 లక్షలు
రైతువాటా : రూ.4.90 లక్షలు
బ్యాంకు రుణం : రూ.4.90 లక్షలు
డ్రోన్ అందించిన తర్వాత రూ.2 లక్షలు
రైతు వాటా పోను, మిగిలిన రూ.7.80 లక్షలు ప్రభుత్వం రైతు గ్రూపు ఖాతాలకు జమ చేయనుంది.

# కార్పొరేట్‌కు దీటుగా.. జీజీహెచ్



రాజమహేంద్రవరం : వైద్యం..ప్రస్తుతం అత్యంత ఖరీదుగా మారిపోయింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే మెరుగైన చికిత్స అందుతుందన్న ఆలోచనలతో చాలా మంది వాటిని ఆశ్రయించి ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ కార్పొరేట్ ఆస్పత్రుల మాదిరి స్పెషాలిటీ వైద్య చికిత్స అందిస్తున్నారు. రోగులకు అవగాహన లేక వీటిని సక్రమంగా వినియోగించుకోవడం లేదు. ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వీటికి సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

**ఊబకాయం నుంచి క్యాన్సర్ వరకు చికిత్స**

జీజీహెచ్‌లో విభాగాలుగా ప్రారంభించి సేవలందిస్తుంటే మరికొన్నింటిని ఓపీ ప్రాతిపదికన చూస్తున్నారు. గతేడాది జీజీహెచ్‌లో న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆంకాలజీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వాటితోపాటు జీవన విధానంలో మార్పుల కారణంగా వచ్చే ఊబకాయం, బీపీ, మధుమేహం, పోషకాహార లోపం వంటి వ్యాధులకు చికిత్స, అవగాహన కల్పించడానికి వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. స్క్రీనింగ్ చేసి ముందే క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. చికిత్సకు ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు కూడా అందిస్తున్నారు. కొత్తగా ఇద్దరు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు.

**ఏ సేవలు.. ఎప్పుడు.. ఎక్కడ..**

ఉదర సంబంధిత వ్యాధులకు ఇద్దరు యూరాలజిస్టులు ఉన్నారు. బుధ, శుక్రవారాల్లో జీజీహెచ్ మొదటి అంతస్తులోని 45వ నంబరు గదిలో ఓపీ సేవలకు అందుబాటులో ఉంటారు. మిగిలిన రోజుల్లోనూ విధుల్లో ఉంటున్నా వారికి ప్రత్యేకంగా విభాగం కేటాయించకపోవడంతో కొంత ఇబ్బంది ఎదురవుతోంది. ఊబకాయం, పోషకాహార లోపం, బీపీ, మధుమేహం వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఓపీ గది నంబరు 222లో సంప్రదించవచ్చు. సోమ, బుధవారాల్లో ఈ సేవలందుతాయి.

క్యాన్సర్ మహమ్మారిని ముందస్తుగా గుర్తించడానికి ప్రివెంటివ్ ఆంకాలజీ పేరిట జీజీహెచ్‌లో ఓపీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఎన్‌సీడీ సర్వేలో వ్యాధి లక్షణాలున్న అనుమానితులను వైద్య సిబ్బంది ఇక్కడకు పంపితే ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్నారు. జీజీహెచ్ దిగువ అంతస్తులోని ఓపీ గది నంబరు 222లో మంగళ, గురువారాల్లో ఈ సేవలందుతాయి. సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలైన న్యూరో, న్యూరో సర్జరీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ వైద్య విభాగాలు గతేడాదే ప్రారంభించారు. మంగళ, గురు, శనివారాల్లో న్యూరాలజీ సేవలు మొదటి అంతస్తు 45 ఏ గదిలో అందుబాటులో ఉంటాయి. సోమ, బుధ, శుక్రవారాలు న్యూరో సర్జరీ సేవలు 45 బి గదిలో, మంగళ, గురు, శనివారాల్లో సర్జికల్ ఆంకాలజీ 45 డి, సోమ, బుధ, శుక్రవారాల్లో ఆంకాలజీ సేవలు 45సిఓపీ గదుల్లో అందిస్తున్నారు.

# హంద్రీనీవాలో కృష్ణమ్మ పరవళ్లు



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా ప్రజలు.. రైతులకు తీపి కబురు ఇది. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్)కి ఎన్నడూ లేనివిధంగా ముందస్తు జలాలను విడుదల చేయడం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంప్‌హౌస్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుకుంటూ అనంత జిల్లా సరిహద్దులోని 144 కి.మీ. వద్దకు ఈనెల 21 రాత్రి లేదా 22న ఉదయం చేరే అవకాశం ఉందని హంద్రీనీవా ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్ తెలిపారు. గతేడాది ఆగస్టు 1న జలాలు విడుదల అయ్యాయి. ఈదఫా రెండు వారాలు ముందుగానే నీటిని పంపింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాన కాలువలో 3,850 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగేలా వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టారు. తొలిరోజు మూడు పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నారు. క్రమంగా ఈనెల 19వ తేదీ నాటికి గరిష్ఠంగా 12 పంపుల ద్వారా నిర్దేశిత ప్రవాహాన్ని కొనసాగించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది.

**24న జీడిపల్లికి చేరిక**

జిల్లా సరిహద్దు సమీపంలో ఉన్న రాగులపాడు పంప్‌హౌస్‌కు జలాలు చేరగానే నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి 216 కి.మీ. వద్ద ఉన్న జీడిపల్లి జలాశయానికి ఈనెల 24న చేరే అవకాశం ఉంది. ఈ జలాశయం సామర్థ్యం 1.681 టీఎంసీలు కాగా.. ఇప్పటికే ఒక టీఎంసీకిపైగా నీరు నిల్వ ఉంది. ఇక్కడికి కృష్ణమ్మ చేరగానే ఒకట్రెండు రోజుల తర్వాత నేరుగా పీఏబీఆర్ జలాశయానికి సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్రధాన కాలువ తొలి, మలి దశల్లో ఇప్పటికీ లైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. అందుకే కనీసం రెండు వారాలపాటు పీఏబీఆర్‌కు పంపిస్తారు. ఈ జలాశయం కుడి కాలువ కింద ఉన్న అనంత, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని చెరువులను నింపాలని భావిస్తున్నారు. నీటిని విడుదల చేసిన నేపథ్యంలో హంద్రీనీవా ప్రధాన కాలువను గురువారం ఎస్ఈ స్వరూప్‌కుమార్ సారథ్యంలో అధికారులు పరిశీలించారు. కాలువ వెడల్పు పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు.

# సంకల్ప బలం.. కళల సాకారం

తిరుపతి : విత్తనానికి జీవం కల్పించినట్లే కృషితో సంకల్పానికి రూపకల్పన చేయాలి. అప్పుడే కష్టాలెన్ని ఎదురైనా విజయతీరాలు చేరవచ్చంటున్నారు ఈ విద్యార్థినులు. ఊహతెలియని వయసులో తల్లిదండ్రుల్ని కోల్పోయినా ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు ప్రవల్లిక, రేవతి, దీపిక.. కటిక పేదరికంతో తల్లిదండ్రులు తమను చదివించలేక శరణాలయంలో చేర్పించినా.. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ పీజీ విద్యనభ్యసిస్తున్నారు జ్యోత్స్న, త్రివేణి. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ సంగీతం, నృత్యం, కళల విభాగంలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్న వీరి జీవితంలో ఎన్ని అడ్డంకులెదురైనా నృత్యకారిణులుగా రాణించాలనే సంకల్పంతో సాగుతున్నారు. హైదరాబాదులోని శ్రీసత్యసాయి సేవాసంఘ్ సహకారంతో ప్రాథమికవిద్యను ప్రారంభించి పీజీ స్థాయికి ఎదిగారు. 'న్యూస్‌టుడే'తో వారు తమ అనుభవాలు పంచుకున్నారు.

**పేదరికం అడ్డు కాకూడదని : జ్యోత్స్న**

మాది శ్రీకాకుళం. అమ్మ గృహిణి. నాన్న చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తారు. పేద కుటుంబం కావడంతో మమ్మల్ని చదివించలేని పరిస్థితిలో తల్లిదండ్రులు శ్రీసత్యసాయి సేవాసంఘ్‌లో చేర్పించారు. ఆసక్తి కొద్ది నృత్యం కోర్సులో చేరా. కళలు అంటే క్రమశిక్షణ. మనిషి తన జీవితాన్ని



ఎలా గడపాలో కళలు మనకు నేర్పిస్తాయి. హైదరాబాదు, తిరుపతిలో భరతనాట్య ప్రదర్శనలిచ్చా.

**తల్లిదండ్రుల ప్రేమ తెలియదు : రేవతి**

మాది మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు. నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. ప్రాథమిక విద్యనుంచి పీజీ వరకు సత్యసాయి సంస్థ సహకారారంతోనే చదువుతున్నాం. కళలపై ఉన్న ఇష్టంతో ఎంఏ భరతనాట్యం కోర్సులో చేరా. అనేక ప్రదర్శనలిచ్చా. కొంచెం ఆసక్తి ఉంటే కళల్లో రాణించవచ్చు.

**అబ్దుల్ కలాం స్ఫూర్తితో: ప్రవల్లిక**

నాకు రెండేళ్లు ఉండగా ప్రమాదవశాత్తు తల్లిదండ్రులు చనిపోయారు. మేనత్త సహకారంతో సత్యసాయి సేవాసంఘ్‌లో చేరా. సిద్ధిపేటలో ఇంటర్, గుల్బర్గాలో డిగ్రీ భరతనాట్యం కోర్సు చేశా. మహిళా వర్సిటీలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్నా. సంకల్పబలంతో ప్రపంచ ఖ్యాతి సాధించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నాకు స్ఫూర్తి.

**ఆశయాన్ని బలపరచుకోవాలి: త్రివేణి**

మాది శ్రీకాకుళం జిల్లా. అమ్మ గృహిణి, నాన్న ప్రైవేటు ఉద్యోగి. మేం ముగ్గురు సంతానం. పేదరికం కారణంగా నాన్న నన్ను సత్యసాయి సంస్థలో చేర్పించారు. కష్టాలు వస్తుంటాయి పోతుంటాయి. వాటిని తలచుకుని బాధపడితే ఏదీ సాధించలేం. భవిష్యత్తులో గొప్ప నృత్యకళాకారిణి కావాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. చదువుతోపాటు యోగా, కరాటేలో శిక్షణ తీసుకుంటున్నా.

**మొలకెత్తని విత్తనంగా ఉండకూడదు : దీపిక**

మనలో మనం గమనించని ఎన్నో అద్భుత శక్తులున్నాయి. వాటిని వెలికితీసే ప్రయత్నం చేయనంతకాలం మొలకెత్తని విత్తనంగా ఉండిపోతాం. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. తొమ్మిదేళ్ల వయసులో అమ్మ, 13 ఏళ్ల వయసులో నాన్న చనిపోయారు. ఉన్నత స్థానానికి వెళ్లాలంటే గట్టి ప్రయత్నం చేయాలని చదువుపై దృష్టిపెట్టా. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చా. భవిష్యత్తులో దేశం గర్వించే నృత్యకళాకారిణి కావాలనేదే నా లక్ష్యం.

## పేరు సం'క్షేమం'.. తీరు సం'క్షామం'

ఏలూరు : భీమడోలు మండలం గుండుగొలనులోని ఎస్సీ బాలికల వసతి గృహం ఆరేళ్ల కిందట శిథిలమై కూలిపోయింది. అప్పట్నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు గదుల్లో 65 మంది బాలికలు వసతి పొందుతున్నారు. పాత భవనం ఆవరణలోని అధ్వాన మరుగుదొడ్లే వినియోగిస్తున్నారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యల ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపుల్లేవు. కిటికీలకు దోమ తెరల్లేవు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తే.. విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదముంది. కొన్నిచోట్ల అరకొరగా దుప్పట్లు ఇవ్వగా.. మరికొన్నిచోట్ల అసలు ఇవ్వలేదు. అద్దె భవనాల్లో సరైన వసతుల్లేక పిల్లలు అల్లాడిపోతున్నారు.

**కూటమి పాలనలో ఉపశమనం..**

వైకాపా సర్కారు నిర్లక్ష్యం కారణంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 13 బీసీ బాలుర వసతి గృహాలకు ఒక్కోదానికి రూ.1.50 లక్షలు చొప్పున కేటాయించింది. 52 ఎస్సీ వసతి గృహాలకు 5.75 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు సదుపాయాలు



మెరుగుపరుస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాణి తెలిపారు. ఉంగుటూరు మండలం కైకరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఎక్కడికక్కడ శ్లాబు పెచ్చులూడుతోంది. కిటికీలకు తలుపులు, దోమ తెరల్లేవు. జంగారెడ్డిగూడెం బీసీ బాలుర వసతి గృహంలో పరుపులు, దోమ తెరలు చిరిగిపోయాయి. చేతి పంపు పని చేయడం లేదు. ముసునూరు బీసీ బాలుర వసతి గృహం భవనం శ్లాబు పెచ్చులూడుతోంది. చిన్నపాటి వర్షానికే చెమ్మగిల్లుతోంది.

చురకలు



# రెడ్ ఫ్రాక్‌లో గుబులు పుట్టించిన ప్రగ్య

అందం ఉంది .. వేడి ఉంది.. క్రీగంటి చూపులతో కల్లోలం సృష్టించగలదు.. వలపు బాణాలు విసిరి కుర్రకారును స్పెల్ బౌండ్ చేయగలదు. అందుకే జయాపజయాలతో సంబంధం లేకుండా ప్రగ్య జైశ్వాల్ తెలుగు చిత్రసీమలో వరుసగా అవకాశాల్ని అందుకుంటోంది. అఖండ లాంటి బ్లాక్ బస్టర్ లో నటించిన ప్రగ్య, ఇప్పుడు ఎన్బీకే సరసన అఖండ 2లోను అవకాశం అందుకుంది. మరోవైపు టైసన్ నాయుడు అనే చిత్రంలోను కథానాయికగా నటిస్తోంది. ఒకేసారి టాలీవుడ్ లో క్రేజీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అదే సమయంలో ప్రగ్య తన అభిమానులకు సోషల్ మీడియాల్లో నిరంతరం టచ్ లో ఉ



ంది. ఈ వేదికపై వరుస ఫోటోషూట్లతో వేడి పెంచుతోంది. తాజాగా ఈ ముంబై బ్యూటీ రెడ్ హాట్ లుక్ లో ప్రత్యక్షమైంది. హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో స్టన్నింగ్ ఫోజులతో గుబులు రేపింది. ప్రగ్య టోన్డ్ బాడీ .. థై థండర్ సొగసులు యూత్ కి స్పెషల్ ట్రీట్. స్టూడియో సెటప్ లో ఫోటోషూట్ ప్రగ్యను మరో స్థాయిలో ఎలివేట్ చేసింది. ముఖ్యంగా ఈ భామ టోన్డ్ బాడీ మెరుపులు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ప్రగ్య ఇటీవల ముంబైలో తన బెస్ట్ ఫ్రెండ్స్ లక్ష్మి మంచు, రకుల్ ప్రీత్ లతో ఎక్కువగా షికార్లు చేస్తూ కనిపిస్తోందతి. ఆ ముగ్గురూ కలిస్తే రచ్చ రచ్చే. ఇంతకుముందు బీచ్ వెకేషన్ లో బోట్ షికార్ చేస్తున్న ఫోటోగ్రాఫ్స్ వైరల్ అయ్యాయి. బికినీ బీచ్ సెలబ్రేషన్, రెస్టారెంట్ పార్టీ, పబ్ లైఫ్.. కాదేదీ జాలీ లైఫ్ కనర్హం.

# శ్రీలీలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?


సోషల్ మీడియా యుగంలో నెటిజనుల అనైతిక ప్రవర్తన గురించి ఎంత చెప్పినా తక్కువే. అయినదానికి కానిదానికి ట్రోలింగ్ చేయడం రెగ్యులర్ వ్యాపకంగా మారింది. ఇక సెలబ్రిటీలకు ఇది తీవ్ర ఇబ్బందికర పరిణామంగా మారుతోంది. సోషల్ మీడియాల్లో దిగజారి కామెంట్లు చేసే అపరిపక్వ సమాజం, అందులో వ్యక్తుల గురించి ఏమని చెప్పాలి. విలువలకు తిలోదకాలిచ్చి తీవ్రమైన పదజాలంలో దూషించే లేదా ద్వేషించే మనుషులు సామాజిక మాధ్యమాల్లో పరిచయమవుతారు. కథానాయికలు లేదా నటీమణులను బూతు పదాలతో తిట్టే అలవాటు, సామాజిక మాధ్యమాల్లో చూస్తూనే ఉన్నాం. ఇలాంటి అనైతిక వ్యక్తులను నియంత్రించే వ్యవస్థ లేకపోవడం



కూడా పెను సమస్య. ఇటీవలి కాలంలో అందాల కథానాయిక, డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను విమర్శించే లేదా తీవ్ర పదజాలంతో దూషించే, అసభ్యకరంగా తిట్టే ఒక వర్గం రెడీగా ఉంటోంది. సదరు నటీమణి గురించి అగౌరవంగా, అవమాన కరంగా మాట్లాడే వ్యక్తులు సోషల్ మీడియాల్లో ఉన్నారు. వారు ఉపయోగించే భాష అత్యంత నీచమైనది. జూనియర్% సినిమాలోని కిరీటితో శ్రీలీల వైరల్ సాంగ్ నుండి స్క్రీన్‌షాట్‌లు, క్లిప్‌లను వైరల్ చేస్తూ పలువురు అసభ్యకర కామెంట్లను పోస్ట్ చేస్తున్నారు. శ్రీలీల డబ్బు కోసం అందాల్ని ఆరబోసేందుకు సిద్ధంగా ఉంటుందని ఒక నెటిజన్ కామెంట్ చేసాడు. చాలామంది అసభ్యకరమైన, అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. నిజానికి ఐటమ్ పాటల్లో చాలా మంది అగ్ర నాయికలు అందాల్ని ఆరబోసారు. కత్రిన కైఫ్, సమంత, తమన్నా, త్రిష లాంటి అగ్ర నాయికలు అందాల ఆరబోతలో ఎక్కడా తగ్గలేదు. కానీ ఇప్పుడిలా శ్రీలీలను మాత్రమే టార్గెట్ చేయడం తగునా? అని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోంది. అట్లీ తదుపరి చిత్రంలో శ్రీలీల నటిస్తుందని కథనాలొస్తున్నాయి. ఇటు టాలీవుడ్ లోను పలువురు ఫిలింమేకర్స్ వినిపించిన కథల్ని ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలిసింది.




# కవర్ స్టిల్‌తో మంట పెట్టిన రకుల్




తెలుగు ప్రేక్షకులకు కెరటం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్‌కి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో హిట్ దక్కింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే రకుల్ ప్రీత్ సింగ్‌కి టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. మెల్ల మెల్లగా స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన రకుల్ ప్రీత్ సింగ్ ఐదేళ్ల పాటు వరుస సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు ఇవ్వలేని స్థాయిలో బిజీగా సినిమాలు చేసింది. కానీ కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు కదా, తెలుగులో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గిన సమయంలో ఈ అమ్మడికి బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది.

**దే దే ప్యార్ సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకు...** బాలీవుడ్‌లో ఈమె చేసిన సినిమాలు సైతం నిరాశను మిగిల్చాయి. ఒకటి రెండు తప్ప పెద్దగా సినిమాలు ఆమెకు గుర్తింపును తెచ్చి పెట్టలేదు. రెండు మూడు ఏళ్ల పాటు అక్కడ వరుస సినిమాలు చేసినా పెద్దగా గుర్తింపు రాలేదు. దాంతో అక్కడ కూడా ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. గత రెండేళ్లుగా రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలు చాలా అరుదుగా వస్తున్నాయి. ఈ ఏడాది మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయినా కూడా లక్కీగా రకుల్ కి దే దే ప్యార్ దే సినిమా సీక్వెల్ లో నటించే అవకాశం వచ్చింది. అప్పట్లో దే దే ప్యార్ దే మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే ఈ సినిమా లో ఆమెకు నటించే అవకాశం దక్కింది. ఈ సీక్వెల్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సినిమా విడుదల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**బ్రైడ్స్ టుడే కవర్ పేజ్‌పై రకుల్ ప్రీత్ సింగ్...** రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఆరంభం నుంచి సినిమాలతోనే కాకుండా అందమైన ఫోటోలతోనూ ఆకట్టుకుంటూ వస్తోంది. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ వార్తల్లో నిలిచింది. ఈసారి ప్రముఖ మ్యాగజైన్ బ్రైడ్స్ టుడే కవర్ పేజ్ పై రకుల్ ప్రీత్ సింగ్ మెరిసిపోయింది. నడుము అందం చూపిస్తూ అందమైన నాభి అందాలను చూపించడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు, కన్నుల విందు చేసే విధంగా రకుల్ ప్రీత్ సింగ్ మేకోవర్ ఉంది. ఇంతటి అందమైన రకుల్ ప్రీత్ సింగ్‌కు ఇంత త్వరగా ఇండస్ట్రీ ఉద్వాసన పలకడం ఏ మాత్రం బాగా లేదు అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కుర్రాళ్ల గుండెలో గుబులు...** తెల్లటి డ్రెస్‌లో రకుల్ ప్రీత్ సింగ్ మెరిసి పోతున్న ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కవర్ పేజ్‌కే అందం వచ్చిందని, పేరుకు తగ్గట్లుగా భలే ఉందని రకుల్ ప్రీత్ సింగ్ కవర్ ఫోటోకు కామెంట్స్ వస్తున్నాయి. సాధారణంగానే రకుల్ ప్రీత్ సింగ్ చాలా అందంగా ఉంటుంది. స్కిన్ షో చేసినా, చేయకున్నా కూడా చాలా అందంగా రకుల్ ప్రీత్ సింగ్ ఉంటుంది. అలాంటి రకుల్ ప్రీత్ సింగ్ ను ఈ అందమైన కవర్ పేజ్‌లో చూస్తూ ఉంటే కుర్రాళ్ల గుండెలో మంట పెట్టినట్లు ఉందని చాలా మంది అంటున్నారు. కవర్ స్టిల్‌తో ఇంత అందంగా కనిపించవచ్చు అని ఈమెను చూస్తే అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంత అందంగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్‌కి మరో ఐదేళ్ల పాటు సినిమా ఆఫర్లు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# రామ్ చరణ్ తో జాన్వీ కపూర్ రొమాంటిక్ మెలోడీ!



జాన్వీ కపూర్ టాలీవుడ్ డెబ్యూ 'దేవర'లో గ్లామరస్ పాత్రలోనే కనిపించింది. కానీ తంగ పాత్రలో నటనకు అంతగా స్కోప్ కనిపించలేదు. హీరోతో కాంబినేషన్ సన్నివేశాలు కూడా చాలా పరిమితంగానే ఉన్నాయి. అలా తారక్ తో జాన్వీకి రొమాంటిక్ సన్నివేశాలు చేసే ఛాన్స్ కు దూరమైంది. కానీ 'పెద్ది'లో మాత్రం రామ్ చరణ్ తో రొమాన్స్ కి ఏమాత్రం కొదవలేదన్నది తాజా అప్డేట్. బుచ్చిబాబు కూడా రొమాంటిక్ డైరెక్టరే. హీరోయిన్లను అందంగా ఆవిష్కరించంలో దిట్టే అని తొలి సినిమా 'ఉప్పెన'తోనే ప్రూవ్ చేసాడు. కృతి శెట్టిని వెండి తెరపై అందంగా ఆవిష్కరించిన తీరుకు యువత ఫిదా అయింది. సినిమాలో హీరో-హీరోయిన్ మధ్య మాంచి రొమాంటిక్ సాంగ్ కూడా ఉంటుంది. ఇప్పుడా ఛాన్స్ పెద్దిలో కూడా తీసుకున్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం 'పెద్ది' షూటింగ్ హైదరాబాద్ లోనే జరుగుతోంది. తాజా షెడ్యూల్ లో కొంత టాకీ తో పాటు ఓ పాట షూటింగ్ కూడా నిర్వహిస్తున్నారట. ఇది రామ్ చరణ్-జాన్వీకపూర్ మధ్య వచ్చే ఓరొమాంటిక్ మెలోడీ సాంగ్ అట. రెహమాన్ ఈ పాటను ఎంతో హృద్యంగాను డిజైన్ చేసాడట. ప్రేమికుల మధ్య విరహ వేదనను పాటలో హైలైట్ చేయబోతున్నారట. మొత్తానికి ఈ మాస్ కంటెంట్ ఉన్న సినిమాలో రొమాంటిక్ గీతాలకు కూడా బుచ్చిబాబు పెద్ద పీట వేసినట్లు కనిపిస్తుంది. ఈ పాట విషయంలో బుచ్చిబాబు చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడట. యువత హృదయాల్ని దోచేలా ఈ పాట ఉంటుందని భావిస్తున్నాడట. ఈ ప్రాజెక్ట్ లో రెహమాన్ భామగయ్యారు? అంటే అందుకు కారణం కేవలం బుచ్చిబాబు పట్టుదలతోనే. టాలీవుడ్ లో ఎంతో మంది మ్యూజిక్ డైరెక్టర్లు ఉన్నా? వాళ్లందర్నీ కాదని మరీ చరణ్ ని ఒప్పించి రెహమాన్ కావాలని పట్టుబట్టి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ కోసం రెహమాన్ కూడా అంతే కసిగా పని చేస్తున్నారు. రెహమాన్ కూడా తెలుగు సినిమాకు సంగీతం అందించి చాలా కాలమవుతోంది. మధ్యలో వచ్చిన కొన్ని అవకాశాలు వదులుకున్నా పాన్ ఇడియా స్టార్ రామ్ చరణ్ చాన్స్ ను మాత్రం మిస్ చేసుకోలేదు. మ్యూజికల్ గా ఈ సినిమా సంచలనమవుతుందని అంచనాలైతే పీక్స్ లోనే ఉన్నాయి.

# సముద్రంలో సైరన్ మోగించిన కృతి!

వరుసగా కెరీర్ బెస్ట్ సినిమాలతో జోరు మీద ఉంది కృతి సనోన్. జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ అందుకున్న తర్వాత ఈ బ్యూటీ కెరీర్ ఎంపిక పరంగా మరింత జాగ్రత్త వహిస్తోంది. క్రూ లాంటి కమర్షియల్ కంటెంట్ ఉన్న సినిమాలో నటించిన కృతి సనోన్ దోపట్టి లాంటి కల్ట్ సినిమాతోను మెప్పించింది. సినిమాల కోసం సెట్లలో కుస్తీలు పడుతూ అలసిపోతున్న శరీరానికి కాస్తంత సాంత్వన కూడా అవసరం. అందుకే వీలున్న ప్రతిసారీ బికినీ బీచ్ సెలబ్రేషన్స్ లో చిల్ అవుతూనే ఉంది. ఆదివారం మరోసారి కృతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో క్రూయిజ్ షిప్‌లో తన వెకేషన్ కి సంబంధించిన ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోగ్రాఫ్ లో కృతి రంగురంగుల డిజైనర్ బికినీలో కనిపించింది. చుట్టూ బ్లూ సీ, క్రూయిజ్ పై భారీ



సెటప్, రుచికరమైన వంటకాల ఆస్వాధన, వైవిధ్యమైన ఫోటోషూట్లు.. ఇలా రోజంతా చిల్లింగ్ గా గడిచిపోయింది. ఇంతటి ఆనందకర సమయంలో కృతి ఒక అందమైన కవితను కూడా రాసింది. "ఉప్పు పట్టిన జుట్టు.. నా హృదయంలో ఇంద్రధనస్సు... అలలతో ప్రవహిస్తోంది.. పోస్ట్‌కార్డ్ సూర్యాస్తమయాలు!! అంటూ అందమైన కవితను శీర్షికలో రాసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. 1 నేనొక్కడినే, దోచేయ్, ఆదిపురుష్ లాంటి చిత్రాలతో తెలుగు ఆడియెన్ కి బాగా చేరువైన కృతి ప్రస్తుతానికి బాలీవుడ్ లో మాత్రమే నటిస్తోంది. మోస్ట్ అవైటెడ్ తేరే ఇష్క్ మే - షూటింగ్‌ను ఇటీవలే ముగించింది. తదుపరి రణ్ వీర్ డాన్ 3లో నటించనుందని వార్తలొస్తున్నాయి. కానీ అధికారికంగా దీనిని ప్రకటించాల్సి ఉంది.

# ప్రణీతా సుభాష్ గ్లామర్ ఎటాక్.. మైండ్ బ్లోయింగ్!

పెళ్లి అయ్యి తల్లి అయిన తర్వాత కూడా గ్లామర్ పరంగా తానేమీ తగ్గలేదని మరోసారి నిరూపించింది నటి ప్రణీతా సుభాష్. ఈ మధ్య గ్లామర్ డోస్ తక్కువ చేసినా.. తాజాగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె వేసిన రెడ్ గౌన్ లుక్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ స్లిట్‌తో, డీప్ నెక్ డిజైన్‌తో ఉన్న ఈ ఔట్‌ఫిట్‌లో ప్రణీతా నవ్వుతూ ఇచ్చిన పోజులు అభిమానులనే కాదు, నెటిజన్లను కూడా ఆకట్టుకుంటున్నాయి. శాంతను-నిఖిల్ డిజైన్ చేసిన ఈ ఎగ్జాటిక్ గౌన్ స్టైల్‌తో, ప్రణీతా అందం ఒక డిఫరెంట్ లెవెల్‌కు వెళ్లిపోయింది. ఇంతగానూ ఈ గ్లామర్ షోకి సోషల్ మీడియా నుంచి విపరీతమైన స్పందన వస్తోంది. " వావ్", "ప్రణీతా ఎవర్‌గ్రీన్ బ్యూటీ", "ఇంత గ్లామర్ తో కళ్లకు కనిపించటం మొదటిసారి" అంటూ కామెంట్లు



గుప్పిస్తున్నారు ఫ్యాన్స్. ఆమె రీల్ మీదనే కాకుండా స్టిల్స్ పైనా భారీగా లైక్స్, షేర్లు రావడం విశేషం. తెలుగులో బావ, అత్తారింటికి దారేది వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రణీతా, తమిళం, కన్నడలో కూడా వరుసగా అవకాశాలు అందుకుంది. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన ఆమె, ఇటీవల కొన్ని స్పెషల్ ఈవెంట్లలో మళ్లీ పబ్లిక్ అపియరెన్స్ ఇస్తోంది. తాజాగా ఆమె కాన్స్ 2025లో పాల్గొన్న లుక్‌తో మళ్లీ ఫిలిం క్రిటిక్స్ దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫొటోల్లో కనిపించిన ప్రణీతా కాన్ఫిడెంట్, స్టన్నింగ్ లుక్ చూసిన తరువాత.. ఆమెను మళ్లీ తెరపై చూడాలని కోరుకుంటున్నారు అభిమానులు. "గ్లామర్ పరంగా ఇంతగా ఆకట్టుకునే విధంగా మళ్లీ రీ ఎంట్రీ ఇస్తే బాగుంటుంది" అంటూ కామెంట్లు చేస్తున్నారు. వయసు, జీవిత పరిస్థితులు ఎంత మారినా.. గ్లామర్‌ను కాపాడుకోవడం తనకు ఎంత సులువు అనేది.. ప్రణీతా ఈ ఫోటోలతో మరోసారి ప్రూవ్ చేసింది.. ఇకపోతే ప్రణీతా మరోసారి సినిమాల్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536